# శాక్రమెంటో తెలుగు వెలుగు పత్రిక




శాక్రమెంటో తెలుగు సంఘం
శాక్రమెంటో తెలుగు వెలుగు పత్రిక

# గ్రేటర్ శాక్రమెంటో తెలుగు సంఘం

**TELUGU ASSOCIATION OF GREATER SACRAMENTO**

A 501(C)(3) Certified Non-Profit Organization; Federal Tax ID: 92-0189840

## విషయ సూచిక


"శాక్రమెంటో తెలుగు వెలుగు" పత్రిక - **2022** సంపాదక బృందం ........ 6

టాగ్స్ కార్యవర్గం 2021 - 2023 ........ 6

అక్టోబర్ సంచికలో ........ 9

సంపాదకీయం ........ 10

విరాళాలకు విజ్ఞప్తి ........ 13

ముఖచిత్రం వెనుక ముచ్చట్లు! : "అట్లతద్దోయ్... ఆరట్లోయ్...." - శ్రీ శేష కల్యాణి గుండమరాజు ........ 14

**"అన్నాచెల్లెలి గట్టు-7"** - కలికి (వెంపటహేమ – భారత్) ........ 17

**"స్ఫూర్తి ప్రదాత - గాంధీ "** - ఉమ (అమెరికా) ........ 25

శాక్రమెంటో తెలుగు సంఘం కార్యక్రమాలు ........ 29

మన తెలుగు తేజాలు 9 వ భాగం – **"త్రిపురనేని గోపీచంద్" :** శ్యామసుందర్ అంబడిపూడి ........ 35

టాగ్స్ ఆధ్వర్యంలో జరిగిన "శ్రీ UAN మూర్తి స్మారక 4వ రచనల పోటీ" ఫలితాలు - మీడియా కవరేజి లంకెలు ........ 39

**"ఉత్తమ కథానిక విభాగం"** లో ప్రశంసా పత్రం పొందిన కథానిక: రక్షణ కవచం - శేషా రత్నం పారుపుడి (టెక్సాస్, అమెరికా) ........ 40

**"ఉత్తమ కవిత విభాగం"** లో ప్రశంసా పత్రం పొందిన కవిత: పలకరింపు - యామిని రాజశేఖర్ కోళ్ళూరు (గల్ఫ్ - అబు దాబి) ........ 45

**"ఉత్తమ కవిత విభాగం"** లో ప్రశంసా పత్రం పొందిన కవిత: ఎదురు చూపులు - రవి మంత్రిప్రగడ (ఐర్లండ్) ........ 47

అశోక మౌర్య **-14 :** డా. వల్లూరుపల్లి శివాజీ రావు (రోజ్ విల్లి, కాలిఫోర్నియా) ........ 48

యోగా సాధన – 26 వ భాగము "సర్వాంగాసనం" – RVR Yogies ........ 53

మన ఆరోగ్యం మన చేతిలో...2వ భాగము - మన జీవన అలవాట్లు : మధు బుడమగుంట (అమెరికా) ........ 57
ఆధ్యాత్మికం 19 వ భాగము : "మాయా మంత్రం - గురు మంత్రం" : సేకరణ - ఆర్ వీ ఎస్ 1985 బ్యాచ్ గుంపు........ 59
టాగ్స్ కార్యక్రమాల సమాచారం నమోదు కొరకు........ 61
బాల కదంబం : జ్ఞానానందమయం - 8వ భాగం "బలవంతుడు " : శ్రీ శేష కల్యాణి గుండమరాజు (అమెరికా)........ 62
కవితా కదంబం : తెలుగుతో అనుబంధం - పేగు బంధం : శ్రీతేజ కలం - రచయిత: శశికాంత్ మెంచు ........ 65
చిత్ర కదంబం ........ 67
పత్రికా ప్రకటన - 8వ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సు - వంగూరి చిట్టెం రాజు ........ 68
8వ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సు ప్రసంగం - విజయ గొల్లపూడి, సిడ్నీ, ఆస్ట్రేలియా ........ 69
కథా కదంబం: అరిటాకు వెర్సస్ ముల్లు - శ్రీ పెయ్యేటి రంగారావు, నార్త్ కెరోలినా, అమెరికా ........ 76
సరదాగా కాసేపు – ఎదురుచూపులు - సేకరణ: RVS 1985 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థుల గుంపు........ 78
టాగ్స్ 2022 కార్యక్రమాల ఫోటోలు, వీడియోలు........ 82
కార్యకర్తల నియామకం ........ 83
మీ కథలు, కవితలు, మరియూ ఆర్టికల్స్ ప్రచురణకు........ 84
శాక్రమెంటో లో మన బడి తెలుగు తరగతులు - నాగ్ దొండపాటి ........ 85
మనసు పాట "మనసు ఒక మందారం... చెలిమి తన మకరందం.." - సంకలనం:ఉమా........ 88
స్పందన ........ 92

TELUGU ASSOCIATION OF GREATER SACRAMENTO

TAGS

గ్రేటర్ శాక్రమెంటో తెలుగు సంఘం

# "శాక్రమెంటో తెలుగు వెలుగు" పత్రిక - 2022 సంపాదక బృందం

వెంకట్ నాగం – ప్రధాన సంపాదకుడు

డా. శివాజీ రావు వల్లూరుపల్లి

డా. మధు బుడమగుంట

మనోహర్ మందడి

విజయ గొల్లపూడి

ఆదూరి హైమావతి

# టాగ్స్ కార్యవర్గం 2021 - 2023

| "టాగ్స్ సంఘం" శాశ్వత సభ్యులు (Foundation Board Members – Premanent) | | |
|---|---|---|
| శ్రీ భాస్కర్ దాచేపల్లి | శ్రీ. వాసు కూడిపూడి | శ్రీ మల్లిక్ సజ్జనగాండ్ల |
| శ్రీ ప్రసాద్ కేతిరెడ్డి | శ్రీ. డా. రాంబాబు బావిలిశెట్టి | శ్రీ డా. సంజయ్ యడ్లపల్లి |
| శ్రీ డా. శ్రీధర్ రెడ్డి జక్కిడి | శ్రీ. సుధాకర్ వట్టి | శ్రీమతి స్వర్ణ కంభంపాటి |
| శ్రీ అనిల్ మండవ | శ్రీ. వెంకట్ నాగం | |
| చైర్మన్, వైస్-చైర్మన్ (జూలై 2021 నుండి జూన్ 2023) | | |
| చైర్మన్ | శ్రీ అశ్విన్ తిరునాహరి | |
| వైస్-చైర్మన్ | శ్రీ మోహన్ కాట్రగడ్డ | |
| | | |
| కార్యనిర్వాహక సభ్యులు (Executive Committee) – (జూలై 2021 నుండి జూన్ 2023) | | |
| అధ్యక్షుడు | శ్రీ రాఘవ్ చివుకుల | |
| ఉప-అధ్యక్షుడు | శ్రీ ప్రేంచంద్ జొన్నల | |

| | | |
|---|---|---|
| కార్యదర్శి | శ్రీమతి శంకరి చీదల్ల | |
| ఉప-కార్యదర్శి | శ్రీమతి భానుదీప్తి ఉదయగిరి | |
| కోశాధికారి | శ్రీ సత్యవీర్ సురభి | |
| సమాచార అధికారి | శ్రీ శ్రీనివాస్ ఈర్పిన | |
| "ధర్మకర్త" సంఘం సభ్యులు (Trustee Board Members) – (జూలై 2021 నుండి జూన్ 2026) | | |
| శ్రీ అశ్విన్ తిరునాహరి | శ్రీ మోహన్ కాట్రగడ్డ | శ్రీ నాగ్ దొండపాటి |
| శ్రీ సందీప్ గుడిపెల్లి | శ్రీ సతీష్ కాంచి | శ్రీ సురేంద్రనాథ్ కొప్పారపు |
| "ధర్మకర్త" సంఘం సభ్యులు (Trustee Board Members) – (జూలై 2018 నుండి జూన్ 2023) | | |
| శ్రీ మనోహర్ మందడి | శ్రీమతి శ్రీదేవి మాగంటి | |
| కార్యనిర్వాహక సంఘం సభ్యులు (Executive Board Members) – (జూలై 2021 నుండి జూన్ 2023) | | |
| శ్రీమతి భానుదీప్తి ఉదయగిరి | శ్రీమతి హరిత తాడి | శ్రీ ప్రేంచంద్ జొన్నల |
| శ్రీ రాఘవ్ చివుకుల | శ్రీ సత్యవీర్ సురభి | శ్రీమతి శంకరి చీదెళ్ళ |
| శ్రీమతి శ్రీదేవి ఆళ్ళ | శ్రీ శ్రీనివాస్ ఈర్పిన | శ్రీ సుబ్రమణ్యం రెడ్డి కుమ్మిటి |
| శ్రీ శ్యాం యేలేటి | | |
| | | |
| సలహా సంఘం సభ్యులు (Advisory Board Members) – (జూలై 2021 నుండి జూన్ 2023) | | |
| శ్రీ జితేంద్ర బైని | శ్రీ మహిపాల్ లక్కిడి | శ్రీ నాగి పగడాల |
| శ్రీ రాజేష్ యెక్కలి | శ్రీ రంగ రటిపర్తి | శ్రీమతి శ్రీ శేష కల్యాణి గుండమరాజు |
| శ్రీ సూరిబాబు జెట్టి | శ్రీ శ్యాం అలిబంది | |
| | | |

| "యువ" సలహా సంఘం సభ్యులు (Youth Advisory Board Members) – (జూలై 2021 నుండి జూన్ 2023) | | |
|---|---|---|
| చి. ఆదిత్య బొల్లు | చి. అనూహ రెడ్డి | చి. ప్రణవి కొండూరు |
| చి. జిష్ణు దొండపాటి | చి. కీర్తన వంక | చి. భవిత్ జాస్తి |
| చి. రోహిత్ చివుకుల | | |

# పోషకులు/స్పాన్సర్స్ కు విజ్ఞప్తి

శాక్రమెంటో తెలుగు వెలుగు పత్రికలో మీ వ్యాపార ప్రకటనలకు లేదా యాడ్ ల కొరకు లేదా తదితర వివరాలకు సంపాదక బృందాన్ని ఈ-మెయిలు sactags@gmail.com కు సంప్రదించండి.

Request to All Sponsors

We welcome you to place your business advt in Sacramento Telugu Velugu Patrika,

In this regards we request you to contact us at sactags@gmail.com



# అక్టోబర్ సంచికలో....

## పాఠకులారా...,

శాక్రమెంటో తెలుగు వెలుగు అక్టోబర్ సంచిక పండుగల సంచికగా ముస్తాబై మీ ముందుకు వచ్చింది! ఈ సంచికలో టాగ్స్ ఆధ్వర్యంలో జరిగిన "శ్రీ UAN మూర్తి స్మారక నాల్గవ రచనల పోటీ" లో ప్రశంసా పత్రం పొందిన రచనలను మీకు అందిస్తున్నాము. ఈ సంచిక లో "మన ఆరోగ్యం మన చేతిలో" కొత్త శీర్షిక రెండవభాగం మీకు అందిస్తున్నాము. వీటితోపాటు, ప్రతినెలా మిమ్మల్ని అలరిస్తున్న "ముఖచిత్రం వెనుక ముచ్చట్లు", "స్ఫూర్తి ప్రదాత", "మన తెలుగు తేజాలు", "టాగ్స్ కార్యక్రమాల వివరాలు", "అశోక మౌర్య", "జ్ఞానానందమయం", "అన్నా చెల్లెలి గట్టు", వంటి మరెన్నో ఆసక్తికరమైన రచనలు ఈ సంచికలో మీకోసం పొందుపరచడం జరిగింది. తెలుగింటి పండుగ అట్లతద్ది పండుగ సంబరాల చిత్రాన్ని ఈ నెల ముఖచిత్రంగా అందించడం జరిగింది. ఇంకా ఎన్నో వినూత్న శీర్షికలతో మీముందుకు వచ్చిన ఈ సంచికను చదివిన తర్వాత మీ అమూల్యమైన అభిప్రాయాలనూ, సలహాలనూ మా ఈమెయిల్ telugusac@yahoo.com కు పంపడం మరచిపోకండి సుమా!

టాగ్స్ కు సంబంధించిన సమాచారం, ఈ పత్రిక కాపీ మరియు పూర్వ సంచికలు ఈ లంకె లో ఉంచబడ్డాయి : http://sactelugu.org/tags-patrika/ . శాక్రమెంటో తెలుగు వెలుగు పత్రిక మీ ఈమెయిలు కు ఠంచనుగా అందాలంటే ఈరోజే టాగ్స్ న్యూస్ లెటర్ కు ఈ లంకె ద్వారా నమోదు చేసుకోవలసిందిగా మా మనవి: https://tinyurl.com/jointags .



# గ్రేటర్ శాక్రమెంటో తెలుగు సంఘం

## TELUGU ASSOCIATION OF GREATER SACRAMENTO

A 501(C)(3) Certified Non-Profit Organization; Federal Tax ID: 92-0189840



# సంపాదకీయం

పాఠకులకు నమస్కారం. ఈ సందర్భంగా అక్టోబర్ నెల దసరా, దీపావళి, అట్లతదియ తదితర పండుగలతో సందడి చేయనుంది. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే భారత జాతిపిత బాపూజీ, యముడిని ఎదిరించి పరమేశ్వరుడి కృపచేత చావు పుట్టుకల జీవిత చక్రంను జయించిన మార్కండేయ జయంతి, ఆయుర్వేద బ్రహ్మ ధన్వంతరి జయంతి తదితర ఉద్దండులు ఈ నెలలో జన్మించారు. ఈ సందర్భంగా ధన్వంతరి గూర్చి క్లుప్తంగా తెలుసుకుందాం.

హిందూ సంస్కృతి ప్రకారం ధన్వంతరి ఆయుర్వేదం కి ఒక ఆదర్శ మూర్తి మరియు రోగాలు పారద్రోలే ఒక దేవుడు, వైద్యవృత్తికి మూల విరాట్ గా భావిస్తారు . భాగవతంలో క్షీరసాగర మధనం సమయంలో అమృత కలశాన్ని చేబట్టుకొని అవతరించిన శ్రీమహావిష్ణువు అవతారంని ధన్వంతరి అంటారు . ఇక బ్రహ్మవైవర్త పురాణం ప్రకారం భాస్కరుని (సూర్యభగవానుని) వద్ద ఆయుర్వేదం నేర్చుకొన్న వ్యక్తి ని ధన్వంతరి అంటారు. ఇతడు సూర్యుని 16 మంది శిష్యులలో ఒకడు. కాశీరాజు దేవదాసు ధన్వంతరి (అంటే "ధన్వంతరి" అన్న బిరుదు కలిగిన కాశీరాజు "దేవదాసు") – ఇతడు సుశ్రుతుడు కి ఆయుర్వేదం, శస్త్ర చికిత్స నేర్పాడు. ఇతడు పురాణాలలో చెప్పబడిన ధన్వంతరి అవతారమన్న విశ్వాసం ఉంది. సుశ్రుతుడు ఆయుర్వేదానికి చెందిన శస్త్ర చికిత్సకుడు. ఇతను క్రీ.పూ. 6వ శతాబ్దానికి చెందినవాడు. వారణాసిలో జన్మించాడు. ఇతని ప్రసిద్ధ గ్రంథం సుశ్రుతుడు సంహిత వైదిక సంస్కృతంలో వ్రాయబడింది. ఈ సుశ్రుత సంహిత లో వ్యాధులు వాటి నివారణోపాయాలు విపులంగా వ్రాయబడినవి. ఆయుర్వేద వైద్య విజ్ఞానానికి సుశ్రుతుడు గుండెకాయవంటివాడు. ప్రపంచంలోని యితర దేశాలు కళ్ళుతెరవక ముందే భారతదేశంలో శస్త్రచికిత్సను

విజయవంతంగా నిర్వహించి ఎందరి ప్రాణాలనో కాపాడిన "అపర ధన్వంతరి" సుశ్రుతుడు, అంటే యితడు ధన్వంతరి కాదు, కాని అంతటి వాడు. పూర్వకాలంలో గొప్ప గొప్ప ఆయుర్వేద వైద్యులను "ధన్వంతరి" అనే బిరుదుతో సత్కరించేవారు. కనుక వివిధ ధన్వంతరుల కథలు చరిత్రలో కలగలుపు అయి ఉండవచ్చును అని చరిత్రకారుల అభిప్రాయం. విక్రమాదిత్యుని ఆస్థానంలో "నవరత్నాలు"గా ప్రసిద్ధులైన పండిత ప్రతిభామూర్తులలో ఒకడు. ఇతడే "ధన్వంతరి నిఘంటువు" అనే వైద్య పరిభాషిక పదకోశ గ్రంథాన్ని రచించాడని మరి కొందరి  అభిప్రాయం.

భాగవతం అష్టమ స్కంధంలో క్షీరసాగర మధనం సమయాన సాగర గర్భంనుండి ఒక పురుషుడు, పీనాయుత బాహు దండాలను, కంబుకంఠాన్ని, పద్మారుణ లోచనాలను, విశాల వక్షఃప్రదేశాన్ని, సుస్నిగ్ధ కేశజాలాన్ని, నీల గాత్ర తేజాన్ని కలిగి, పీతాంబరం కట్టి, మణికుండలాలు ధరించి, పుష్పమాలా సమలంకృతుడై, హస్తతలాన అమృత కలశాన్ని దాల్చినవాడు ఆవిర్భవించాడు. అతని విష్ణుదేవుని అంశాంశ వలన పుట్టినవాడని, యజ్ఞభాగ భోజనుడు, ఆయుర్వేదజ్ఞుడు, మహనీయుడని బ్రహ్మాదులు గ్రహించి అతనికి "ధన్వంతరి" అని పేరు పెట్టినారు. భాగవతం లోనే నవమ స్కంధంలో కాశీరాజు ధన్వంతరి గురించి పురూరవ  వంశక్రమంలో ఉంది.

ఆ ప్రకారం పురూరవునికి క్షత్రవృద్ధుడు, అతనికి సుహోత్రుడు, సుహోత్రునకు కాశ్యుడు, అతనికి కాశి,  కాశికి దీర్ఘతపుడు, దీర్ఘతపునికి ధవ్వంతరి జన్మించారు. ధన్వంతరి హరి అంశతో ప్రభవించి ఆయుర్వేద ప్రవర్తకుడయ్యాడు.

విష్ణుపురాణంలో కూడా ఈ వంశక్రమం ఉంది. ధన్వంతరికి మూడవ తరంవాడు దివోదాసుడు (దివోదాస ధన్వంతరి).

ధన్వంతరి ఆయుర్వేద శాస్త్రాన్ని ఎనిమిది (8) భాగాలుగా (అష్టాంగాలుగా) విభజించారట. అవి...

కాయ చికిత్స (Internal Medicine)

కౌమారభృత్య లేదా బాలచికిత్స (Paediatrics)

భూతవైద్యం లేదా గ్రహచికిత్స (Psychiatry)

శలాక్యతంత్ర(Otto-Rhino-Laryngology & Opthalmology )

శల్యతంత్ర (Surgery)

విషతంత్ర (Toxicology)

రసాయన తంత్ర (Geriatrics)

వశీకరణ తంత్ర (The therapy for male sterility, impotency and the promotion of virility)

ఇక  కేరళ రాష్ట్రంలో సిద్ధ, ఆయుర్వేద వైద్య విధానంలో "అష్టవైద్యం" అనే ఒక విధానం ప్రసిద్ధి చెందింది. ఇది శతాబ్దాల తరబడి అవిచ్ఛిన్నంగా, పెద్దగా మార్పులు లేకుండా సాగుతున్నది. ఇలాంటి వైద్యం చేసే కుటుంబాలు ధన్వంతరిని పూజిస్తుంటారు. తమ

ఆశ్రమాల లో వీరు ధన్వంతరి ఆలయాలను, విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఆంధ్రప్రదేశ్‌లోని  తూర్పు గోదావరి జిల్లాలోని చింతలూరు లో న  ప్రసిద్ధమైన ధన్వంతరి భగవానుని దేవాలయం ఉంది. ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు ద్విభాష్యం వెంకటేశ్వర్లు 75 ఏళ్ల కిందట అంటే 1942లో చింతలూరులో ధన్వంతరి ఆలయాన్ని కట్టించారు. పచ్చటి పంటపొలాల నడుమ సువిశాలమైన స్థలంలో అత్యంత శోభాయమానంగా నిర్మించిన ఈ ఆలయంలోకి అడుగుపెడుతూనే మాటలకు అందని అద్భుతమైన అనుభూతి సొంతమవుతుంది. నిర్మాణ నాణ్యత, రమ్యత పెద్ద ఆలయాలకు ఏమాత్రం తీసిపోకుండా ఆరోజుల్లోనే లక్షలాది రూపాయల వ్యయంతో ఎక్కడెక్కడినుంచో శిల్పులను రప్పించి ఆలయ ముఖమంటపం మీద క్షీరసాగర మథన దృశ్యాలను కళ్లకు కట్టేలా చెక్కించారు ఆయన . అలాగే గోడల మీద ఏర్పాటు చేసిన  బ్రహ్మ, దక్షప్రజాపతి, అశ్వనీ దేవతలు, ఇంద్రుడు, భరద్వాజుడు, వాగ్భటుడు, ఆత్రేయుడు, శుశ్రుతుడు, చరకుడు తదితర వైద్యాచార్యుల శిల్పాలు అమితంగా ఆకట్టుకుంటాయి. వ్యాధి నివారణకు, ఆరోగ్యాని ఆకాంక్షించే ప్రజలు ఇక్కడి దేవుడిని దర్శించి ప్రార్థనలు చేస్తుంటారు.

ఆయుర్వేద వైద్యులు ప్రతియేటా "ధన త్రయోదశి" (దీపావళికి రెండు రోజుల ముందు) నాడు భక్తితో ఈ వ్రతం జరుపుకొంటారు. ధన్వంతరి మంత్రం: "ఓం నమో భగవతే వాసుదేవాయ ధన్వంతరయే అమృత కలశ హస్తాయ సర్వామయ వినాశనాయ త్రైలోక్య నాథాయ శ్రీ మహా విష్ణవే నమః" ఈ  మంత్రాన్ని జబ్బుతో ఉన్నవారు 108 సార్లు జపిస్తే ఉపశమనం లభిస్తుందని కొందరి విశ్వాసం. కరోనా సమయాన లక్షలాది మంది ప్రజలు ఈ మంత్రాన్ని జపించి ఉపశమనం పొందారని ఆయుర్వేద వైద్యుల  ఉవాచ.

అయితే "గ్రహచికిత్స (Psychiatry )" కు గ్రహణం పట్టించి భూతవైద్యం పేరుతో మోటు పద్ధతులతో వర్తమాన భూతవైద్యులు ప్రజలతో ఆటలాడుకుంటున్నారు. అయితే ఈ పద్ధతులపై మరింత పరిశోధన జరిపి ప్రజలకు నాణ్యమైన ఆయుర్వేద వైద్యం అందించే అధునాతన వర్తమాన "ధన్వంతరి"లను తయారు చేసి తద్వారా మెరుగైన సమాజాన్ని ఏర్పరిచే  బాధ్యత ఎవరిదీ? ఖచ్చితంగా ప్రభుత్వానిదే కదా? ఆయుర్వేద వైద్యవృత్తికి  మూల విరాట్ అయిన అసలు "ధన్వంతరి" కి అదే అసలైన నివాళి.

గత నెల సెప్టెంబర్ సంచికలో "శోధన – బాలల నవల" ధారావాహిక 6వ భాగం అందించాము. దీనితో ఈ నవల పూర్తి అయింది. "శోధన – బాలల నవల" ను శాక్రమెంటో తెలుగు వెలుగు పాఠకులకు అందించిన శ్రీమతి ఆదూరి హైమావతి (భారత్) కు మా కృతజ్ఞతలు. ఇక అక్టోబర్ సంచిక విషయానికొస్తే, ఈ సంచికలో అనేకమంది సాహితీ సైనికులు శ్రమకోర్చి చక్కని శీర్షికలతో తమ వంతు సాహిత్య సేవ అందించారు. ఈ సంచికను చదివి మీ అమూల్య సలహాలు, సూచనలు మాకు అందిస్తారని ఆశిస్తూ, శెలవు తీసుకుంటున్నాను.

సర్వేజనః సుఖినోభవంతు

**వెంకట్ నాగం**

(సంపాదకుడు – శాక్రమెంటో తెలుగు వెలుగు) telugusac@yahoo.com

# విరాళాలకు విజ్ఞప్తి

## TELUGU ASSOCIATION OF GREATER SACRAMENTO (TAGS)

A 501(c)(3) Non-Profit Organization – Federal Tax Id: 92-0189840

### Donor Pledge Form

*Please complete your contact information below check all that applies:*

Donor(s) Name: ______________________________

Address: ______________________________

Phone: ____________________ Email: ____________________

Signature: ____________________ Date: ____________________

**A GIFT OF SUPPORT**

☐ I enclose a check for $__________, payable to TAGS

☐ I Pledge a gift of $__________, payable on or before __________

**Please put my gift toward:**

☐ General Support of TAGS Mission

☐ Education Fund

☐ TAGS Katha Kavita Contest

☐ Other or Split between:
__________ &
__________________

**Other Directions:**

☐ My employer participates in the matching gift program
Name of Employer:
__________________

☐ I would like this donation to be anonymous.

☐ (Optional) My donation is in memory of: __________
Please send an acknowledgement to
Name: __________________
Address: __________________

**A GIFT OF YOUR TALENTS & TIME**

I would like to volunteer my time to help by offering the following skills:

☐ Organizing ☐ Fundraising ☐ Marketing ☐ Other: ______

**Please write check on the name of TAGS and mail to:**

**TAGS, Post Box: 1666, Folsom, California 95763**

Now you can donate to TAGS online here: **https://tinyurl.com/donatetags**

*** Thank you ***

---

**Website:** http://www.sactelugu.org
**Facebook:** https://www.facebook.com/SacTelugu

# ముఖచిత్రం వెనుక ముచ్చట్లు! : "అట్లతద్దోయ్... ఆరట్లోయ్...." - శ్రీ శేష కల్యాణి గుండమరాజు

శరన్నవరాత్రుల సంబరాలు ముగియగానే వచ్చే అచ్చతెలుగు పండుగ 'అట్లతద్ది'. ఆశ్వయుజ మాసంలో దసరా తర్వాత వచ్చేటటువంటి తృతీయ తిథినాడు ఈ పండుగను జరుపుకుంటారు. అట్లతద్ది రోజు అమ్మవారిని గౌరీదేవిగా పూజించి 'అట్లు' నైవేద్యం పెడతారు. తృతీయ తిథిని తదియ అని కూడా అంటారు. అదే 'తద్ది' అయ్యింది. అందుకని ఈ పండుగకు అట్ల-తద్ది అని పేరు వచ్చింది. ఇది ప్రధానంగా ఐదేళ్లు దాటిన ఆడపిల్లలూ, పెళ్లి కావలసిన కన్యలూ, పెళ్ళైన స్త్రీలూ చేసుకునే పండుగ. పెళ్లి కావలసిన ఆడపిల్లలు తమకు మంచి భర్త లభించాలనీ, పెళ్లి అయిన స్త్రీలు తమ భర్తలు అన్నివిధాలా సుఖంగానూ సంతోషంగానూ ఉండాలన్న కోరికతోనూ గౌరీదేవికి పూజిస్తూ అట్లతద్దినాడు వ్రతాన్ని ఆచరిస్తారు. ఈ వ్రతం చెయ్యని ఆడపిల్లలకు ముసలి భర్త వస్తాడని అంటారు!



మొట్టమొదట ఈ వ్రత విధానాన్ని శంకరుడిని పొందటానికి తపిస్తున్న గౌరీదేవికి నారదమహర్షి ఉపదేశించాడట. ఈ పండుగను జరుపుకోవాలని అనుకున్నవారు అట్లతద్ది ముందురోజు, అంటే విదియనాడు, తల స్నానంచేసి, గోరింటాకు పెట్టుకుంటారు. ఆరోజు రాత్రి అన్నం వండి సిద్ధంగా ఉంచుతారు. మర్నాడు, అంటే అట్లతద్ది తెల్లవారుఝామున, ఆడవారు చీకటితోనే నిద్రలేచి స్నానాది

కార్యక్రమాలు ముగించుకుని, గౌరీదేవికి భక్తిశ్రద్ధలతో పూజించి, ముందురోజు రాత్రి వండి పెట్టుకున్న అన్నాన్ని అమ్మవారికి నివేదన చేస్తారు. ఆ తర్వాత, సూర్యోదయానికన్నా ముందే ఆ చద్దన్నంలో గోంగూర పచ్చడి కానీ, కంది పచ్చడి కానీ, పొట్లకాయ కూర కానీ వేసుకుని నెయ్యి లేక వెన్నలో నంచుకుంటూ భోజనం చేస్తారు ఆడపిల్లలు. అటుపై వారు రకరకాల ఆటలాడుతూ రోజంతా ఉపవాసముంటారు. తెల్లవారకమునుపు వెన్నెలవెలుగులో మొదలుపెట్టే ఈ ఆటలు సాయంత్రం చీకటి పడేంతవరకూ సాగుతాయి. అట్లతద్ది నాటి ఆటలలో ఉయ్యాల ఊగటానికి ప్రత్యేక స్థానం ఉంది. పల్లెటూళ్ళల్లో ఉండే పండ్ల తోటల్లో చెట్లకు తాడుతో ఉయ్యాలలు కట్టి, ఆడపిల్లలంతా ఒకరికొకరు పోటీలు పడిమరీ పెద్దపెద్ద ఊపులు సరదాగా ఊగుతారు. చంద్రోదయం వేళకు ఇళ్ళు చేరుకొని మళ్ళీ గౌరీదేవికి పూజించి, ప్రత్యేకంగా తయారు చేసిన అట్లు గౌరికి నివేదన చేసి, చంద్ర దర్శనం చేసుకున్న తర్వాత ముత్తైదువలను పిలిచి వారికి వాయనం ఇచ్చి వ్రతాన్ని ముగిస్తారు.




మన పూర్వీకులు వాతావరణంలో వచ్చే మార్పులనూ దృష్టిలో పెట్టుకుని మనకు పండుగలు చేసుకునే పద్ధతులను సూచించారు. కాబట్టి మనం శాస్త్రబద్ధంగా జరుపుకునే పండుగల వెనుక పరమార్థం చూసినట్లయితే ఆ పద్ధతులు మనకు ఇహంలో ఆరోగ్యాన్నీ పరంలో పుణ్యాన్నీ ఇచ్చేవిగా ఉంటాయి. అట్లతద్ది పండుగ కూడా ఆ కోవకే చెందుతుంది. అదెలాగో చూద్దాం!

అట్లతద్ది ముందురోజు ఆడపిల్లలు చేతులకు గోరింటాకు పెట్టుకుంటారు. గోరింటాకు పెట్టుకోవడంవల్ల గోళ్లు ఎంతో ఆరోగ్యంగా ఉంటాయి. అందానికి అందం కూడానూ! అట్లతద్దినాడు, అంతకుముందు రోజు రాత్రి వండిన అన్నాన్ని అమ్మవారికి నివేదించి అది ఆరగించడం ఆచారం. చద్దన్నంలో అనేక పోషకాలు ఉంటాయనీ, మనకు అది చలువ చేస్తుందనీ మనం వింటూనే ఉంటాం. వర్షాలు వెనుకబట్టి చలికాలం రాబోతున్న తరుణంలో వచ్చే అనారోగ్యాలను ఎదుర్కొనే శక్తిని నువ్వులపొడి, కందిపచ్చడి వంటి

పదార్థాలు మనకు ఇస్తాయి. అందుకే ఆ సమయంలో వాటిని తప్పక తినాలి అని చెప్పారు మన పెద్దలు. భూమిపైనున్న సకల జీవరాశులపై అంతరిక్షంలోని గ్రహాల స్థితిగతుల ప్రభావం ఉంటుంది. శారీరక ఆరోగ్యానికి సూర్యుడు ఎంత ముఖ్యమో మానసిక ఆరోగ్యానికి చంద్ర కిరణాలు అంతే ముఖ్యం. వెన్నెలలో గడపడంవల్ల మనసు కొంత చల్ల పడుతుంది. తద్వారా మనకు మంచి ఆలోచనలు వస్తాయి. ఆ చంద్రుడు పదహారు కళలతో పూర్ణంగా ఉండే కాలం శరత్కాలం. బహుళపక్షంలో తెల్లవారుఝామున ఈ వెన్నెలకాంతి మనకు ఎంతో మంచి చేస్తుంది. అట్లతద్ది పండుగనాడు వెన్నెలలో ఆడుకోవడం వెనుకనున్న అసలు కారణం ఇది. ఆటలవల్ల శరీరానికీ, వెన్నెలవల్ల మనసుకీ మంచి ఆరోగ్యం చేకూరుతుంది. ఊళ్లోని ఆడపిల్లలందరూ బీదా-గొప్పావంటి తారతమ్యాలు మరచి ఆనందంగా కలిసి ఆటలాడటంవల్ల వారికి మానసిక ఆరోగ్యం కలగడంతోపాటు సామాజిక నైపుణ్యాలు కూడా పెరిగి. స్నేహబంధాలు ఏర్పడతాయి. ఇవన్నీ ఇహానికి సంబంధించిన విషయాలు. పరాన్ని గురించి ఆలోచిస్తే, ఆధ్యాత్మికపరంగా బ్రహ్మ ముహూర్తానికి ఒక విశిష్టత ఉంది. ఆ సమయంలో చేసే ఏ సాధనైనా మనకు విశేష ఫలితాలను ఇస్తుంది. అట్లతద్ది నాడు, అటువంటి పవిత్ర సమయంలో, అమ్మవారి పరిపూర్ణ స్వరూపమైన గౌరీదేవిని పూజించడం ద్వారా మనకు సకలశుభాలూ కలుగుతాయి. అట్లతద్ది పండుగలో అట్లకు ప్రాముఖ్యత ఉంది. నవగ్రహాలలోని కుజగ్రహానికి అట్లు ప్రీతి. కుజగ్రహ అనుగ్రహంవల్ల వివాహబంధం సవ్యంగా ఉండటమేకాక సంతానమూ అభివృద్ధి చెందుతుంది.




కుటుంబవ్యవస్థ పటిష్టంగా ఉండటానికీ, ఆరోగ్యకరమైన సంతానం పొందటానికీ ఎంతగానో ఉపకరించే ఈ అట్లతద్ది పండుగ క్రమంగా కనుమరుగైపోతోంది. మన పూర్వీకులు మనకు అందించిన సంస్కృతిని కాపాడుకునే బాధ్యత మనదే. కాబట్టి 'అట్లతద్ది' పండుగను ఈ సంవత్సరం అందరం కలిసి ఆనందంగా జరుపుకుని, మన తెలుగు పండుగల ప్రత్యేకతలనూ, విలువలనూ చక్కటి ఆటల ద్వారా భావితరాలకు నేర్పుదాం. (ఈ శీర్షికకు ఆధారం: చిన్నప్పుడు పెద్దలు నాకు నేర్పిన విషయాలు, అంతర్జాలంలో లభ్యమైన వివరాలు, మరియు శ్రీమతి B.N.L. నాంచారమ్మ గారు అందించిన సమాచారం)

# "అన్నాచెల్లెలి గట్టు-7" - కలికి (వెంపటిహేమ – భారత్)

వెలుగు రాగానే గంప ఎత్తుకుని బయపుదేరింది రాగమ్మ.వతనులున్న ఇళ్లదగ్గర పిలిచిమరీ అడుగుతోంది "ఏలాచేప మాంసం" కావాలా అని. నిన్న సాయంకాలం రాగమ్మ కొడుకు సరదాగా స్నేహితులతో కలిసి సముద్రం మీదికివెళ్ళి గాలం వేస్తే, అనుకోని విధంగా ఏలాచేప వచ్చి ఆ గాలానికి చిక్కింది. నలుగురూ చేరి బల్లేలతో పొడిచి, దాన్ని చంపి ఒడ్డుకు తెచ్చారు. అంత పెద్ద చేపను తిని జీర్ణించుకోవాలంటే చాలామందే కావాలి మరి! కొంత పంచిపెట్టగా ఇంకా ఉన్నది తీసుకుని అమ్మడానికని ఊరుమీదికి బయలుదేరింది రాగమ్మ . వతనుల వాళ్లతోపాటు పనిలోపనిగా సుబ్బయ్య ఇంటి తలుపు కూడా తట్టింది. సుబ్బయ్య భార్య వచ్చి తలుపు తెరిచింది.

"ఏలాసేప మాంసం గావాలా? ఎప్పుడు గావాలంటే అప్పుడు దొరకదు మరి" అని అడిగింది రాగమ్మ బెల్లింపుగా.

"అకాలంలో అంత పెద్ద సేప ఎలా దొరికిందబ్బా" అంటూ ఆశ్చర్యపోయింది సుబ్బయ్య భార్య.

రాగమ్మకు పుట్టింటివైపు బంధువు సుబ్బయ్య భార్య. పుట్టినది బెస్త కులంలోనైనా చేపలవేటను వృత్తిగా చేసుకోలేదు సుబ్బయ్య. పట్నం నుండి సరుకుకోసం వచ్చే చేపల వర్తకులకు రాయతీగా సరుకు ఎక్కడ దొరుకుతుందో, దానికోసం ఎవరిని, ఎప్పుడు, ఎక్కడ కలుసుకోవాలో వగైరా సమాచారాన్ని అందిస్తూ, ఇరుపక్షాలవారికీ మధ్యవర్తిగా పనిచేస్తూ, ఒక్క ఎర్రని ఏగానీ పెట్టుబడిగాని, పెద్ద శ్రమగానీ – ఏమీ లేకుండానే దళారి వృత్తి చేసి వేలకి వేలు సంపాదిస్తున్నాడు. " ఫ్రమ్ ది రాగ్స్ టూ రిచెస్" అన్నట్లు క్రమంగా ఎదిగి, కులపోళ్ళలో కలవాడిగా పేరుపొందాడు. రాగమ్మకు దగ్గరి బంధువే, ఐనా అంతస్తుల తేడావల్ల వాళ్ళ బ్రతుకులమధ్య సాపత్యమన్నది లేదు.

పూసిన తంగేడులా ఒంటినిండా బంగారు నగలతో మెరిసిపోతున్న సుబ్బయ్య భార్య రవణమ్మను చూసి అనుకుంది రాగమ్మ , "సిన్నదనంలో ఒకే కుండలో ఒండిన కూడుదిని పెరిగినోళ్ళమ్! దగ్గరోళ్ళమ్, అయితేనేం – దాని అదురుట్టమ్ ఏరు, నాది ఏరు! పొద్దుగూకులా కట్టం సెత్తేగాని సెయ్యి నోటికాడికి పోకూడదని నా నొసటను రాసి ఉంటే ఇలాగాక నా బతుకు ఇంకెలా గుంటాది! నా నింతే పెట్టిపుట్టాను మరి " అనుకుంది రాగమ్మ దిగులుగా.

"అట్టా సూస్తున్నా వేంటి రాగమ్మా! ఇంత పెందలకాడే ఇటోచ్చావంటే ఏదో ఇశేసమ్ ఉండే ఉంటాది?"

"నే సెప్పా గందా! ఇక ఏరే ఇశేసమేం లేదు, అదే ఇశేసమ్. ఏలాసేప అన్నప్పుడూ దొరకదు గందా! ఐనోళ్ళు, మీగ్గూడా రోంత రుసి సూపిద్దారని ఇటచ్చిన . నిన్న సందమాటేల మా అబ్బులు, స్నేయిటులతో కలిసి దోనెలేసుకుని సముద్దరమ్ మీడికెల్లి ఇలాసంగా గాలా లేసినారంట! ఆడి పున్నెమేమోగాని, మా అబ్బులు గాలానికి సేప సిక్కినాదంట! అది అక్కడే ఆడతా ఉంది గామోసు, వచ్చి లటుక్కున గాలాన్ని పట్టేసిందంట! అంతపెద్ద సేపని సూసేతలికి ఈడి గుండె గుభేల్ మన్నాదంట. గాలం వదలకుండా పెద్దగా అరిసి, కేకలుపెట్టినాడంట. సుట్టూ ఉన్న సావాసగాళ్ళంతా వేగంగా దోనెలు తోసుకుంటా దగ్గరగా వచ్చి, బల్లాలు గుచ్చి - ఎలాగైతేనేం సేపను సంపి ఒడ్డుకు తెచ్చారు. అప్పటికప్పుడు ఆ సేపను నరికి ఆల్లంతా తలో కూంత అట్టుకుపోయారు. ఇంకా శానా మిగిలింది. వతనోళ్ళందరికీ ఇచ్చి వచ్చా. నిన్నుగూడ ఒపాలి కనుక్కుపోదారని ఇటచ్చిన" అంది రాగమ్మ .

" మాయదారి జిమ్మ( జిహ్వ = నాలుక) కొత్తకొత్త రుసులు అడుగుతాది. రోజుకో రుసి గావాల దానికి! ఇయ్యేల వాలుగైతే, రోపు సవారసేప; ఆ మరుసటిరోజు ఉల్లాకు కావాలంటది, ఎదవ జిమ్మ. నాల్రోజులు వరసకీ ఉప్పునీటి సేపలు తినగానే, తియ్యనీటి

సేపలకోసం దోరాడతాది. పులసలు గానీ, పక్కెలుగానీ, బొమ్మిడాయిలుగానీ, పాలికలు గాని ఉంటే తీసుకొనీదాన్ని. ఏలాసేప అంత రుసనిపించదు. " నిట్టూర్చింది రవణమ్మ.

"లేదులే, అలా అనమోకు. దేని రుసి దానిది! ఇది అన్నప్పుడూ దొరికే వత్తువేంగాదు గందా... రేత్తిరికాడ నేను ఇగురు జేసినా. దాకనిండా సేసినా నా కాడికి ముక్క మిగల్లేడు, నమ్ము- నీతోడు! సివరకి దాక ఊడ్సుకు తిన్నా. నువ్వు ఏ మాటా తేలిస్తే, బేగే ఇంటికాడికెళ్ళి నాకోసం మళ్ళీ సేసుకుంటా."

" ఏమో మరి! మా వోళ్ళు తింటారో, తినరో ... కనుక్కోవాలి " అంటూ నాంచి నాంచి నసిగింది రవణమ్మ.

" మా ఆయిన సెవి నిల్లుగట్టుకుని పోరి పోరి మరీ సెప్పిండు, " ఎందుకే ఎట్టిమొగమా, కాళ్ళరిగేలా ఊరంతా తిరగడం, ఏ హోటేలుకో ఏసేత్తే పోదా ఏంటి" అంటా. నానే ఇనుకోలేదు. ఎప్పుడోగాని దొరకని రుసి, వతనిల్లోళ్ళందరికీ ఇవ్వాల , అందరూ రుసి సూడాల – అంటా బయలెల్లా. పర్లేదులే అప్పా! అందరూ సంతోసంగా కొనేశారు. ఈ కూంతా అట్టుకుపోయి నా నొండుకుంటా. మరి నే నెల్లిరానా " అంటూ అరుగుమీద కూర్చున్నదల్లా లేచింది రాగమ్మ.

" ఆగు, నాకాడ సిల్లరలేదు, ఇప్పుడు సరుకిచ్చి డబ్బుకి రోపాచ్చీ మాటైతే ఇవ్వు. నీ సొమ్ము నేనుంచుకోనులే, రోపిటచ్చినప్పుడురా, ఇచ్చేత్తా. "

" కాదప్పా! నీకు తెలీనిదేవుందిలే, నేనలా నువ్వడిగినట్టే ఎట్టీదాన్నేగాని, ఈ డబ్బు నాకు శానా అవుసరం. ఇంటో బియ్యం నిండుకున్నాయి, సమురూ సరిపోయినాది. కిరోసిన్ నూనె రేత్తిరికాడ సిమ్నీబుడ్డి ఎలిగించాలంటే సుక్క కూడా లేదు. ఇయన్నీ కొంటేగాని ఈ పూట గడవదు. నే నిన్నందాల తసనాలు పడుతున్నా ఇంటి మొగోనికి సీమ కుట్టినట్టుకూడా ఉండదు. ఆడూ, ఆడి సారాబుడ్డీ సల్లగుంటే సాను. నీకన్నీ ఎరికే కందా! ఏలకి కూడెట్టకపోతే సాలు ఇంటెల్లపాదీ నా ప్రేనానికి పడి ఏడుస్తారు. ఈ మాయదారి సంసారాన్ని నా ఒంటిరెక్కమీన పోసించాల. అంతా నా తల్రాత" అంటూ పైట చెంగుతో కళ్ళు ఒత్తుకుంది రాగమ్మ.

రవణమ్మ మనసు కరిగింది, రాగమ్మమీద జాలి పుట్టింది. " ఊకో రాగమ్మా! నీ కట్టం నాకేలికేలేయే. అసుమంటి కాపురాన్ని నువ్వుగనక ఓపిగ్గా ఈదుకొస్తున్నావు గాని, అదే నానైతే...! సర్లే , ఏభై రూపాయిలది ఎట్టు, డబ్బిత్తా" అంటూ కొంగు ముడి ఇప్పి డబ్బు తీసింది.

"ఏంసెయ్యను అప్పా! ఆ బగమంతుడు నా నొసట లా రాశాడు! నా కనిపిస్తాదీ – ఇసుమంటి సమసారాన్ని ఈదడంకన్నా ఆ సముద్దరమ్ ఈదడమే తేలికని!"

"ఇదిగో, రాగమ్మ! మరీ పిసరం తెట్టమోకు, కూంతంత సెయ్యి ఇదిలించు. ఇదిగో, ఈ పదీ ఉంచు, తక్కింది రోపిత్తా" అంటూ పది రూపాయిల నోటు తీసి రాగమ్మకి ఇవ్వబోయింది. కానీ ఆ పదిరూపాయిలూ రాగమ్మ అందుకోలేదు.

" కార్తి వచ్చి మళ్ళీ సముద్దరమ్ పండితేగాని నానిటు రాను. మొత్తం ఇచ్చెయ్యి అప్పా! తగులాటమ్ వదిలిపోద్ది."

కొత్తాపాతా సందు కావడంతో అమ్మీవాళ్ళకే కాదు, కొనీవాళ్ళకూ సరుకు దొరక్క గిజాటుగానే ఉంది. చివరకు రవణమ్మకి మొత్తం ఏభై ఇవ్వక తప్పలేదు. పది వెనక్కిపెట్టి, ఏభై నోటు తీసి రాగమ్మకి ఇచ్చింది రవణమ్మ.

డబ్బు తీసుకున్నాకే, బాదమాకులు పైకితీసింది రాగమ్మ. రవణమ్మ ఊరుకోలేదు, " పిసరంతెడుతున్నావ్! ఇంటో తినీటోల్లు శానామందే ఉన్నారు. నా సేత మళ్లీ మళ్ళీ కొసిరించమోకు" అంది.

"రవణమ్మప్పా! నా న్నీకు అన్నేయమ్ సేత్తానా ఏంటి! మనం మనం దగ్గరోళ్ళమ్. ఇయ్యేళ అవుసరంకొద్దీ సెయ్యి సాపానేగాని, ఉట్టిపున్నేనికే నీకు వోటా ఎట్టాల్సినదాన్ని గానా! అంతా నీ కెరికే గందా, దరలన్నీ మండిపోతన్నాయి, ఏభై రూపాయిలకు ఇంతకన్నారాదు. అక్కడికీ నీకు ఎక్కువే ఎట్టా."

బాదమాకులలో పెట్టిన చేపమాంసం గుమ్మంలో ఉంచి, లేచి తట్ట తలకెత్తుకుని ఇంటిదారి పట్టింది రాగమ్మ. తెలిసినవాళ్ళకీ, తెలియనివాళ్ళకీ కూడా సరుకుతోపాటుగా మాటలు కూడా చేర్చి అమ్మి, సొమ్ము బాగానే సంపాదించింది ఆమె. చేతినిండా డబ్బు రావడంతో ఆమెకు చాలా సంతోషమ్ గా ఉంది. కావలసిన వస్తువులన్నీ తెచ్చి మరీ వంట చేయాల్సి ఉండడంతో ఆమె ఇంటివైపు చురుగ్గా అడుగులు వేస్తోంది. పక్క వీధినుండి వస్తున్న నీలమ్మ రాగమ్మను చూసి, పిలిచింది. " రాగమ్మక్కా! కొంచెం ఆగు" అంటూ గట్టిగా కేకపెట్టింది. నీలమ్మను చూసి ఆగింది రాగమ్మ. రాగమ్మను సమీపించి, " ఏంటమ్మోవ్! జటకా బండిలా అంత ఇసురుగా ఎలిపోతున్నావు, అరిజంటా ఏంటీ" అని అడిగింది నీలమ్మ.

"మరేం లేదు! మా అబ్బులు మిదం రేత్తిరి ఏలాసేపను కోసేడు గందా, అది ఒతనోళ్లకు ఇచ్చి వత్తున్నా. సరుకులట్టుకొచ్చిగాని ఒంటసెయ్యడానికి లేదు. ఏల మీరిపోతావున్నాదని ఈ తొందర."

"ఒక ఊసున్నాది, ఇనిపోదూగాని; నర్సమ్మ నీతాన సెప్పమన్నాది. సముద్దరంలో పడి కొట్టుకొచ్చి నామెకు నయమైనాదంట, కానీ శానా నీరసంగున్నదంట. ఇంకా కొన్నాళ్ళు మందులోడాలంట! ఆ యమ్మని ఎల్లుండి ఇంటికి అంపేత్తారంట, వచ్చి తీసుకెళ్లమని మీతో సెప్పమంది. నర్సమ్మ ఆ పేసెంటుకి నిజంగా నువ్వు అమ్మవనీ, కన్నయ్య మావ అనీ నమ్మినాది. "

మూత్తిప్పి అంది రాగమ్మ , " సడే! సూత్తన్నావుగా నా సంబడం. కన్నోళ్ళతోనే నా నేగలేకపోతన్నాను. తెల్లారి లేత్తే సాలు, కంచంలోకి ముద్దెలా వస్తాది — అని ఎతుకులాడే నాను ఆయమ్మకేం సాయం సెయ్యగలను! అప్పుడా అమ్మిని సూత్తే, సముద్దరం ఎత్తుకుపోయిన నా రాదమ్మ గురుతొచ్చినాది. ఆ బిడ్డ బతికుంటే ఇంతయ్యేదిగందా — అనిపిచడంతో, ఆసుపత్రికాడ – ఏదో ఆపద్దరమంగా, ఆమె నా బిడ్డ రాదమ్మేననీ, సముద్దరంలో తానం సేత్తావుంటే కెరటం లాక్కుపోయి కూంచేపయ్యాక ఒడ్డుకు ఇసిరి కొట్టిందనీ, ఎంటనే ఆసుపత్తిరికి లగెట్టుకొచ్చామనీ సెప్పినా. కన్నయ్య నన్ను " అప్పా, అప్పా" అంటా నా సుట్టుసుట్టూ తిరుగుతా ఉంటే సూసి, ఆడ్ని అంతా నా తమ్ముడే అనుకున్నారు. ఇయ్యా మా సుట్టరికాలు! అల్లా అనమట్టి ఎంటనే ఆ యమ్మకు వొయిజ్జం జరిగింది. ఇది సాలు, ఇంకేం నా వొల్లకాదు. పేరుకే దరమాసుపత్తిరిగాని, పేసంటుని ఇంటికి పంపేటేల బగుమతులంటూ సేనా డబ్బులు గుంజుతారు, తెలుసా! నే బోను."

"అదోకటేనా ఏంటీ! ఈ తరువోత ఆ యమ్మి నెక్కడకి పంపాలి — అన్నది కూడా ఆలోసించాల ..."ఇటువంటి ఏళల్లో ఆడమనిసిని కన్నోళ్ళుగానీ, కట్టుకున్నోడుగానీ దగ్గరుండి సూసుకోవాల. ఏమీకానోల్లం, మనమేంసెయ్యగలంలే " అంది నీలమ్మ.

"ఏడనుండి అచ్చినాదో కనుక్కుని, ఆడకే పంపేద్దారి" అంది రాగమ్మ నిర్లిప్తంగా.

"ఆళ్ళతో పడకేగా ఈ యమ్మ నీట్లో దూకినాది! " పక్కనే మగ గొంతుకు వినిపించేసరికి నీలమ్మ, రాగమ్మ – ఇద్దరూ ఉలికిపడ్డారు. పక్కకి తిరిగి చూసి ఇద్దరూ ఒకేసారి అన్నారు కోరస్ లా, " కన్నయ్యా! నువ్వా? ఎంతసేపయ్యింది వచ్చి?"

చిన్నగా నవ్వి అన్నాడు కన్నయ్య, "శానాసేపైనాది! మీ ఇద్దరూ ఆయమ్మ ఊసులు సెప్పుకుంటా నన్ను సూడనే లేదు. సర్లే! లచ్చిమక్క రాగమ్మ పిన్నినొకపాలి రమ్మని సెప్పమంది. అరిజంటంట! వతనులకాడికి ఎల్లినాదంటే ఎతుకుతా ఇటచ్చినా. బేగే ఎల్లు పిన్నీ!"

"ఎల్తాలే! బేగే – అంటే, ఇంటికాడికెల్లి, ఈ తట్టా బుట్టా ఆడపారేసి, స్తానం సేసి ఎల్లాల. బాలెంతరాలుగా, ఏ మవుసరం వచ్చిందో ఏంటో... నే నెల్లనా మరి" అంటూ రాగమ్మ వెళ్ళిపోయింది.

"కన్నయ్యా! ఏమయ్యింది? సక్కగుండేటోడివి ఇంత బక్కగయ్యావంటే ... ఒళ్ళు బాగోలేదా ఏంటి?" కన్నయ్య ఏం చెపుతాడో వినాలని అడిగింది నీలమ్మ.

"ఏం కాలేదు పిన్నీ! ఈ మద్దిన నాకు నాల్రోజులపాటు నీరసం సేసింది. అమ్మ దేవుడమ్మ కాడికెల్లి తావీదు తెచ్చి కట్టినాక సుబ్బరంగా నయమైపోనాది" అంటూ జబ్బానున్న తాయెత్తు ఆమెకు చూపించాడు. "అందుకే కొంచెం సత్తువ తగ్గినట్టుంది. అదే పోద్దిలే" అన్నాడు.

నీలమ్మ మనసంతా ఏవేవో ఆలోచనలు ముసురుకున్నాయి. కన్నయ్య ముఖం పరికించి చూసింది, "ఓరినీ ... కన్నయ్యా! ఎంత గొప్పగా అబద్ధం సెప్పేవురా! ఒక్కసారి నీ కళ్ళల్లోకి సూత్తే సాలు, తెలుస్తాది, ను వ్వెంత నలిగిపోతున్నావో" అనుకుంది నీలమ్మ సానుభూతితో. వెంటనే మాట మార్చేసింది, " రేపుకాక ఎల్లుండే ఆ యమ్మని ఆసుపత్తిరినుండి అంపేస్తారంట! తొమ్మిదయ్యేసరికల్లా మీరు వచ్చి అక్కడుండాలని నర్సమ్మ నాతో సెప్పి పంపింది. రాగమ్మ ఏటన్నాదో విన్నావు గందా. అసలే ఇబ్బంది రోజులు, ఇప్పుడు ఆడ కెల్లీవోళ్ళెవరూ లేరు. "

" సర్లే పిన్నీ! అంతా యిన్నాగందా. సూద్దారి, ఏంటి సెయ్యాలో ... మరి నే నెల్లిరానా, సిన్నయ్య పనిసెప్పాడు, బేగే ఎల్లాల " అంటూ నీలమ్మ దగ్గర సెలవు తీసుకుని వెళ్ళిపోయాడు కన్నయ్య.

# # #

ఊరంతా ఫ్లూ జ్వరాలతో అట్టుడికిపోతోంది. గవర్నమెంట్ హాస్పటల్లో ఒక్క మంచం కూడా ఖాళీ లేదు. ఆసుపత్రిలోని పడకలన్నీ రోగులతో నిండివున్నాయి. ఇంకా రోగులు వస్తూనే ఉన్నారు. డాక్టర్లకి చేతినిండా పని ఉంది. రోగులకు కావలసిన సేవలందిస్తూ నర్సులు, రోగుల పడకలమధ్య హడావిడిగా అటూ ఇటూ తిరుగుతున్నారు.

పదో నంబరు బెడ్ మీద పడుకున్న ఎనిమిదేళ్ళ అమ్మాయికి నాల్గు రోజులక్రితం "ఎపెండిసైటీస్" ఆపరేషన్ జరిగింది. ఆ పాప పేరు శిరీష. మంచి స్నేహశీలి. కాస్త లేచి కూర్చోడం చేతనవ్వగానే పక్కనున్న పడకలమీది వాళ్ళతో మాట కలిపేసింది. తల్లీ, తండ్రీ కూడా చిన్నచిన్న ఉద్యోగాలు చేస్తున్నవాళ్ళు కావడంతో ఎక్కువ రోజులు సెలవు పెట్టి పాపతో ఉండడం కుదరలేదు వాళ్ళకి. కానీ, అది ఆ పాపను అంతగా బాధపెట్టలేదు. ఉబుసుపోకకు పక్క వాళ్ళతో స్నేహం కలిపేసింది. తొమ్మిదవ బెడ్ మీదున్న ముసలమ్మకంటే ఆ పాపకు పదకొండవ బెడ్ మీదున్న యువతి బాగా నచ్చింది. ఆమెతో వరసకలిపింది.

" అక్కా! నీపేరేమిటి? నాపేరేమో శిరీష, మూడోతరగతి " అంటూ కబుర్లు మొదలుపెట్టింది.

ఆ ఒక్క ప్రశ్న మాత్రమే కాదు, ఇంకా చాలాప్రశ్నలు అడిగింది ఆ పాప, "మీదే ఊరు?" "నీకోసం ఎవరూ రాలేదు ఎందుకని?" "మీ అమ్మా నాన్న జాబ్ చేస్తున్నారా?" వగైరా... ఆ పాప అడిగిన ఏ ఒక్క ప్రశ్నకీ ఆమె జవాబు చెప్పలేకపోయింది. అందుకు కారణం ఆమెకు ఏ విషయమూ గుర్తుకు రాకపోవడమే! ఆలోచించిన కొద్దీ తలపోటు పెరగడమేగాని, ఏ ఒక్కటీ కూడా తలపుకు రావడం లేదు. ఆమె పాపకేమీ జవాబు చెప్పకుండా బిక్కమొగం పెట్టుకు చూస్తూ మౌనంగా ఉండిపోయింది.

అది చూచి ఆ పాప,"హో – హో – హో – హో " అంటూ నవ్వసాగింది. నవ్వి నవ్వి, కష్టపడి నవ్వాపుకుని " మా టీచరమ్మ ఒక కథచెప్పింది మాకు — ఒక ఈగ, ఇల్లలుక్కుంటూ తన పేరుని మర్చిపోయిందిట! అలాగే నువ్వూ నీపేరు మర్చిపోయావా అక్కా!"

తొమ్మిదవ నంబరు బెడ్ మీది పేషెంట్ కి ఇంజక్షన్ చెయ్యడానికి వచ్చిన నర్సు ఆ సంభాషణంతా వింది. ఆమె జవాబుచెప్పింది ఆ పాపాకి, " ఆమె పేరు రాధమ్మ. ఆమె తల్లి రాగమ్మ, మావ కన్నయ్య. ఆమెను అడ్మిట్ చేసిన సమయంలో నేను అక్కడే ఉన్నా. కేసు షీటుమీద ఈమె వివరాలన్నీ రాశి ఉంటాయి" అంది ఆ నర్సు కేస్ షీట్ తీసింది. తరువాత రాదమ్మవైపు తిరిగి, " మొదట నువ్వు నీటిలో మునిగిపోయావని తీసుకొచ్చారుగానీ, ఆ తరవాత నీకు అబార్షన్ అయ్యింది, ఆపై సెప్టిక్ ఫీవర్ వచ్చింది. అబ్బో! నువ్వు చాలా బాధలు అనుభవించావన్న మాట! మళ్ళీ పూర్తిగా కోలుకోడానికి కొంత టైం పడుతుంది. అంతవరకూ మంచి ఆహారం తీసుకుంటూ

విశ్రాంతిగా గడపాలి, గుర్తెట్టుకో" అని చెప్పి కేస్ షీట్ మంచానికి తగిలించి ఆ నర్సు రాధమ్మకి ఇంజక్షన్ తయారు చెయ్యడంలో పడింది. కొంతసేపు ఎవరూ మాటాడలేదు.

తరవాత పాప శిరీషే మాటాడింది. " రాధక్కా నీ పేరు చాలా బాగుంది. నేనికనుండీ నిన్ను "రాధక్కా" అని పిలుస్తానేం!" అంది . కానీ రాధమ్మ ఏమీ జవాబు చెప్పలేదు. శిరీష మళ్ళీ తానే మాటాడింది..."నిన్ను చూడ్డానికి మీ అమ్మా, నాన్నా రాలేదని దిగులుపడుతున్నావా రాధక్కా! భయపడకు, నీకు నేను తోడున్నాకదా! నువ్వు నీ కళ్ళు గట్టిగా మూసేసుకో, ఇంజక్షన్ నెప్పి తెలియదు" అంది.

నర్సు వచ్చి రాధమ్మకి ఇంజక్షన్ చేసింది. "పాపా! ఇక నీకు ఇంజక్షన్ చెయ్యక్కరలేదు. ఈ వేళ నిన్ను డిశ్చార్జ్ చేసేస్తారు. నువ్వు మీ ఇంటికి వెళ్ళిపోతావు. "

"ఇన్ని ప్రమాదాలనుండి నేనెలా బ్రతికి బయటపడ్డాను సిస్టర్! నాకేమీ గుర్తు రావడం లేదు, బుర్రంతా ఖాళీగా ఉంది" అంది రాధమ్మ

"సముద్రంలో స్నానం చేస్తూండగా కెరటం నిన్ను లోపలకి లాగేసిందనీ, మళ్ళీ కొద్దిసేపట్లో ఒడ్డుకు విసిరేసిందనీ చెప్పారు మీవాళ్ళు. అలా ఆ అల విసిరేసినప్పుడు తాటికి కొట్టుకుని, నీ తలకి పెద్ద దెబ్బ తగిలింది. రక్తం చాలా కారిపోయింది. నీకు గొప్ప ట్రీట్మెంట్ జరిగింది. మాదగ్గర కావలసిన మందులు లేకపోతే ఖరీదైన మందులు కొనితెచ్చి మీ మావే నిన్ను బ్రతికించుకున్నాడు. నీకు అన్ని జబ్బులూ నయమైనాయిగాని, ఈ పార్షల్ ఆంనేషియా తగ్గాలంటే మాత్రం చాలా రోజులే పట్టొచ్చు." మాటలాపి ఇంజక్షను చేసి వెళ్ళిపోయింది నర్సు.

కొద్ది సేపట్లో శిరీషను తీసుకెళ్ళడానికి తల్లిదండ్రులు వచ్చారు. శిరీష చాలా సంతోషంగా ఉంది.

"రాధక్కా! బై! నన్ను మర్చిపోకేం" అంటూ రాధమ్మకు వీడ్కోలు చెప్పి, వెనక్కి తిరిగితిరిగి చూస్తూ తల్లితండ్రుల వెళ్ళిపోయింది శిరీష.

# # #

ఆనాడు డిశ్చార్జ్ ఐన వాళ్ళు చాలామంది ఉన్నారు. డాక్టర్లు రౌండ్లకి వచ్చినప్పుడు కేస్ షీట్సు మీద "డిశ్చార్జిడు " అని రాస్తున్నారు జబ్బులు తగ్గినవారికి. తీసుకోవాల్సిన మందులు, జాగ్రత్తలూ చెప్పి వెడుతున్నారు. నెమ్మదిగా ఒక్కో పడకా ఖాళీ ఔతోంది. రాధమ్మ కేస్ షీట్సు మీద కూడా "డిశ్చార్జిడు" అని రాసేశారు. కానీ ఆమెకోసం ఇంకా ఎవరూ రాలేదు. టైమ్ తొమ్మిది దాటింది. రాధమ్మకంతా అయోమయంగాఉంది. తనకోసం వచ్చే వాళ్ళని చూడాలని తహతహలాడుతోంది. తనవాళ్ళని ఎవరూ, ఆఖరుకి తన తల్లి రూపమైనా తన కళ్ళకు కట్టడంలేదు. "చిత్రంగా ఉంది కదూ" అనుకుంది రాధమ్మ

ఇంతలో అట్టెండర్లు వచ్చారు, పక్కలు మార్చడానికి. ఖాళీయైన ప్రతి పక్కమీద ఉన్న మాసిన గలీబులు, దుప్పట్లు తీసేసి, పక్కలు దులిపి, ఇస్త్రీ చేసిన తెల్లటి దుప్పట్లు గలీబులూ వేస్తున్నారు. ఒక ఆయా వచ్చి రాధమ్మను అదలించింది, "ఏంటమ్మా! మీవాళ్ళింకా రాలేదా? నువ్వు లేవాలి, ఈ బెడ్ అప్పుడే మరో పేషంటుకి ఇవ్వడం అయ్యింది. వాళ్ళు వచ్చేశారు, వెళ్ళి విజిటర్సు రూంలో కూచో " అంటూ తొందరపెట్టింది.

రాధమ్మకి ఏం చెయ్యడానికీ తోచలేదు. లేచి, మంచందిగి విజిటర్సు లాంజ్ వైపుగా రెండడుగులు వెయ్యబోయింది. కానీ సత్తువ చాలక తూలిపోయింది. గమ్మున ఒక చేయి ఆమెను పట్టుకుని పడిపోకుండా నిలబెట్టింది. ఆ చెయ్యే ఆసరాయై ఆమెను విజిటర్సు రూంలోకి నడిపించి, అక్కడ ఒక కుర్చీలో కూర్చోబెట్టింది.

తనకు ఆసరా ఐన వ్యక్తిని పరికించి చూసింది రాధమ్మ. ఆరడుగులకు మించిన ఎత్తుతో, నిర్మలమైన ముఖవర్చస్సుతో, శ్యామల వర్ణంలో ఉన్న అతనిని ఆశ్చర్యంగా చూసింది. కండలుతిరిగిన శరీర సౌష్టవంతో కాయకష్టం చేసుకుని బ్రతికే వ్యక్తిగా

తెలిసిపోతున్నాడు అతడు. అతడు కట్టుకున్న పాంటూ షర్టూ కూడా ఇస్త్రీలేకుండా నలిగి ఉన్నాయి. "నర్సు చెప్పిన నా మావ కన్నయ్య ఇతడే కాబోలు" అనుకుంది రాధమ్మ.

" అమ్మాయిగోరూ! మీరీడ కూంచేపు కూకోండి. నా నెల్లి సెలవు తీసుకుని, మందులు గట్రా రాయించుకొస్తా" అంటూ వెళ్ళాడు అతడు.

రాధమ్మ మనసు పరిపరి విధాలుగా ఆలోచిస్తోంది. తనని గురించి అడిగినవాళ్ళకి తనేమని చెప్పగలదు! తనెవరో, తనవాళ్ళెవరో గుర్తొస్తేకదా– అనుకుంది. మళ్ళీ అంతలోనే – అసలు ఈ ఆలోచన ఎందుకు! ఇతడు వచ్చి తీసుకెడుతున్నాడంటే అర్థం ఏమిటి? వీళ్ళే తనవాళ్ళు కావచ్చుకదా – అనుకుంది ఆశగా.

అతడు వెళ్ళి "ఫార్మాలిటీస్" అన్నీ పూర్తిచేసుకుని, చేయిచాపినవాళ్ళందరికీ తలకో కాస్తా ఇచ్చి వదుల్చుకుని, ఆమెదగ్గరకు వచ్చాడు. ఆపద్ధర్మంగా ఆమెకు తన చెయ్యి అందించి, నడిపించుకువెళ్ళి, బయట తమకోసమే కనిపెట్టుకుని ఉన్న ఒంటెద్దు బండిని ఎక్కించాడు ఆమెని. బండి నెమ్మదిగా బెస్తవాడవైపు వెళ్ళడం మొదలుపెట్టింది. కన్నయ్య బండి వెనకే నడవసాగాడు.

# # #

గమ్యాన్ని చేరుకున్న బండి వెళ్ళి యెల్లమ్మ ఇంటిముందు ఆగింది. బండిరావడం చూసి చుట్టుపక్కలవాళ్ళంతా బండిని చుట్టుముట్టారు. రాధమ్మకు ఆసరాగా ఉండి, నెమ్మదిగా ఆమెను బండి దింపారు, కానీ, క్రిందకు దిగిన ఆమె నిలబడలేక తూలిపోయింది. పక్కనేవున్న నీలమ్మ ఆమెను పడిపోనీలేదు, పట్టుకుంది. రాగమ్మ గమ్మున ఎల్లమ్మ నులకమంచం నట్టింట వాల్చి, బొంత పరిచి పక్కేసింది. ఆమెను ఆ మంచం మీదకు చేర్చి పడుకోమన్నారు. రాధమ్మ నిస్త్రాణగా ఆ మంచం మీద పడుకుండిపోయింది.

ఆమె వచ్చినదన్న వార్త తెలవగానే అచ్చమ్మ , వెచ్చని గంజిలో రవంత ఉప్పుగల్లు జేర్చి తెచ్చింది రాధమ్మకోసం. ఆ వెచ్చని గంజితాగాక రాధమ్మకి ఓపిక వచ్చినట్లనిపించింది. అక్కడ చేరిన ఆడవాళ్ళని చూసి అడిగింది, " మీరంతా ఎవరు? నా కేమౌతారు" అని.

బెస్త పడుచులు మోహమొహాలు చూసుకున్నారు. మాటకారి నీలమ్మ అందుకుంది, "అమ్మాయిగోరూ! తమరెవరో మాకు తెల్దండి. మే మెవరం మీకేమీగాము. ఇది బెస్తవాడ. మేమంతా మరక్కత్తెలము. మిమ్మల్ని సముద్దరమ్ తెచ్చి మాకాడ ఒగ్గేసింది. ఏటకని బయలెల్లిన మావోళ్ళు సూసి, ఉప్పునీలుమింగి మైకంలో ఉన్న మిమ్మల్ని దరమాసుపత్రిలో యేసేరు. పోలీసు కేసు కాకూడదని, రాగమ్మ మీ అమ్మనీ, కన్నయ్య మీ మావనీ సెప్పేరు. సముద్దరంలో తానానికి దిగితే కెరటం లాగేసిందనీ, కూంచేపటికి మళ్ళీ ఒడ్డుమీన ఇసిరేసిందనీ ఆసుపత్తిరిలో ఆబద్ధం సెప్పి, మిమ్మల్నాడ వొయిజ్జానికి సేర్పించారు. ఆళ్ళు మీ పేరడిగితే, రాగమ్మకు బ్రెమారిందంట – సముద్దరం లాగేసిన తన కూతుర్నే మళ్ళా ఇలా ఇచ్చిందనిపించి ఆమెయిని, సిన్నతనంలోనే సచ్చిపోయిన తన కూతురు పేరే మీ పేరుగా ఆళ్ళకు చెప్పేసింది. అదే ఆళ్ళు రాసుకున్నారు, "రాదమ్మ"అని. ఇయన్నీ ఆపద్ధరమ బందుత్వాలే! తమరెవరో, ఎక్కడివారో సెపితే మావోళ్ళు బద్దరంగా మిమ్మల్ని ఆడకు చేరుస్తారు. ఇక మీకొచ్చిన బయమేం లేదండి అమ్మాయిగోరూ!"అంది.

రాధమ్మకు చాలా ఆకలిగా ఉంది, కానీ నోరువిడిచి ఎవరికీ తనబాధ చెప్పలేకపోయింది. అంతలో వెళ్ళిపోయిన రాగమ్మ మళ్ళీ వచ్చింది, అల్యూమినం కంచంలో వేడివేడి అన్నం పెట్టుకుని, పైన చేపలపులుసు వేసుకుని తెచ్చింది. ఆమె దానిని రాధమ్మకు ఇచ్చింది తినమని. అక్కడున్నవాళ్ళు రాగమ్మ పరిచయం చెప్పారు, " ఈయమ్మే రాగమ్మ, మీ అమ్మయేసం కట్టింది యీమే " అంటూ. అంతలో అక్కడకొచ్చిన ఎల్లమ్మని కూడా రాధమ్మకి పరిచయం చేశారు. ఆమె నీకు మావ ఏసమేసిన కన్నయ్యకు తల్లి – అంటూ.

రాగమ్మ ముందుకువచ్చి కంచం రాధమ్మ చేతికి ఇచ్చి, " రాదమ్మా! ఇది మరకోళ్ళ గూడెం. మా తిండి ఇదే. ఇది నీకోసం తెచ్చా, బోంచెయ్యమ్మా, శానా నీరసంగున్నావు" అంది ప్రేమగా.

" వీళ్ళమాటలు విన్నాక నేను వీళ్ళ బిడ్డను కానని నిస్సందేహంగా తెలిసిపోయింది. అయితే నేనెవరిని? నా సంగతి ఏమిటో నాకే తెలియని ఈ అయోమయంలో, నాకు ఏ తిండైతేనేం! ఇది ప్రేమతో తెచ్చిన భోజనం. ప్రేణాలతో ఉన్న నాకు ప్రతిరోజూ తిండికావాలి. నా ప్రాణదాతలైన వీళ్ళు ఏదిపెడితే అది తింటా. మరో గత్యంతరం కూడా ఏమీ లేదుకదా – అనుకుంది నిరీహతో. వెంటనే రాగమ్మ చేతిలోని కంచం అందుకుని ఆప్యాయంగా తినడం మొదలుపెట్టింది.

చుట్టూ చేరి సోజ్యం చూస్తున్న పిల్లల్ని అదలించారు తల్లులు. " ఇక సాలు, నడవండల్లా పిల్లకాయలూ" అంటూ పిల్లల్ని వెంట తీసుకుని వెళ్ళిపోయారు ఆ తల్లులు. భోజనాలవేళ కావడంతో నెమ్మదిగా అక్కడున్న అందరూ ఇళ్ళకు వెళ్ళిపోయారు.

నీరసంగా ఉండడంతో ముద్ద మింగుడుపడక రాధమ్మకు పొలమారింది. వెంటనే ఎల్లమ్మ కర్రపోటేసుకుంటూ గబగబా దగ్గరకు వచ్చి, ఆమెకు తాగడానికి నీళ్ళిచ్చి, తలపై తట్టి, వెన్ను నిమురుతూ ఉండిపోయింది. రాధమ్మకు కళ్ళు చెమర్చాయి. తమ బిడ్డ కాకపోయినా బెస్తవాడ జనం తనపై చూపిస్తున్న అభిమానానికి ఆమె మనసు ఆర్ద్రమయ్యింది. వాళ్ళు ఇబ్బందుల్లో ఉండీకూడా కష్టాలలో ఉన్న తనను ఆదరించి నిర్మలమైన ఆత్మీయత చూపిస్తున్నారు. వాళ్ళ ఋణం తను ఎప్పటికీ తీర్చుకోలేదు – అనుకుంది. ఆమె భోజనం అవ్వగానే కన్నయ్య డాక్టర్లు రాసిన మందులు తెచ్చి ఆమెకు అందించాడు. అవి వేసుకున్నాక, కాసేపాగి ఆ తరువాత ఆమె నిద్రపోయింది.

# # #

ఒక వారం గడిచేసరికి రాధమ్మకి కొంచెం సత్తువ వచ్చింది. లేచి అటూ ఇటూ మసలగలుగుతోంది. ఇక వెళ్ళిపోడం బాగుంటుంది – అనుకుంది. కానీ ఎక్కడికి వెళ్లాలిట! ఇంకా ఏమీ గుర్తు రావడం లేదు. అలాగని శాశ్వతంగా తను ఇక్కడే ఉండిపో కూడదు కదా! వీళ్ళవి కూడా అంతంతమాత్రపు బ్రతుకులే. పాపం! తన బరువు బాధ్యతలు వీళ్ళు ఎన్నాళ్ళని మోయగలరు – అనుకుంది దుఃఖంతో. ఆ వాడలో ఉన్న బెస్తలకు ధనలోపం ఉందిగాని, గుణలోపం లేదు. ఆపదలో ఉన్న రాధమ్మకి సాయపడడం కోసం వాళ్ళు వంతులువేసుకుని మరీ ముందుకు వచ్చారు. రాధమ్మ ఉంటున్నది ఎల్లమ్మ ఇంట్లో. కాని, పూటకొక ఇంటివాళ్ళు ఆమెకు భోజనం తెచ్చి ఇస్తున్నారు. చుక్క, తన సవితి తాలూకు చీరలు చాలా ఉన్నాయంటూ, రాధమ్మకి నడిపాత చీరలూ, వాటికి కుదిరే జాకట్లు, ఒక పెద్ద మూటే పంపించింది పనివాడిచేత. రాధమ్మకు ఏ క్షణం లోనైనా తన వాళ్ళు గుర్తుకు రాగలరనీ, ఆ వెంటనే ఆమె ఇక్కడినుండి వెళ్ళిపోతుందనీ, తమ రేవుకు అతిథిగా వచ్చిన రాధమ్మను ఇక్కడ ఉన్నన్ని రోజులూ బాగా చూసుకుంటే, ఆమె మనసులో ఈ బెస్తవాడ ఒక మంచి జ్ఞాపకంగా మిగిలి ఉండిపోతుందని భావించారు ఆ పల్లెజనం.

ఆమెకు మందులిచ్చే పని ముసలిదైన తన తల్లికి అప్పగిస్తే సరిగా చెయ్యగలదో లేదోనని, కన్నయ్య తానే స్వయంగా, రాధమ్మ భోజనం అవ్వగానే మందులు ఇచ్చి ఆమె వాటిని మింగిన తరువాతనే అక్కడనుండి కదిలి వెడుతున్నాడు. రాత్రివేళ రాధమ్మకు గుడిసె లోపల తుంగచాప పరిచి పక్కవేసి, తల్లీ కొడుకు బయట పడుకుంటున్నారు. మొత్తం మీద ఎల్లమ్మ కుటుంబంలో ఒకతెగా కలిసిపోయింది రాధమ్మ. తనకు కొంచెం ఓపిక రాగానే ఎల్లమ్మ ఎంత వద్దన్న వినకుండా ఆమెకు చిన్నచిన్న సాయాలు కూడా చేయాలని చూస్తోంది ఆమె.

ఆరోజు ఎందుకనో రాధమ్మకి అర్ధరాత్రి, ఎవరో తట్టి లేపినట్లు మెలకువ వచ్చి, ఆపై మరి కంటిమీదకు కునుకురాలేదు. ఇకనేమీ చేయలేక, నిద్ర రాకపోయినా బలవంతంగా కళ్ళు మూసుకుని పక్కమీద కదలకుండా పడుకుని ఉండిపోయింది ఆమె.


బయట, ఆ గుడిసెకున్న చిన్న అరుగుమీద దుప్పటి పరుచుకుని ముడుచుకు పడుకున్న కన్నయ్య కదిలి లేచిన అలికిడి తెలిసింది ఆమెకు. మరి కొద్ది సేపు గడిచేసరికి ఎల్లమ్మ గురక ఆగిపోయింది. నులకమంచం కిరకిరలాడింది. తల్లీ కొడుకూ  కూడా నిద్ర లేచారని అర్ధం చేసుకుంది రాధమ్మ.

పుచ్చపువ్వులా విరబూసి ఉంది వెన్నెల. పున్నమి రోజు కావడంతో సముద్రపుటలలు ఉవ్వెత్తుగా లేచి విరగబడిపోతూ హోరుమంటూ గోలగోలగా ఉన్నాయి. గాలికి, దగ్గరలోనే ఉన్న తాడిచెట్ల ఆకులు గలగలమని చప్పుడు చేస్తున్నాయి. దూరంగా ఎక్కడో పక్షి పలికింది. పక్కమీద కాసేపు అటూ, ఇటూ దొల్లి కళ్ళుతెరిచిన ఎల్లమ్మకు కొడుకు పక్క ఖాళీగా కనిపించేసరికి ఆమెకు భయం వేసింది. మనసు కీడును శంకించింది. ఆమెకు నిద్రమత్తు వదిలిపోయింది. కంగారు పడుతూ మంచం దిగి, కళ్ళకు చెయ్యి ఓరజేసుకుని నాలుగుదిక్కులా పరికించి చూసింది ఎల్లమ్మ...

(సశేషం)        #        #        #

★★★★★★★★★

# "స్ఫూర్తి ప్రదాత - **గాంధీ** " - ఉమా (అమెరికా)



మోహన్ దాస్ కరంచంద్ గాంధీ ( జననం : అక్టోబరు 2, 1869 – మరణం : జనవరి 30, 1948) ఆంగ్లేయుల పాలననుండి భారతదేశానికి స్వాతంత్ర్యం సాధించిన నాయకులలో అగ్రగణ్యుడు. ప్రజలు అతన్ని మహాత్ముడని, జాతిపిత అని గౌరవిస్తారు. సత్యము, అహింసలు గాంధీ నమ్మే సిద్ధాంత మూలాలు. సహాయ నిరాకరణ, సత్యాగ్రహము అతని ఆయుధాలు. పంచె కట్టి, చేత కర్రబట్టి, నూలు వడకి, మురికివాడలు శుభ్రం చేసి అన్ని మతాలూ, కులాలూ ఒకటే అని బలంగా చాటాడు ఆయన. 20వ శతాబ్దిలోని రాజకీయనాయకులలో అత్యధికముగా మానవాళిని ప్రభావితం చేసిన రాజకీయ నాయకునిగా అతన్ని కేబుల్ న్యూస్ నెట్వర్క్ (CNN) జరిపిన సర్వేలో తేలింది. గాంధీజీ భారత్ స్వతంత్ర సముపార్జన సారథి మాత్రమే కాదు. యావత్ ప్రపంచానికే అహింసా సిద్ధాంతాన్ని

ప్రతిపాదించిన శాంతి దూత, మరియూ విశ్వమానవుడు. ప్రపంచంలోని గొప్ప గొప్ప వ్యక్తులు మహాత్మాగాంధీని తమకు ఆదర్శంగా ప్రకటించుకున్నారన్నమాట వాస్తవం. ఏ విషయమై కొంత సమాచారం మీముందుంచుతాను.

అమెరికా అధ్యక్షుడు హోదాలో బరాక్ ఒబామా భారత్‌కు వచ్చినప్పుడు , ఢిల్లీలో పార్లమెంట్ సంయుక్త సమావేశంలో ఆయన ప్రసంగించారు. 'గాంధీ కనుక ఈ ప్రపంచంలో పుట్టి ఉండకపోతే.. ఒబామా అనే నేను అమెరికా అధ్యక్షుడిని అయ్యేవాడినే కాదు' అని ఒబామా ఆనాడు పేర్కొన్నాడు. అతనే కాకుండా ప్రఖ్యాత శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ మహాత్మాగాంధీ లాంటి ఒక వ్యక్తి రక్త మాంసాలతో పుట్టి ఈ భూమ్మీద నడయాడతాడని అనుకోలేదంటూ..ఒకప్పుడు వ్యాఖ్యానించాడు. అమెరికాలో దివంగత నల్ల జాతి నాయకుడు మార్టిన్ లూథర్ కింగ్ మతాన్ని, గాంధీని అనుసంధానం చేసే ప్రయత్నం చేసాడు, 'జీసెస్ నాకు జీవిత సందేశాన్నిఇస్తే .. గాంధీ దాన్ని ఆచరణలో చూపారని' ఆయన కొనియాడాడు, అంతే కాక ఆయన భారత్ వచ్చినప్పుడు గాంధీ ఆశ్రమాన్ని సందర్శించారు, అక్కడ వారం రోజుల పాటూ ఉన్నారు. దక్షిణాఫ్రికాలో రెండున్నర దశాబ్దాలకు పైగా తాను జరిపిన పోరాటానికి స్ఫూర్తి ప్రదాత మహాత్మాగాంధీ అని దక్షిణాఫ్రికా మాజీ అధ్యక్షుడు, జాతి వివక్ష వ్యతిరేక ఉద్యమ కారుడు నెల్సన్ మండేలా పేర్కొన్నాడు. అందుకే గాంధీ విశ్వమానవుడయ్యాడు.. అన్నది నిజం, ఆ విశ్వమానవుడిని కన్నగడ్డ మన భరతజాతి. అటువంటి జాతికి వారసులం మనమందరం అని ప్రతిరోజూ గర్వపడాలి.



ప్రముఖ సాహితీవేత్త. రాజకీయ, సామాజిక విశ్లేషకులు, భారతదేశంలోనే తొట్టతొలి మనో విజ్ఞానపత్రిక 'రేపు' వ్యవస్థాపకుడు అయినటువంటి దివంగత చల్లగుళ్ళ నరసింహారావు అయితే ఒక టీవీ ఇంటర్వ్యూ లో ఏకంగా గాంధీని "బుద్ధుడి" తో పోల్చారు. గాంధీ తన రచనల్లో వ్యక్తపరిచిన భావాలను "బుద్ధుడి" బోధనలతో ఆయన పోల్చారు. "గాంధీ", "బుద్ధుడి" పై అనేక పుస్తకాలను అధ్యయనం చేసిన తరువాత చల్లగుళ్ళ నరసింహారావు ఈ నిర్ణయానికి వచ్చారని మనం భావించాలి.

'స్వేచ్ఛా వాయువులు పీల్చాలనే కాంక్షతో.. గొప్ప పేరున్న బారిష్టర్‌గా ఉండి, చాలా డబ్బు సంపాదించుకోగలిగే అవకాశాలు ఉన్నప్పటికీ.. మహాత్మాగాంధీ దేశ స్వాతంత్ర్య సమరానికి నాయకత్వం వహించడానికి నడుం కట్టి, దక్షిణాఫ్రికాలో జాతి వివక్షకు వ్యతిరేకంగా పోరాటం జరిపాడు, అదే స్ఫూర్తితో తన జాతి విముక్తి కోసం పోరాడేందుకు ఇక్కడికి వచ్చాడు, భరతమాత కన్న గొప్ప బిడ్డ మహాత్మాగాంధీ. మహాత్ముడు ఏనాడైనా మహాత్ముడే కాబట్టి, మహాత్ముడి దేశంగానే భారతదేశం ఉంటుందని ఆశిద్దాం.

అంతటి గొప్ప వ్యక్తి, విశ్వమానవుడైన మహాత్ముడిని ఈ మధ్య కాలంలో కొందరు సోషల్ మీడియా లో కించపరిచే వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరం. జాతిపితగా మనమే బిరుదాంకితుడిని చేసుకొన్న గొప్ప మానవతావాదిని మనమే కించపరచడం వాంఛనీయం కాదు. ఈ పిచ్చి రాతలకు రచయిత గా తామని  ఎవరూ ప్రకటించుకోరు. కానీ వీరి రాతలు సోషల్ మీడియా లో ఫార్వార్డ్ రూపంలో ప్రపంచం చుట్టివస్తాయి. ప్రపంచంలో ఏ జాతి కూడా తన చరిత్రను తానే మలినం చేసుకోదు, కానీ ఈ పిచ్చి రాతల రచయితలు అందుకు  వారికి వారు మినహాయింపు ఇచ్చుకుంటారు.  అటువంటి వెకిలి, మకిలి ప్రయత్నాలు ఎక్కడ వచ్చినా మనమంతా ఏకోన్ముఖంగా ఖండించాలి. ఈ సమయాన మన మహాత్ముడి కీర్తిని మనం కలసి కట్టుగా కదిలి మరింత విశ్వవ్యాప్తం చేయాలి. ప్రశాంతంగా ఉన్న భారత జాతిని చీల్చేందుకు జరుగుతున్న కుట్రలను ఐక్య కంఠంతో నిలువరించాలి. ఆ దుష్ట ప్రయత్నాల నుంచి దేశాన్ని కాపాడుకోవాలి, లేకపోతే గాంధీ తరువాత మరో దేశ నాయకుడి పనిపడతారు వీరు. ఈ గొలుసు దుష్ప్రచారం కు అంతం అంటూ  ఉండదు.

"గాంధీ జీవితాన్ని అవమానించే ప్రయత్నాలు కేవలం ఆఫ్రికాలో మాత్రమే కాదు.. మన దేశంలోనూ జరుగుతున్నాయి. బాపూపై నిరాధారమైన విమర్శలు చేయడం ఓ అలవాటుగా మారిపోయిందని" బీబీసీ ఇంటర్వ్యూలో గాంధీజీ ముని మనుమడు తుషార్ గాంధీ వ్యాఖ్యానించారు. దక్షిణాఫ్రికా మూలవాసుల గురించి బాపూజీ వంద ఏండ్ల క్రిందట కొన్ని అభ్యంతరకమైన పదాలను ఉపయోగించారన్న విషయం నాకు తెలుసు అని ఆయన చెప్పారు. అయితే, గాంధీజీ చదువుకున్నది ఇంగ్లీష్ చదువులన్న విషయం గుర్తుంచుకోవాలి. ఇంగ్లిష్ వాళ్లతో కలిసి జీవిస్తూ, వాళ్ల పద్ధతుల్లోనే ఎదిగిన వ్యక్తి ఆయన. ఆయనకు అబ్బిన విద్యాపరమైన సంస్కారాలన్నీ ఇంగ్లిష్ వాళ్లవే. భారతీయ సంస్కృతి నుంచి వచ్చి ఇంగ్లిష్ చదువులు చదువుకొని ఆయన ఆఫ్రికాకు వెళ్లారు. అక్కడి ప్రజల పట్ల ఆయనకున్న దృక్పథం ఒక భారతీయ వ్యక్తికుండేదే కానీ, ఆయన భాష ఇంగ్లిష్ చదువు ద్వారా నేర్చుకున్న భాష. అక్కడి మూలవాసుల పట్ల ఆయన ఉపయోగించిన మాటలు ఆ కాలంలో ప్రాచుర్యంలో ఉన్నవే. వాటిని అభ్యంతరకరమైనవని అప్పుడు ఎవరూ భావించేవారు కాదు. కానీ వర్తమాన ప్రపంచంలో... అకస్మాత్తుగా ఆయన అప్పుడు దక్షిణాఫ్రికా మూలవాసుల గురించి వంద ఏండ్లకు పై  ముందు ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు అభ్యంతరకరంగా మారిపోయాయి అని తుషార్ గాంధీ ఆవేదన వ్యక్తం చేశారు. గాంధీ పై అసత్య ఆరోపణలు చేయడం విద్యావంతులకూ, విజ్ఞులకు తగదని నా అభిప్రాయం, ఇలాంటి చర్యలు ద్వేషభావంతో చేస్తున్నవే అని ఆయన చెప్పారు.

అమెరికాలో శాక్రమెంటో  శివారు నగరమైన ఫాల్సం లో దశాబ్దాల తరబడి "నీగ్రో బార్" పేరుతొ ప్రసిద్ధి చెందిన అమెరికన్ నది బీచ్ పేరును ఇప్పుడు "బ్లాక్ మైనర్స్ బార్" అని మార్చారు. వర్తమాన కాలంలో "నీగ్రో" పద ప్రయోగం అభ్యంతరకరంగా ఉంది అని పలువురు చేసిన ఆరోపణలకు స్పందించి సదరు నగర పాలక సంస్థ బీచ్ పేరును మార్చినట్లు తెలుస్తుంది. రానున్న రోజుల్లో  "బ్లాక్ మైనర్స్" అభ్యంతరకరంగా ఉంది ఎవరైనా ఫిర్యాదు చేస్తే బహుశా దాన్ని తొలగించి కేవలం ఉత్త "బార్" పేరుతో  సదరు బీచ్ ను పిలిచినా ఆశ్చర్యపడాల్సిన విషయం కాదు  అని అనుకోవాలి. కలికాలం.

ఎన్నో ప్రయాసలు, ఎన్నో ప్రయత్నాలు, ఎన్నో కష్టాలకు ఓర్చి ఈనాడు మనం అనుభవిస్తున్న భారతదేశం వారి త్యాగాల ద్వారా మనకు అందించబడింది. దీని వెనుక  ఒక వ్యక్తి ప్రయాస ఎంత ఉంటుందో , ఆయన ఎన్ని త్యాగాలు చేసాడో, ఎన్ని రకాల ఇబ్బందులకు

గురియ్యాడో  గాంధీ సినిమాలో చూపించారు.  గాంధీ సినిమాను 1982లో ఉచితంగా మా ఊరు  సినిమా థియేటర్ లో చూచినట్లు నాకు గుర్తు. ఆరోజు ఒక పూట  స్కూలు మూసివేసి అన్ని క్లాసుల్లో ఉన్న పిల్లలందరినీ ఈ సినిమా చూడడానికి తరలించినట్లు జ్ఞాపకం. ఆంధ్రుల చిరకాల స్వప్నమైన ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించేందుకు ప్రాణత్యాగానికి పూనుకుని, అమరజీవి అయిన "పొట్టి శ్రీరాములు" అంటే గాంధీజీకి  ప్రత్యేకమైన అభిమానం. పొట్టి శ్రీరాములు వంటి కార్యదీక్షాపరులు పదిమంది ఉంటే ఒక్క సంవత్సరంలోనే స్వతంత్రం సాధించవచ్చునని గాంధీజీ అనేవాడు. ఈ దేశ స్వేచ్ఛ కోసం, మన భవిష్యత్తు కోసం.. ఈ రోజు స్వేచ్ఛా వాయువులు పీల్చుకొంటూ రాజ్యాంగం నీడలో.. చట్టాల పరిధిలో.. మనలను మనమే పరిపాలించుకొనే స్థితిని తీసుకువచ్చిన ఆనాటి స్వాతంత్ర్య యోధులందరికీ వందనాలు. శత్రువును సంస్కారయుతంగా ఎదుర్కొనే పద్ధతిలో శాంతియుత విధానాలు, అహింస పద్ధతులు పాటించి ప్రపంచానికే స్ఫూర్తి ప్రదాతగా నిలిచి, మహాత్మునిగా పేరు తెచ్చుకున్న గాంధీని ఆదర్శంగా తీసుకుని మనమంతా ముందుకు సాగాలి, అదే ఆయనకు అసలైన నివాళి.

ooo



# శాక్రమెంటో తెలుగు సంఘం కార్యక్రమాలు

**టాగ్స్ ఆధ్వర్యంలో ఫాల్సం నగరంలో ఐదు రోజులపాటు ఘనంగా జరిగిన వినాయక చవితి వేడుకలు**

శాక్రమెంటో: ఫాల్సం నగరంలో ఆగస్టు నెల 30 నుండి సెప్టెంబర్ 3 వ తేదీ, 2022 వరకు ఐదు రోజులపాటు టాగ్స్ ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల సందర్భంగా జరిగే పూజా కార్యక్రమంలో పాల్గొనాలని టాగ్స్ సంస్థ ఇచ్చిన పిలుపు స్పందించి పెద్ద ఎత్తున భక్తులు గణేష్ ఉత్సవాలకు హాజరయ్యారు. వినాయక చవితి వేడుకల సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను కూడా టాగ్స్ సంస్థ ప్రతినిధులు ఏర్పాటు చేశారు. పూజారి, టాగ్స్ ప్రతినిధులు ఆహ్వానితులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. వేడుకల్లో భాగంగా ఆగస్టు 31, 2022 న డా . పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ గారు "గణేష్ తత్త్వం" మీద భక్తులను ఉద్దేశించి ఉపన్యసించారు. సెప్టెంబర్ 3న స్థానిక ఫాల్సం రాంచ్ పార్కులో గణేష్ నిమజ్జనం కోలాహలంగా, ఘనంగా జరిగింది. ఫాల్సం నగరంలో ఐదు రోజులపాటు వినాయక చవితి వేడుకలు ఘనంగా జరిపించిన టాగ్స్ సంస్థను పలువురు భక్తులు ప్రశంసించారు. ఇటువంటి పండుగలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని తీసుకురావడమే కాకుండా, మన సంస్కృతి సాంప్రదాయాలను పిల్లలకు పరిచయం చేశాయని వారు చెప్పారు, అందుకు పూనుకున్న టాగ్స్ సంస్థను వారు అభినందించారు.

**టాగ్స్ వినాయక చవితి వేడుకల చిత్రమాలిక తరువాతి పేజీలలో వీక్షించండి**




































గ్రేటర్ శాక్రమెంటో తెలుగు సంఘం
TELUGU ASSOCIATION OF GREATER SACRAMENTO
A 501(C)(3) Certified Non-Profit Organization: Federal Tax ID: 92-0189840
www.sactelugu.org
TAGS Sankranti - 2023 &
20th Anniversary Celebrations
సంక్రాంతి సంబరాలు-2023
20వ వార్షికోత్సవం
TAGS INDOOR
CRICKET TOURNAMENT.
Cricket Championship
Date: 5 Nov 2022, Starts at 9AM.
Details and registration link: https://sactelugu.org/registration
Last date To register: 20 Oct 2022.
Venue: Andy Morin Sports Complex, 66 Clarksville Rd, Folsom, CA
GRAND SPONSORS
SHREYUS
INDIAN SUPERMARKET
DevRabbit
Smart IT Delivered
Shankar Reddy Pathi
Realtor & Loan Officer
Purchase & Refinance
FHA, VA, Conventional & Jumbo Loans
916 390 2169
www.CaliforniaLendingSource.com/shankar
Real Estate Source, Inc
Ram Busam
214-597-8346
916-888-1579
"Walk the Talk" is our motto
Realtor® & Loan Officer
SunshineRealtyMortgage@gmail.com
Contact: Satyaveer: (216) 262 - 4905.
https:/sactelugu.org/ https://facebook.com/sactelugu

డిసెంబర్ 18, 2021 న టాగ్స్ ఫోటో కార్యక్రమానికి హాజరు అయిన కార్యవర్గ సభ్యులు






# మన తెలుగు తేజాలు 9 వ భాగం – "త్రిపురనేని గోపీచంద్" : శ్యామసుందర్ అంబడిపూడి



త్రిపురనేని గోపీచంద్ సంపూర్ణ మానవతావాది, తెలుగు రచయిత, హేతువాది, మనోవైజ్ఞానిక సాహితీవేత్త మరియు సినిమా దర్శకుడు. ఈయన ప్రముఖ సంఘ సంస్కర్త త్రిపురనేని రామస్వామి చౌదరిగారి కుమారుడిగా మొదట భౌతికవాది, హేతువాది. మార్క్సిజములో సాంఘిక న్యాయసూత్రము ఆయనను ఆకర్షించింది. ఆ తరువాత ఉన్నవ లక్ష్మినారాయణ గారి ప్రభావము తో చాలా మార్పు వచ్చింది. ముఖ్యముగా లక్ష్మీ నారాయణ గారి ప్రభావము గోపీచంద్ నవలలో స్పష్టముగా కనిపిస్తుంది. ఈయన తెలుగు నవలా సాహిత్యములో కొత్త ఆధ్యాయాలను ప్రారంభించిన నవలాకారుడు. అన్నింటా సమర్థుడైన విద్యాధికుని వైయక్తిక ప్రవృత్తి, జీవితత్వపు చర్చ ప్రధానాంశాలుగా తీసుకొని గోపీచంద్ రచించిన "అసమర్ధుని జీవిత యాత్ర" తెలుగు సాహిత్యములో ఒక మైలు రాయిగా నిలిచింది. అంతే కాకుండా ఈ నవల ఒక మనోవైజ్ఞానిక గ్రంధముగా కూడా పేరు తెచ్చుకుంది.

గోపీచంద్ 1910, సెప్టెంబర్ 8 న కృష్ణా జిల్లా అంగలూరు గ్రామములో త్రిపురనేని రామస్వామి చౌదరి, పున్నాంబ దంపతులకు జన్మించాడు. తండ్రి కవిరాజు త్రిపురనేని రామస్వామి గారు హేతువాది సంఘసంస్కర్త అవటం, చిన్నతనములోనే తల్లిని పోగొట్టుకోవటంతో గోపీచంద్ ఇంటి పనులతో పాటు, తండ్రి నాస్తికోద్యమమునకు సహాయము చేయటం లాంటి పనులతో అతని బాల్యం చాలా గడచి పోయింది. 1932లో శకుంతలాదేవిగారితో వివాహమైంది. 1933లో లా పట్టా పొంది న్యాయవాద వృత్తి చేపట్టినా అతి కొద్ది కాలములోనే ఆ వృత్తిపై విముఖత ప్రదర్శించాడు. మార్క్సిజాన్ని అధ్యనం చేసి 'పేదవాళ్ళంతా ఒక్కటే', గోడమీద మూడోవాడు, పిరికివాడు వంటి కథలు రాసారు. మార్క్సిజం అంటే ఏమిటి? పట్టాభి గారి సోషలిజం, సోషలిజం ఉద్యమ చరిత్ర వంటి గ్రంధాలు రాసారు. తరువాత మార్క్సిజంలో లోటుపాట్లు గ్రహించి ఎం.ఎన్. రాయ్ గారి నవ్య మానవ వాదం వైపు పయనించారు. ఆంధ్ర రాడికల్ డెమొక్రటిక్ పార్టీ కార్యదర్శిగా ఉండి హేతువాదాన్ని బలపరుస్తూ ఎందర్నో హేతువాదములో సుశిక్షితులుగా తయారు చేసాడు.

గోపీచంద్ తన జీవితములో చాల ఘర్షణలు అనుభవించాడు. అనేక వాదాలతో వివాదపడుతూ, తత్వాలతో దాగుడు మూతలాడుతూ, సంతృప్తి లోనూ అసంతృప్తిలోనూ ఆనందాన్నే అనుభవిస్తూ జీవయాత్ర కొనసాగించాడు. గోపీచంద్ .మీద చాలా కాలము వారి నాన్నగారి ప్రభావం ఉండేది. గోపీచంద్ తన తండ్రి నుంచి పొందిన గొప్ప ఆయుధం, ఆస్తి, శక్తి "ఎందుకు? " అన్న ప్రశ్న ఎందుకు? అన్న ప్రశ్నే అతన్ని ఒక జిజ్ఞాసువుగా, తత్వవేత్తగా నిలబెట్టింది. ఒక పుస్తకాన్ని ఆయన తండ్రిగారికి అంకితం ఇస్తూ- 'ఎందుకు' అని అడగటం నేర్పిన నాన్నకి అని వ్రాసాడు. అలా నేర్చుకోబట్టే స్వతంత్ర భావాలు గల ఒక గొప్ప రచయిత స్థాయికి ఎదిగాడు. ఆయన మొదట వ్రాసిన చాలా నవలలో మార్క్సిస్టు భావాలు మనకు పూర్తిగా కనిపిస్తాయి. గోపీచంద్ నెమ్మదిగా నాస్తిక సిద్ధాంతం నుండి బయటపడి, చివరి రోజులలో తత్వవేత్తలు అనే తాత్విక గ్రంథాన్ని వ్రాయటం జరిగింది. పోస్ట్ చెయ్యని ఉత్తరాలు, అసమర్ధుని జీవయాత్ర, మెరుపుల మరకలు - ఈ గ్రంథాలలో కూడా చాలావరకు తాత్విక చింతన కనపడుతుంది.




1928లోనే శంబుక వధ కథ ద్వారా సాహిత్యరంగంలోకి ప్రవేశించిన గోపీచంద్ 1938లో పట్టాభి గారి సోషలిజం అన్న పుస్తకాన్ని వెలువరించాడు. తొలుత కథా సాహిత్యంలో స్థిరపడ్డ గోపీచంద్ ఆ తర్వాత నవలా సాహిత్యరంగంలోకి అడుగుపెట్టాడు. ఆయన తొలి నవల పరివర్తనం (1943). నూతన దృక్పదంతో సుమారు 300 కథలు రాసారు. ఆయన రచనల్లో అసమర్ధుని జీవితయాత్ర, పండిత పరమేశ్వర శాస్త్రి వీలునామా మొదలైనవి పేరు గాంచాయి. గోపీచంద్ రచనలలో విలువల మధ్య పోరాటం ముఖ్యముగా చెప్పుకోతగినది. 1939లో చలనచిత్ర రంగంలోకి ప్రవేశించిన గోపీచంద్ దర్శక నిర్మాతగా కొన్ని చిత్రాలను నిర్మించాడు. అయితే వాటివల్ల ఆర్థికంగా చాలా నష్టపోయారు. కొన్ని సినిమాలకు రచయితగా పనిచేశాడు. చదువుకున్న అమ్మాయిలు, ధర్మదేవత, రైతుబిడ్డ మొదలైన చిత్రాలకు మాటలు రాశాడు. ప్రియురాలు, పేరంటాలు, లక్ష్మమ్మ మొదలైన చిత్రాలకు దర్శకత్వం వహించాడు. ఆయన వ్రాసిన అసమర్ధుని జీవయాత్ర తెలుగులో మొదటి మనో వైజ్ఞానిక నవల.

“పండిత పరమేశ్వర శాస్త్రి వీలునామా” 1963లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందిన తొలి తెలుగు నవల. దీని రచయిత త్రిపురనేని గోపీచంద్. గోపీచంద్ దృష్టిలో జీవితం అంటే నిరంతర అన్వేషణ. అయన దృష్టిలో మనసులు జీవ నదులు లాగా ఉండాలి, గాని చెట్లు పర్వతాల మాదిరి ఉండకూడదు. మనిషి నిరంతర అన్వేషణలో ఉంటేనే సత్యము అంటే ఏమిటో తెలుస్తుంది. ఇదే విషయాన్ని జిడ్డు కృష్ణమూర్తి, చలం కూడా చెప్పారు. 1953లో ఆంధ్రరాష్ట్ర సమాచార శాఖ డైరెక్టర్ గా, 1956లో ఆంధ్ర ప్రదేశ్ సమాచార శాఖ సహాయ డైరెక్టర్ గా పనిచేసాడు. 1957-62 వరకు ఆకాశవాణిలో పనిచేసాడు. వారి 'ఉభయకుశలోపరి '

కార్యక్రమం జనరంజకమైనది. కాళిదాసు రచనలన్నిటిని రేడియో రూపకాలుగా రాసారు. వీరు రచించిన అనేక నాటకాలు, నాటికలు శ్రోతలను విశేషంగా ఆకర్షించాయి. ఈ దశలో అరవిందుని భావాల పట్ల విశ్వాసం ఏర్పడడంతో ఆధ్యాత్మికవాదం వైపుకి పయనించాడు. వీరికి ఆరుగురు సంతానం. ముగ్గురు అబ్బాయిలు ముగ్గురు అమ్మాయిలు. ఈయన ఆఖరి కుమారుడు త్రిపురనేని సాయిచంద్ సినీ నటుడు, దర్శకుడు. 1962 నవంబర్ 2 నాడు 52 సంవత్సరాల వయస్సులోబహుముఖ ప్రతిభాశాలి అయిన గోపీచంద్ గుండెపోటుతో ఆకస్మికంగా మరణించారు. భారత ప్రభుత్వము 2011 సెప్టెంబరు 8న గోపీచంద్ శతజయంతి సందర్భమున తపాలా బిళ్ళ విడుదల చేసింది. అంతకుముందు 1987 వ సంవత్సరంలో జరిగిన కవిరాజు త్రిపురనేని శతజయంతి వేడుకలలో త్రిపురనేని రామస్వామి చౌదరి స్మారక తపాళా బిళ్ళను జారీ చేయడం జరిగింది. తెలుగు వారిలో తండ్రి, కొడుకులు ఇద్దరికి తపాల బిళ్ళలు విడుదల చేసిన అరుదైన గౌరవం వీరికి దక్కింది.

ooo



టాగ్స్ ఆధ్వర్యంలో సంక్రాంతి
పండుగ 2022 సందర్భంగా
జరిగిన
“శ్రీ UAN మూర్తి స్మారక 4వ
రచనల పోటీ”
లో పాల్గొన్నవారందరికీ
అభినందనలు.



# టాగ్స్ ఆధ్వర్యంలో జరిగిన "శ్రీ UAN మూర్తి స్మారక 4వ రచనల పోటీ" ఫలితాలు - మీడియా కవరేజి లంకెలు

మిత్రులారా, టాగ్స్ ఆధ్వర్యంలో జరిగిన "శ్రీ UAN మూర్తి స్మారక 4వ రచనల పోటీ" ఫలితాలు క్రింద పేర్కొన్న పత్రికలు, మీడియాలలో ప్రచురించబడ్డాయి. సదరు లంకెలను మీ మిత్రులతో పంచుకొనగలరు.

1. Andhrajyothy
https://www.andhrajyothy.com/telugunews/tags-uan-murthy-4th-contest-results-spl-mrgs-nri-1922011909190325

2.TAGS Facebook Link:
https://tinyurl.com/TagsUanMurthy4thContestResults

3.1 Swara Media Coverage:
https://swara.media/News/announcement-of-the-winners-of-the-sri-uan-murthy-memorial-4th-writing-competition/

3.2 Swara Media FaceBook Coverage Link:
https://www.facebook.com/groups/1820865041351673/posts/4273053402799479

4. Molaka Media Coverage:
https://www.molakanews.page/2022/01/uan-4.html

5. TNI Live Media Coverage:
https://www.tnilive.com/2022/01/14/winners-of-uan-murthy-memorial-4th-writing-competition-announcement/

6. Sirakadambam Magazine Coverage: https://sirakadambam.com/11_010-vartavali/
https://sirakadambam.com/11_010-vartavali/

7. Namasthe Andhra:
https://namasteandhra.com/tags-uan-murthy

8. TeluguTimes:
https://telugutimes.net/article/tagd

ధన్యవాదాలు

శాక్రమెంటో తెలుగు సంఘం రచనల పోటీ కార్యవర్గం.

# “ఉత్తమ కథానిక విభాగం” లో ప్రశంసా పత్రం పొందిన కథానిక: రక్షణ కవచం - శేషా రత్నం పారుపుడి (టెక్సాస్, అమెరికా)

సందె చీకటి పడుతున్న వేళ ...

కిరీటికి ఆ రోజంతా పెద్దగా బేరాలేమీ దొరకలేదు. తను అంతకు ముందు ఎక్కించుకున్న పాసింజరును ఎయిర్‌పోర్టులో దింపేసి మరో బేరం దొరకక తిరిగి టాక్సీని వెనక్కి తిప్పేసి వచ్చేస్తుంటే యాభై మీటర్లయినా పోకముందే మెయిన్ రోడ్డు ఎక్కేముందే భీష్ముడిలాగ తెల్ల గడ్డమున్న ఒక వృద్ధుడు ఆపమన్నట్టు చెయ్యి పెట్టాడు.

‘బాబూ...భీమిలి... ఈ అడ్రసుకి తీసికెళ్లాలి. వస్తావా?’

పట్టరాని ఆనందం కలిగింది కిరీటికి.

‘హమ్మయ్య...ఇవాళ నక్కతోకని తొక్కి వచ్చినట్టుంది.. చాలాదూరం... అంటే మంచి బేరమే.’

‘ఏంబాబూ ...సందేహించకు.మీటరుమీద రెట్టింపు ఇస్తాలే.’

‘కానీ మీరు...?’ ఆ వృద్ధుడు నవ్వాడు.

‘ఎయిర్‌పోర్టులో దిగి ఇలా రోడ్డు వరకు వచ్చి నీ టాక్సీ ఆపానేమిటా అని ఆశ్చర్యపోతున్నావా? అందుకు కారణముందిలే.ఎప్పుడో వదిలేసిన పుట్టిన గడ్డను చూడగానే ఇలా నాలుగడుగులు వెయ్యాలనిపించిందయ్యా.ఇంతకీ...వస్తావా?’

‘ఎక్కండి.’ క్యారీబ్యాగ్ భుజానికో నల్లబ్యాగ్ తప్ప ఆయనకు పెద్ద లగేజి లేదు.

‘దగ్గర్లో మంచి హోటల్లో కాస్త టిఫిన్ చేసి వెళ్దాం బాబూ!బాగా ఆకలేస్తోంది.పైగా మన రుచులు తినాలని నాలుక పీకేస్తోంది.’

‘అలాగేనండి.ఎంతలేదన్నా మీఇంటికి చేరాలంటే.... రెండు మూడు గంటలు పడుతుంది.ఇదిగో చిన్నదయినా ఈ హొటల్‌లో మీకిష్టమయిన అన్ని రకాల తెలుగు టిఫిన్లు దొరుకుతాయి.దిగండి.’

‘నువ్వూ తిందువుగాని రా బాబూ!’

‘పరవాలేదు మీరు వెళ్లి తినండి.’ మొహమాటంతో అన్నాడు కిరీటి.

‘ఊహూ నువ్వూ రావాల్సిందే...అసలే నేను మన మనుషులకోసం మొహంవాచిపోయి ఉన్నాను. కాదనకు.’

కిరీటికి నవ్వొచ్చింది.ఏదీ ఇప్పుడేగా ఈగడ్డమీద అడుగుపెట్టాడు... ఆకాశాన్నంటిన ఇక్కడి మనుషుల స్వార్ధ బుద్ధులు తెలిస్తే ఈయన సున్నితమైన భావాలన్నీ ఎగిరిపోతాయిలే అనుకున్నా కిరీటికి ఆ వృద్ధుని తీరు ఆశ్చర్యం కలిగించింది. ఎందుకంటే టాక్సీ ఎక్కిన ప్రతివాడికీ డ్రయివరంటే అలుసే. ఈయన కాస్త మర్యాదస్తుడిలావున్నాడు.పాపం పాతకాలంవాడు కదా!

కిరీటి వేరే టేబుల్ దగ్గర కూర్చుంటానంటే ఒప్పుకోలేదు ఆయన. తన ఎదురుగానే కూర్చోబెట్టుకున్నాడు.

తింటున్నంతసేపు మాత్రమే కాదు తర్వాత టాక్సీ నడుస్తున్నంతసేపు ఆయన ఏదో ఒకటి మాట్లాడుతూనే ఉన్నాడు.

‘వైజాగ్ ఎంత మారిపోయిందో బాబూ!ఒకప్పుడు ఇక్కడ ఎయిర్‌పోర్టు ఉందనే మాకు తెలిసేది కాదు.అబ్బా ఎంత పెద్ద బిల్డింగులొచ్చేసాయి. మా టైములో రామకృష్ణా బీచ్ తప్ప ఇంత బీచ్ ఎక్కడుంది. భీమిలి వెళ్లే రోడ్డు అంతా బురద ...గోతులు...వైజాగ్ రావాలంటే ఒక్క బస్సుగాని కారుగాని ఉండేవి కాదు.’ గాఢంగా నిట్టూర్చి మళ్లీ ఆయనే అన్నాడు.

‘మనిషి దూరమైన తర్వాతే బాబూ మమతలు తెలిసేవి. దుబాయ్ వెళ్లి పదేళ్లపాటు డబ్బు కోసం అక్కడ కుక్కలా బానిసలా బ్రతికాను ..ఎవరికోసం? నాకుటుంబం ఉద్ధరణ కోసం...కానీ నా అనేవాళ్లు దగ్గర లేకపోయాక ఎంత సంపాదిస్తున్నా దానిని చూసి ఏం సంతోషం కలుగుతుంది చెప్పు? అందుకే మరింక అక్కడ కాంట్రాక్ట్ పొడిగించుకోలేదు.నాభార్యా పిల్లలను చూడాలని ఎంత తపించిపోతున్నానో నీకెలా చెప్పను?డబ్బు సంపాదించగలంగానీ ఆత్మీయులెక్కడ దొరుకుతారు?’దారిపొడవునా గొణుగుతూనేఉన్నాడు.

‘సార్ ఇక్కడ డబ్బు సంపాదించడం ఎంత కష్టమో అనుభవిస్తున్నవాడిని నన్నడగండి చెప్తాను.అయినా డబ్బుంటే ఆత్మీయులకు కొదవేముంటుందిలెండి.నీళున్న చెరువులోకి తెప్పలుతెప్పలుగా కప్పలు వచ్చినట్టు బంధువులు అలా అలా పెరిగిపోతారని పెద్దవాళ్లు మీకు తెలియదా!’

ఆయన ఒప్పుకోలేదు.

‘నువ్వెంత చెప్పు రక్తసంబంధాన్ని మించినది లేదు బాబూ! మావాళ్లని చెప్పలేనంత ఆనందంతో ఉక్కిరిబిక్కిరి చెయ్యాలని

2

వాళ్లకి ఉద్యోగం మానేసాననికూడా చెప్పకుండా ఇలా వచ్చేసాను. నన్ను అకస్మాత్తుగా గుమ్మంలో చూసి వాళ్ల ముఖాల్లో ఆనందం చూడాలనివుంది.ఎంత ఆశ్చర్యపోతారో...నువ్వూహించలేవు.ఏదీ ఆ వాటర్ బాటిల్ ఇటియ్యి.టాబ్లెట్ వేసుకుంటాను.'

'మీ భార్యా పిల్లలు భీమిలిలో ఉంటున్నారా?' తన దగ్గర బాటిల్ అందించాడు కిరీటి.

'అవునుబాబూ! నాలాగే వయసు పైబడిన నాభార్యకి గుండె జబ్బు దాపురించింది. ఆపరేషన్ చేయించాలి.నేను దుబాయ్ వెళ్లినపుడు పసివాళ్లయిన నా పిల్లలు ఇపుడు పెళ్లికి ఎదిగారు.వాళ్లని ఈ పదేళ్లుగా ఫొటోల్లోనో స్కైప్‌లోనో చూడడమే.వాళ్ల పెళ్లిళ్లు చేసేసిన తర్వాత కూడా మహారాజులా బ్రతికేంత సంపాదించాను తెలుసా?ఈ జీవితానికిది చాలదంటావా బాబూ?అదిసరేగానీ నీ మాటల్లో మనుషులపట్ల కోపం అపనమ్మకం ఇంకా ఏదో వ్యధ కనిపిస్తోంది.ఎందుకు?జీవితంలో దెబ్బ తిన్నావా?'

కిరీటి గాఢంగా నిట్టూర్చాడు.'వైజాగ్ స్వరూపం ఎంత అందంగా మారిపోయినా మాలాంటి మధ్యతరగతి బ్రతుకులు ఏమీ మారలేదు. దేశంలో అవినీతి పెరిగిపోయి నాకు ఉద్యోగంరాలేదు. రెక్కలు ముక్కలు చేసుకుని బండి నడిపినా డబ్బు చాలడంలేదు.అప్పులు...కుటుంబ బాధ్యతలు. మీరుకూడా ఇక్కడ సరైన ఉపాధి లేకేగా దుబాయ్ వెళ్లింది? అయినా ఈకాలంలో నీతీనిజాయితీలకు చోటెక్కడుందిలెండి.'

'అలా అనకుబాబూ...ఆ దేశంలోని పరమకాఠిన్యం చూసివచ్చి అనుభవంతో చెబుతున్నాను.మనదేశంలో ఇంకా మానవత్వపు విలువలు పూర్తిగా నశించిపోలేదులే.ఇదిగామేమీ అనుకోకపోతే కాస్త దగ్గరదారిలో త్వరగా తీసికెళ్లు.నావాళ్లని చూడాలని ఎంత ఆరాటంగానో వుంది.అన్నట్టు నువ్వు ఏమాత్రం నిరాశ పెంచుకోకు...కష్టాలు లేని జీవితం ఎక్కడుంటుంది చెప్పు. ఆశగా ఓపికగా ఈదుకుంటూ పోవడమే. నీకూ మంచిరోజులొస్తాయిలే.నా మాట నమ్ము.'

ఆయన ఆరాటానికి కళ్లు చెమ్మగిల్లి టాక్సీ రూట్ మార్చాడు కిరీటి.

'ఏం మంచిరోజులు లెండి.ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక, మరోపక్క మానాన్నగారి ఆపరేషనుకు అవసరపడి నాలుగేళ్లక్రితం ఇంటిమీద అప్పుతీసుకున్నాం. అది వడ్డీతో సహా పాపం పెరిగినట్టు పెరిగిపోయి నా సంపాదనంతా మింగేస్తోంది. రాత్రిబగళ్లు కష్టపడుతున్నా ఫలితం తక్కువే...ఇంకా చెల్లి పెళ్లి...వుంది.ఇవాళమాత్రం మీ దయవల్ల మంచి బేరం తగిలింది నాకు.ఆ...మీ ఏరియా దగ్గరలోకి వచ్చేస్తున్నాం. ఈ జంక్షన్‌నుంచి ఇంకా 5కిలోమీటర్లుంటుంది మీయిల్లు...కొండగుర్తులు చెప్పండి.క్షణాల్లో దింపేస్తాను.'

వెనకనుంచి జవాబు రాకపోయేసరికి 'ఏంటి మాట్లాడరు?' అంటూ ఆయన అలసటతో నిద్రపోయాడేమోనని కిరీటి వెనక్కి తిరిగిచూసాడు.

'అరె నిద్రపోతున్నారా?...ఏవండోయ్...మిమ్మల్నే...లేవండి.అడ్రసు చెప్పండి.'

తన మాటలకి సమాధానం రాకపోయేసరికి టాక్సీ ఆపి ఆందోళనగా ఆ వృద్ధుని ఒంటిమీద చెయ్యేసాడు కిరీటి.

'అరె... ప్రాణం పోయినట్టుంది. హార్ట్ ఎటాక్ యేమో!మైగాడ్ ! అరె...ఈ నల్లబ్యాగ్‌లో అడ్రసుంటుందేమో...బాప్‌రే....కరెన్సీ నోట్ల కట్టలు...ఎయిర్‌పోర్టులో మార్చుకుని ఉండాలి.అందుకేనా ఈయన అంత ధీమాగా ఉన్నాడు.'

కిరీటికి కళ్లు చీకట్లు కమ్మినట్టు అయింది కాసేపు.

'ఇప్పుడేమిటి కర్తవ్యం?ఇతన్ని ఈ లగేజ్‌తో సహా ఈ అడ్రసులో అప్పజెప్తే...వాళ్లు సవాలక్ష ప్రశ్నలేసి ...ఈ డబ్బు ఇంకా ఉండాలి ఏంచేసావంటే? అమ్మో లేనిపోని చిక్కుల్లో ఇరుక్కోవలసివస్తుందేమో.... ఇప్పుడేం చెయ్యాలి...ఎంత డబ్బు .....డబ్బు.....డబ్బు....?

రోజూ నా ఘోషకి విసుగెత్తిపోయి...భగవంతుడు ఇప్పుడు అనుకోకుండా నాకు ఈ అవకాశం కల్పించాడేమో....ఇంతడబ్బు నాకు దక్కింది.కానీ ...???

నో...వేరే ఆలోచన వద్దు...ఈమనిషి వస్తున్నట్టు ఇంట్లోవాళ్లకి తెలియదు. నాటాక్సీ ఎక్కినట్టు కూడా ఎవరికీ తెలియదు.ఈ డబ్బు తీసుకుని ఈ శవాన్నీ పక్కనే పొదల్లో ఉంచి పోతే సరి...అస్థిపంజరమయిపోవాలిగాని...ఎవరూ రాని ఈదారిలోని చెట్ల మధ్యలో శవం ఎవరికంటా పడే అవకాశమే ఉండదు .'

ఆలోచన రావడమే తడవు మరింక ఆలస్యం చెయ్యలేదు కిరీటి.అనుకున్న పని పూర్తిచేసాడు.

+++

దడదడలాడుతున్న గుండెతో నడుపుతున్న టాక్సీని తమ వీధి లోకి తిప్పాడు కిరీటి.

రెండేళ్లుగా ఉద్యోగాల వేటలో విసిగిపోయి చివరికి ఫ్రెండ్ సలహామీద ఈ టాక్సీడ్రయివరు దారి పట్టాడు.

ఇంత బ్రతుకూ బ్రతికి ఇంటి వెనకాలే చావడం అంటే ఇదేనేమో!

ఇల్లు దగ్గరకు వస్తోందంటేనే చిరాకు కలుగుతోంది.

అబ్బ ...రాత్రయ్యేసరికి రోడ్డు మీద నిత్యం ఒకటే కుక్కల భాగోతం!

3

మనుషుల్లాగే వాటికీ పడదో ఏమోగానీ నల్లకుక్క, ఎర్ర కుక్క తీవ్రంగా పోట్లాడుకుంటూనే ఉంటాయి. బలవంతులదే రాజ్యమన్నట్టు కాస్త బలమైన నల్లకుక్క, ఎర్ర కుక్కని కరచి పారిపోతే… కుయ్యోమంటూ కూలపడిపోతుంది ఆ కుక్క.

తమ ఇంటి తలుపు సందులోంచి దీపం వెలుగుతున్న సూచనగా సన్నటి వెలుగు బయటకి ప్రసరిస్తోంది. అంటే…హూ…అమ్మ నాకోసం ఇంకా మేలుకునే వుందన్నమాట….వద్దన్నా వినదుకదా! అనుకున్నాడు కిరీటి.

కొడుకు అడుగుల చప్పుడు విని అన్నపూర్ణమ్మ కళ్లు నులుముకుంటూ లేచింది.

'రోజూ యాక్సిడెంట్ల గురించి వింటూంటే నువ్వింటికొచ్చేదాకా మా ప్రాణాలు అల్లాడిపోతున్నాయిరా! అంత చదువు చదివి దర్జాగా ఏ దొరబాబులాంటి ఉద్యోగమో చేసుకోక ఈ డ్రైవరు పనేంటిరా చిన్నా? '

కోపంతోబాటు తల్లి అమాయకత్వానికి జాలేసింది కిరీటికి.

'ఈదేశంలో నాలాంటి దౌర్భాగ్యులకు చదువుకు తగిన ఉద్యోగం రాదని తెలిపోయాకే కదమ్మా ఇందులో ప్రవేశించాను. మనకి ఇప్పుడు ఏదో నాలుగు వేళ్లు నోట్లోకి పోతున్నాయి. ఎలా మానమంటావు చెప్పు. చెల్లికి పెళ్లి చేయాల్సిన బాధ్యతకూడా మనమీద వుందికదా!'

'సరేలేరా నాయనా? ఏంచెప్పినా ఇంకేదో చెప్పి ముందుకాళ్లకు బంధం వేస్తావు.'

'అన్నపూర్ణా! చేసేది డ్రైవరు పనే అయినా మనవాడు స్వతంత్రంగా నిజాయితీగా కష్టించి బ్రతుకుతున్నాడు. మనకది చాలదా?వచ్చీరాగానే వాడిని విసిగించద్దని నీకెన్నిసార్లు చెప్పాను?'

తండ్రి గొంతు విని గాఢంగా నిట్టూర్చాడు కిరీటి.

'హూ!నాన్న కూడా పడుకోలేదన్నమాట.. ఈ తల్లిదండ్రులింతే…తనలాంటి అసమర్ధ కొడుకులుంటే వాళ్లకి నిద్ర ఎలా వస్తుంది?'

చేతిలోని నల్ల బ్యాగ్‌ని గబగబా పాతకాలపు చెక్కబీరువాలోకి తోసేసి మంచంమీద వాలిపోయాడు కిరీటి.

'అదేమిటిరా నాయనా…అన్నంతినకుండానే మంచం ఎక్కేస్తున్నావ్?'

సమాధానం చెప్పలేదు కిరీటి. అప్పటికే అతని ఒళ్లు జ్వరంతో సలసలా మరిగిపోవడం మొదలెట్టింది.

తను చేసిన పని గుర్తొచ్చి తలలో నరాలు పొంగిపోవడం మొదలెట్టాయి కిరీటికి. మరుక్షణం కిరీటి కళ్లు మూతలు పడిపోయాయి.

+++

కిరీటికి బాగా ఉక్కబోయడంతో చటుక్కున తెలివి వచ్చింది.

'చెమటతో ఒళ్లంతా ఎలా తడిసిపోయిందో..ఇదేమిటి ఇలా పడుకుండిపోయాను…ఉదయం టాక్సీ వెయ్యడానికి వెళ్లొద్దూ…ఇంకా చీకటి విడిపోలేదు. ఇపుడు టైమెంతయిందో?' కిరీటి లేవబోయాడు.

ఒళ్లంతా నొప్పులు…నిస్త్రాణగా మళ్లీ వాలిపోయాడు. బయటగదిలోంచి మాటలు వినిపిస్తున్నాయి.

'సుజా…ఏంతల్లీ ఇంతాలస్యమయింది?అమ్మ, నువ్వు అర్జంటుగా మీఫ్రండ్‌సమీర ఇంటికి వెళాల్సివచ్చిందని చెప్పింది. వాళ్లంతా కులాసాయేనా?'

తండ్రి మాటలకి చెల్లి సుజాత గాఢంగా నిట్టూర్పు వదిలింది.

ఆయన తమకి తండ్రి మాత్రమేకాదు చిన్నతనంనుండి తమకు అక్షరాలు నేర్పడంలో ఆదర్శాలు నింపడంలో ఆనందాలు పంచడంలో అనుబంధాలు పెంచడంలో మనుషులను కలపడంలో మనుషులని మలచడంలో తర్ఫీదునిచ్చిన ఉత్తమ ఉపాధ్యాయుడు. సమాజంలో అందరి ఉన్నతిని తన ఉన్నతిగా భావించే నిస్వార్ధ ప్రేమికుడు. తన శిష్యుల్లాగే కన్నబిడ్డల జీవితాన్ని కూడా ఉన్నతంగా తీర్చిదిద్ది తమని సమాజంలోకి వదిలిపెట్టి ఎంతో స్వేచ్ఛనిచ్చాడు. అందుకే ఆడపిల్లయిన తను రాత్రి తెల్లవార్లూ ఇంట్లో లేకపోయినా ఆయనకు అపనమ్మకంలేదు. తన పిల్లలు దారి తప్పరని ఆయనకు ప్రగాఢ నమ్మకం. కానీ లోకం ఎంత మాయదారిగా మారిపోయిందో ఆయనకు తెలియడం లేదనే ఆమె కంఠంలో అంతులేని బాధ…

'రాత్రంతా హాస్పిటల్‌లోనే ఉండాల్సివచ్చింది నాన్నా…'

'ఏమయిందమ్మా!'

'సమీర నాన్నగారు దాని చిన్నతనంలోనే దుబాయ్ వెళ్లిపోయారు కదా! ఆయన డబ్బులు పంపిస్తున్నా పాపం వాళ్లమ్మగారొక్కరే ముగ్గురాడపిల్లలనీ పెంచుకొస్తున్నారా?సమీర చెల్లెలు సరోజ మెడిసిన్ చదువుతోందికదా!ఆ అమ్మాయిని కొన్నాళ్లుగా వాళ్ల అనాటమీ ప్రొఫెసరే ఉచ్చంనీచం లేకుండా వేధిస్తున్నాడు. మగదిక్కులేదని నోరు విప్పలేక మౌనంగా భరిస్తూనే ఉంది అది. చివరికి సరోజ తనకి లొంగడం లేదని చాలా దారుణంగా దొంగతనం అంటగట్టి నిన్న అందరిముందూ అవమానించాడుట….దాంతో ఇంటికి వచ్చేసి

4

రోజంతా తలుపులు మూసుకుని ఏడుస్తూనే ఉందిట.అవమానం భరించలేక నిద్రమాత్రలు మింగేసింది. వాళ్లమ్మగారసలే గుండెజబ్బు మనిషి కదా! గాభరాతో స్ట్రోక్ వచ్చి పడిపోతే ఆవిడనీ ఆస్పత్రిలో చేర్చాం. బంధువులు వాళ్ల నాన్నగారికోసం ఎంత ప్రయత్నించినా ఆయన దొరకడంలేదట నాన్నా!'

ఆ సంభాషణ వింటున్న కిరీటి అదిరిపోయాడు.

'భగవంతుడా! కొంపదీసి ఆ వృద్ధుడు... సమీర తండ్రి కాదు కదా! ఆయన తన భార్యకి గుండెజబ్బని చెప్పాడు.ముగ్గురాడపిల్లలని కూడా చెప్పాడు.ఆకుటుంబం ఇదేకాదుకదా! డబ్బెంత పాపిష్టిది. కాదుకాదు నేనెంత పాపిష్టివాడిని' 'మనదేశంలో ఇంకా మానవత్వపు విలువలు పూర్తిగా నశించిపోలేదులే బాబూ 'అన్న మనిషి డబ్బు కాజేసాను దురాశతో.'

కిరీటిలో ఆందోళన పెరిగిపోయింది.సుజాత కంఠంలో కోపం... అసహనం.

'అయినా ఉపాధ్యాయవృత్తిలో ఉండి బిడ్డల్లాంటి శిష్యులపట్ల అలా మానవత్వాన్ని మరిచిపోయే వాళ్లనేమనాలి నాన్నా!'

తండ్రి నిట్టూర్చాడు.

' నాటే విత్తు మంచిదయితేనే చెట్టు మంచిదవుతుంది తల్లీ! బాల్యంలో తల్లిదండ్రుల సరైన మార్గదర్శకత్వం లేకపోతే కూడా ఇదిగో ఇలాంటి సమస్యలే వస్తాయి.అప్పుడే ఇలాంటి తలదించుకునే సంఘటనలుగాని వాటికి అతి సున్నితంగా స్పందించి ప్రాణాలు తీసుకోవడం గానీ జరుగుతుంది సుజాతా!'

అన్నపూర్ణకి కోపం వచ్చింది.

' పవిత్రమైన ప్రొఫెసరు వృత్తిలో ఉండి ఇలా ప్రవర్తించడం పైగా అయినింటి ఆడపిల్లని దొంగ అనడమేంటి?'

'చెప్పానుగా అన్నపూర్ణా... ఈ ప్రపంచాన్ని శాసించ గలది సంపదాకాదు...మేథా కాదు...నైతిక ప్రవర్తన. నైతిక విలువలు కలిగిన వివేకమే లోకాన్ని పాలిస్తుంది.'

అన్నపూర్ణ మనసు నీరయిపోయింది.

'ఇటువంటి సమయాల్లోనే కుటుంబ సభ్యులు ఆపిల్లకు రక్షణకవచంలా అండదండగా ఉండాలి సుజాతా!'

సుజాత నిట్టూర్చింది.'వాళ్ల నాన్నగారితో మాట్లాడితే అయినా వాళ్లకి కాస్త ధైర్యమొచ్చేదమ్మా కానీ...రోజూలాగ ..ఆయన నుంచి ఫోన్ రాలేదని కూడా కంగారు పడుతున్నారు వాళ్లు.మధ్యలో అదో బాధ.అసలు ఈ ప్రొఫెసర్లాంటివాళ్లని ఏంచేసినా పాపంలేదు నాన్నా!'

'చెప్పానుకదమ్మా...సంస్కృతీ సంప్రదాయాలనేవి అందరికీ కుటుంబపరంగా అందాల్సినవి మరి.నాబిడ్డల విషయంలో మాత్రం నాకు పరిపూర్ణ విశ్వాసం ఉంది.ఎపుడైనా తప్పు చేసినా వెంటనే సరిదిద్దుకోగల సంస్కారం మీఅమ్మ మీకు కలిగించిందనే అనుకుంటున్నాను.'

తండ్రి మాటలకి లోపలనుంచి అంతా వింటున్న కిరీటి లోలోపలే కుమిలిపోయాడు.

'అమ్మానాన్నలకు నామీద ఎంత విశ్వాసం...కానీ నేను అంతడబ్బును చూసి వివేకం మరిచిపోయి కుక్కకంటె హీనమైన పని చేసాను.'

తల్లిమాటలు తగ్గుస్వరంలో వినిపించాయి కిరీటికి.

'మీనాన్నగారికి నామీద ఎంత నమ్మకమో నాకూ మీఇద్దరిమీదా అంతే విశ్వాసమమ్మా... నాబిడ్డలెప్పుడూ నీతి తప్పరు...సుజాతా!ఎప్పుడైనా నా విశ్వాసం వమ్మయితే....మా ప్రాణాలమీద మాకు వ్యామోహం లేదు.'

సుజాత కంఠంలో బాధ.

'అవేంమాటలమ్మా...అన్నయ్యగానీ నేనుగానీ మీమనసు నొప్పించే పనులేమీ చెయ్యడంలేదుగదా.'

'ఇదిగో అన్నపూర్ణా...మాట వచ్చింది కనుక చెబుతున్నాను.ప్రతి ఉద్యోగంలోను కష్టసుఖాలుంటాయి. మన కిరీటి బ్రతుకు తెరువుకు ఎంచుకున్న డ్రైవరు ఉద్యోగం మానెయ్యమని ఇంకెప్పుడూ నీ ప్రశ్నలతో వేధించకుసుమా!మనిషికి విలువ అనేది చేసే ఉద్యోగాన్ని బట్టి కాదు ఉండేది.'

'అలాగేనండీ!వాడు చేసే ఉద్యోగం కంటే మనకి వాడి నీతీ నిజాయితీలు ముఖ్యం.'

కిరీటి మరింక ఆగలేక తల కొట్టుకున్నాడు.

'అమ్మా...నీనమ్మకాన్ని నేనెప్పుడూ వృధా చెయ్యనమ్మా... ఈ డబ్బు సంచిని ఆప్రయాణీకుడి కుటుంబానికి అందించడం, ఆ వ్యక్తికి దగ్గరుండి అంతిమ సంస్కారం...చెయ్యకపోతే ...నేను మన వీధిలోని నల్ల కుక్క కన్నా నికృష్టమైన వాడితో సమానం.ఇపుడే వెళ్తాను...ఇంక ఆలస్యం చెయ్యను.'

5

సంధించిన బాణంలా గదిలోంచి బయటికి వచ్చి ఎవరివైపు చూడకుండా చేతిలో సంచీతో బయటికి దూసుకుపోతున్న కొడుకును చూసి అన్నపూర్ణ అల్లాడిపోయింది.

తల్లిమనసు మరి.తన సంతాన రక్షణ తప్ప ఆమెకి మరో ఉన్నతాశయం లేదు.ఆమె వాత్సల్యమూర్తేకాదు, కర్తవ్య బోధా పరాయణ కూడా. లోకంలోని కల్మషం బారిన పడకుండా బిడ్డలకు ఆమె పలుకులే రక్షణ కవచమవాలని కోరుకుంది..

'అయ్యయ్యో రాత్రంతా ఒళ్లెరగని జ్వరం...ఎక్కడిరా చిన్నా ఆపరుగు ?'

అన్నయ్య ఏంచెయ్యబోతున్నాడో ఊహించిన సుజాత మనసులోనే తేలికగా నిట్టూర్చింది.

'అన్నయ్యా!మనంనాటిన విత్తులు అమృత ఫలాలే ఇస్తాయి అని అమ్మానాన్నలకి మనమీద ఎంత నమ్మకమో విన్నావా? నూటనాలుగు డిగ్రీల జ్వరంతో నువ్వు రావడం, జ్వరంలో పలవరింతలు...అమ్మకు ఏమీ అర్థంకాక నాన్నగారితో చెప్పింది. నాన్నగారు నాకు 'కీ' ఇచ్చారు. ఏడాది క్రితం ఎప్పుడో నాఫ్రండ్‌కి జరిగిన సంఘటనతో మొదలెట్టాం.అమ్మ మార్గదర్శకత్వం ఫలించింది.పిచ్చి అన్నయ్యా ...మానవత్వం ఏదో ఒకపాలులో లేకుండా మనిషి పుట్టుకే రాదు. కొందరి మనుషుల్లో పెద్ద అక్షరాలతోను, మరికొందరిలో చిన్న అక్షరాలతోను ఉంటుంది. '

కిరీటి ఎవరో తరుముతున్నట్టు అత్యంత వేగంగా టాక్సీలో నిన్నటి ప్రదేశానికి వెళ్లి ఆ తొలిసందె వెలుగులో ...తన కళ్ళ ఎదురుగా అమాయకంగా ప్రశాంతంగా నిద్రపోతున్నట్టున్న ఆ వృద్ధ ప్రయాణీకుని ముఖం...చూసేసరికి ...అతను తనపట్ల చూపిన వాత్సల్యం, నమ్మకం గుర్తొచ్చి అతని మనసు పూర్తిగా కరిగి నీరై కళ్ళ వెంట ప్రవహించి వెక్కివెక్కి ఏడ్చాడు.

దాని పేరే మానవత్వం ...తర్వాత కిరీటి ఏంచేసాడనేది ఊహించలేనిదేం కాదు.అయినా అప్రస్తుతం...

ఆరోజు సాయంత్రం ఇంట్లోకెళ్లేముందు అలవాటుగా రోడ్డుమీదికి చూసాడు కిరీటి.

లారీ తొక్కేసి మాంసపు ముద్దగా మారిన ఎర్ర కుక్క కళేబరం ఇంకా అక్కడే పడి ఉంది. పాపం ఎప్పుడూ ఎర్ర కుక్కతో పోట్లాడి గెలిచే నల్లకుక్క ఆ మాంసంముద్ద చుట్టూ తిరుగుతూ అతి కష్టంమీద దానిని పెంట కుప్ప వరకు ఈడ్చుకొచ్చి కాలితో మట్టిని తవ్వి చెత్తతో ఆ కళేబరాన్ని కప్పేసింది. తర్వాత దిగాలుగా అక్కడే కన్నీళ్ళు కారుస్తూ కూర్చుంది.

అదంతా కళ్లారా చూసిన కిరీటి చలించిపోయాడు.

'నేను ఈ కుక్కకంటెకూడా హీనం కాకుండా అమ్మ మాటలు నాకు రక్షణకవచమయ్యాయన్నమాట.'

అందుకే మనుస్మృతి సైతం- "ఉపాధ్యాయాన్ దశాచార్య: ఆచార్యాణాం శతంపితా।-సహస్రంతు పితౄన్మాతా గౌరవేణాతిరిచ్యతే॥ అంటూ మాతృమూర్తికి మహోన్నత స్థానాన్నిచ్చింది???

+++

# "ఉత్తమ కవిత విభాగం" లో ప్రశంసా పత్రం పొందిన కవిత: పలకరింపు - యామిని రాజశేఖర్ కోళ్ళూరు (గల్ఫ్ - అబు దాబి)

ఉషోదయపు నులివెచ్చని కిరణాల వెలుగులు

కోడికూతలు పక్షుల కిలకిలరావాలు సుప్రభాతం

అలారంమోతతో స్నేహితుల సన్నిహితుల సందేశాలు

పల్లెల్లో పచ్చని పైరగాలుల అందమైన పలకరింపు

కూరగాయలు అమ్మే వారి పిలుపులో పలకరింపు

పనివాళ్ళు పాలుపోసేవారి ఆప్యాయ పలకరింపు

ఇంటి లోగిళ్ళలో వార్తాపత్రికలు వేస్తు పేపర్ అనే

ఆ వ్యక్తి అరుపు లో పలకరించే పలకరింపు

బోసిపాపాయిల ముసిముసి నవ్వుల పలకరింపు

స్వాగతం పలుకుతూ చెప్పే తియ్యని పలకరింపు

అమ్మమాట నాన్న పిలుపులో తేనెలూరు పలకరింపు

ఆత్మీయుల చుట్టాల రాకతో కలుపుగోల పలకరింపు

కవి కలంలో జాలువారే ప్రతి అక్షరం పలకరింపు

సినీసాహిత్యంలో పాటల మాటల పలకరింపు

బాలల సాహిత్యంలో వారి మనోభావాల పలకరింపు

సాహితి ప్రపంచం లో కొత్త కవుల తొలి పలకరింపు

వ్యక్తి గౌరవాన్ని పెంచుతూ శత్రువులని మిత్రులుగా

మార్చి కష్టాల్లోబాధల్లో ధైర్యాన్నిస్తూ మనసుకు

సంతోషాలని చేకూర్చే తొలకరి చిరుజల్లుల లాంటి

అద్భుత దివ్యఔషధం మల్లెల సుగంధం పలకరింపు.

ooo

# "ఉత్తమ కవిత విభాగం" లో ప్రశంసా పత్రం పొందిన కవిత: ఎదురు చూపులు - రవి మంత్రిప్రగడ (ఐర్లండ్)

ఒంటరితనం...

నువ్వు రాక ముందు కొన్ని సంవత్సరాలు ఇదే నా ప్రియమైన సహచరి.

సమూహంలో ఉన్నా నన్ను వదలక,అనుక్షణం వెన్నంటి ఉండే నా నీడ తను.

నువ్వు వచ్చిన కొత్తలో నన్ను వదిలి వెళ్లనని ఎంత మొండికేసిందనీ?

ఒప్పించి,బుజ్జగించి,తనతో నాకు ఇక అవసరం లేదని మెల్లగా బయటకి పంపేసాను.

నొచ్చుకుంది కాబోలు...పాపం!

నువ్వు పక్కన ఉన్నన్ని రోజులూ తన ధ్యాసే లేదంటే నమ్ముతావా?

బ్రతుకంతా రాత్రికిరాత్రి బాగుపడిపోయినట్టు ధీమా వచ్చేసింది.

ఇదిగో...మన మధ్య ఈ దూరం కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది నాకు...

విరహం అనుకుందామా అంటే, నీ చుట్టూ ఉన్న నీ బంధాల అడ్డుగోడలు నన్ను చూసి కాదని వెకిలిగా నవ్వాయి.

ఎందుకో,ఈ నాలుగు గోడలూ మళ్ళీ నా పాత సహచరిని గుర్తుచేస్తున్నాయి.

తలచుకున్నదే తడవు,నేనెక్కడికి వెళ్తా అంటూ గుమ్మంచాటు నుండి తొంగి చూసింది.

ఎప్పటికైనా నా తోడు తనే అని మరొక్కసారి మందలించింది.

నేను తనకి బానిసనట.....వినడానికి కష్టంగా ఉన్నా ఇదే నిజం అని చెప్పింది.

నువ్వు పరిచయం చేసిన ఆశ మాత్రం నా మనసులో నుండి నాకు సందేశాలు పంపుతోంది.

ఈ ఒంటరితనాన్ని నాకు శాశ్వతంగా దూరం చేసే రోజు కోసం ఎదురుచూస్తోంది!!!

★★★

# అశోక మౌర్య -14 : డా. వల్లూరుపల్లి శివాజీ రావు (రోజ్ విల్లి, కాలిఫోర్నియా)

**8. అశోకుడు**

గత సంచికలో అశోక చక్రవర్తి తన ఆధ్వర్యంలో నెలకొల్పిన అనేక ధర్మస్థంభాలలో (స్తూపాలు, మహా చైత్యలు) సారనాధ్, సాంచి, వైశాలి, లుంబిని లో ఉన్న వాటిని గురించి తెలుసుకొనటం జరిగింది. ఈ సంచికలో అయన నెలకొల్పిన మరి కొన్ని ధర్మ స్థంభాల గురించి తెలుసుకుందాము.

**ఢిల్లీ-తోప్రా అశోక ధర్మ స్థంభం**

మౌర్యుల కాలంలో ఇప్పటి హరియానాలోని యమునానగర్ కు పశ్చిమాన 14 కి.మీ. దూరంలో, 'తోప్రా' (Topra) అనే నగరం ఉండేది. కాలక్రమాన ఒక గ్రామంగా మారిన ఈ తోప్రా పంజాబు లోని చండీఘర్ కు 90 కి.మీ. దూరంలో ఉన్నది. అప్పటి ఈ నగరంలో ఒక ధర్మ స్తంభాన్ని అశోకుడు నెలకొల్పాడు. దాదాపు 1600 ఏళ్ళు అక్కడే ఉన్న ఈ అశోక స్తంభాన్ని తురుష్క నవాబు 'ఫిరోజ్ షా తుగ్లక్' క్రీ.శ. 1356 లో పెకలించి ఢిల్లీ నగరానికి తరలించాడు. ఈ స్థంభం ఈ రోజు పాత ఢిల్లీ లో 'ఫిరోజ్ షా కోట్ల' (Feroz Shah Khotla) లో మహ్మదీయ కట్టడాల మధ్య ఉంది. దీని మీద బ్రహ్మ లిపిలో ప్రాకృత భాషలో అశోక

శాసనం చెక్కించబడింది. అది '**దేవనామప్రియ ప్రియదర్శి**' అనే నామంతో ఈ విధంగా ఉంది:

***"రహదారుల ప్రక్కన మానవులు, జంతువుల కొరకు అత్తి చెట్లను (fig trees) నాటించాను..... పెద్ద ఉద్యోగములు చేసేవారు, విద్యావంతులు, నిపుణులు తమ సామర్ధ్యాన్ని వినియోగించి పిల్లల దృష్టిలో, వారి హృదయాలలో ధర్మం, మతం గురించిన బోధనల ద్వారా అత్యుత్సాహం ప్రదర్శించేటట్లుగా తీర్చి దిద్దాలి. ..... నేను చేసిన, ఆజ్ఞాపించిన ధర్మకార్యాలు నా తరువాత వచ్చే వారు తప్పనిసరిగా పాటించాలి. .....తల్లిదండ్రులకు, ఆధ్యాత్మిక గురువులకు, విద్వాంసులకు, అనాధలకు, దిక్కులేనివారికి, నిరుపేదలకు, సేవకులకు, పరిచారికలకు, ధర్మ బుద్ధితో, అతి గౌరవంతో పాలిక వర్గాలు ప్రవర్తించాలి..........."***

**"మతం, ధర్మం రెండు విధాల వృద్ధి చెందుతుంది. అవి మతాధికారి, ధర్మాధికారుల ద్వారా, మరియు హింసను అంతం చేసి అహింసను ప్రోత్సహించటం ద్వారా......అసలు అన్ని జీవులకు మరణ దండన నిషేధిస్తే మానవుల యెడల జరిగే హింసను అంతం చేసేటట్లు రాజులు, అధికారులు ప్రవర్తించాలి......**

ఇలా జరిగినప్పుడు నా పుత్రులు, వారి పుత్రులు, వారి వారి పుత్రులు సూర్యుడు, చంద్రుడు ఉన్నంతవరకు ప్రజలు ధర్మ మార్గంలో నడుస్తూ సుఖ సంతోషాలతో ఉండగలరు.... రాతి స్తంభాల మీద ఈ నా శాసనం చెక్కించడం వల్ల కలకాలం నా సందేశం ప్రజలకు లభ్యమవుతుంది."



డిల్లీ లో ఫిరోజ్ షా కోట్ల వద్ద డిల్లీ-తోప్రా అశోక ధర్మ స్థంభం

**డిల్లీ-మీరట్ ధర్మ స్థంభం**

అశోకుడు మరొక ధర్మ స్తంభాన్ని ఉత్తరప్రదేశ్ లోని మీరట్ లో నెలకొల్పాడు. ఈ పట్టణం డిల్లీ కి 70 కి.మీ. దూరంలో ఉంది. ఈ 33 అడుగుల భారీ స్తంభాన్ని కూడా ఫిరోజ్ షా తుగ్లక్ డిల్లీ కి తరలించటం జరిగింది. ఈ తరలింపుకు 42 చక్రాల వాహనం మీద యమునా నది తీరానికి తీసుకువచ్చి, ఆ తరువాత అది పెద్ద నావలో డిల్లీకి తరలించటం జరిగింది.



మరొక మహ్మ దీయ సుల్తాను పాలనలో (1713-19) పేలుడు జరిగి నప్పుడు ఈ స్థంభం 5 ముక్కలు అయింది. తరవాత 100 ఏళ్లకు బ్రిటిష్ పాలకులు ఒక ముక్కను బ్రిటిష్ మ్యూజి యంకు తరలించగా మిగతా నాలుగు ముక్కలను కలకత్తా కు తరలించారు. వీటిని 1887 లో డిల్లీ తీసుకువచ్చి వీటిని అతికించి పాతించి నిలబెట్టటం జరిగింది.

**కౌశంబి-అలహాబాదు ధర్మ స్థంభం**

అశోక చక్రవర్తి నిర్మించిన మరొక ధర్మ స్థంభం ఈ కౌశంబి-అలహాబాదు స్థంభం. దీనిని మొదట కౌశంబి లో ఇసుక రాయితో నిర్మించినప్పుడు స్థంభం ఎత్తు 35 అడుగులు. స్థంభం క్రింది వైశాల్యం 35 అంగు ళాలు, పైన వైశాల్యం 26 అంగుళాలు. స్థంభం పైన చుట్టూ **పద్మాల ఆకారం లో** ఉన్న ఫలకం నిర్మించ బడింది. దాని పైన ఏక-సింహం నిలబడి ఉంటుంది. తరువాత కాలంలో ఈ ధర్మ స్థంభాన్ని పశ్చిమ

వైపు 50 కి.మీ. దూరంలో ఉన్న అలహాబాదు (ప్రయాగ్ రాజ్) కు తరలించబడింది. ఈ ప్రయాగ్ రాజ్ ఆ కాలంలో 'వత్స' (Vatsa) రాజ్యానికి రాజధాని.



ఈ ధర్మ స్థంభం పలుమార్లు పెకలించబడి పాతబడి నట్లు కొందరు చరిత్రకారులు నుడివినా, ఇది అసత్యమని నిర్ధా రించబడింది. కౌశంబి నుంచి తరలించబడి ప్రయాగ లో గంగా-యమున నదుల సంగమం వద్ద ప్రతిష్టించబడిన తరువాత ఈ స్థంభం ఎక్కడికీ తరలించబడలేదు.

ఈ స్థంభం మీద అశోకుడి రాజ శాసనాలు 6 ఉన్నాయి. ఇందులో మొదటి రెండు శాసనాలు ఇప్పటికీ స్పష్టంగానే ఉన్నాయి. అలాగే 5 వ శాసనం చివరి రెండు పంక్తులు కూడా. మూడు, నాలుగవ శాసనాలను మొఘల్ నవాబు జహంగీర్ తొలగించి తన పూర్వీకుల పేర్లను చెక్కించాడు. 6 వ శాసనం మాత్రం ఒక అర పంక్తి మినహా మిగతా పంక్తులు స్పష్టంగానే ఉన్నాయి.

స్పష్టంగా ఉన్న పంక్తుల ద్వారా '**దేవనామ ప్రియ**' ఆజ్ఞలు ఇలా ఉన్నాయి:

**"ఎవరూ ఈ నా ఆజ్ఞను అతిక్రమించరాదు. బౌద్ధ సన్యాసులు, సన్యాసినిల శ్రేణులను ఒకటిగా చేయటం జరిగింది. ఈ ఐక్యం నా పుత్రులు, మనుమలు, ముని మనుమలు కాలం వరకు, సూర్య చంద్రులున్నంత వరకు వర్ధిల్లాలి. ఎవరయితే వీరిమధ్య విబేధాలు సృష్టిస్తారో వారి చేత శ్వేత వస్త్రాలు ధరింపజేసి సన్యాసులు, సన్యాసినిలు నివసించని చోట నివశిచేటట్లు చేయాలి. ఈ నా ఆజ్ఞ, అభిలాష సన్యాసుల శ్రేణులకు, సన్యాసినుల శ్రేణులకు తెలియచేయాలి. నా ఆజ్ఞతో ఉన్న ఈ మూల పత్రం ఒక నకలు సమావేశ ప్రదేశం (గది, చావడి) లోనూ, మరొక నకలు మతాధికారి వద్ద ఉంచాలి.**

**"దేవనామ ప్రియ ఇంకా ఇలా ఆదేశిస్తున్నారు: సామాన్య వ్యక్తి ప్రతి 'ఉపాసత' రోజున (ప్రాయశ్చిత్తం చేసుకునే రోజున) ఈ నా ఆదేశాన్ని మన్నిస్తానని, ఆమోదిస్తానని ప్రతిజ్ఞ చేయాలి. క్రమం తప్పకుండా ఉపాసత ను హాజరు అయ్యే ప్రత్యేక రాజాధికారులకు కూడా ఇది వర్తిస్తుంది. వీరి అధికారిగా ఉన్న ప్రాంతంలో ఈ నాజ్ఞను వ్యాపింప జేయాలి. అలాగే సైనికాధికారులు పాలించే ప్రాంతాలలో కూడా."**

ఈ ధర్మ స్థంభం మీదే అశోకుడి శాసనం దిగువ క్రీ.శ. 4 వ శతాబ్దం లోని గుప్త వంశపు రాజు సముద్రగుప్త' (పాలన: 350 -375) కు సంబంధించిన ఒక శాసనం సంస్కృత భాషలో (బ్రహ్మ లిపి లో) ఉంది. దీనిని ఈ గుప్త రాజు


ఆస్థానంలో ఉన్న కవి, మంత్రి 'హరిసేన' చెక్కించాడు. ఇందులో సముద్ర గుప్తుడి రాజకీయ చతురత, యుద్ధాలలో సాధించిన అనేక విజయాలను కీర్తిస్తూ, స్తుతిస్తూ చేసిన వ్యాఖ్యలు ఉన్నాయి. ఈ వాక్యాలు స్థంభం మధ్యలో, దాని చుట్టూ, సుమారు 30 పంక్తులలో చెక్కించ బడ్డాయి.

### నిగాలి సాగర్ ధర్మ స్థంభం

నేపాల్ లోని 'లుంబిని' కి 20 కి.మీ. దూరంలో వాయువ్య దిశలో ఉన్న 'నిగాలి సాగర్' అనే ప్రదేశంలో అశోకుడు మరొక ధర్మ స్థంభం నెలకొల్పటం జరిగింది. దీనికి ఒక బలమైన కారణం ఉంది. బుద్ధుడి జన్మలలో గౌతమ బుద్ధ 24 వది. దీనికి ముందు జన్మలో, అంటే 23 వ జన్మలో ఆయన నామం 'బుద్ధ కొనకమన' (Buddha Konakamana). ఈయనను 'కనకముని' (Kanakamuni) అనేవారు.



కౌశంబి-అలహాబాదు (ప్రయాగ్ రాజ్)



6 పంక్తులున్న అశోకుడి శాసనం. ఇందులో కొన్ని (1, 2) స్పష్టంగానే ఉన్నా స్థంభం కొన్నిటిని (3, 4) తొలగించి వాటి స్థానే జహంగీర్ పూర్వీకుల నామాలున్నాయి. ఈ స్థంభం మీదే సముద్రగుప్త గురించి ఉన్న 30 పంక్తులున్నాయి (ఎరుపు దీర్ఘ చతురస్రం).

ఈ 23 వ బుద్ధుడి గురించి బౌద్ధ మత చరిత్రలో ఘనంగా కీర్తించబడింది. ఈయన ఈ నిగాలి సాగర్ లోనే రాజ భవనాలలో నివసించి, తరువాత నిరాడంబర జీవితం గడిపి, ఒక బ్రాహ్మణ పుత్రిక నుండి పాలు, అన్నం, మొదలగువాటిని భిక్షగా స్వీకరిస్తూ, చివరి దశలో కొన్ని ఏళ్ళు బోధి (ఉదుంబర) వృక్షం క్రింద ధ్యానం చేస్తూ జ్ఞానోదయం పొందటం జరిగింది. ఈ కనకముని బుద్ధుడి పేరుమీదనే ఈ నిగాలి సాగర్ ధర్మ స్థంభం నెలకొల్పబడింది.

ఇచ్చటి స్థంభం మీద శాసనం అశోక చక్రవర్తి క్రీ.పూ. 249 లో నిగాలి సాగర్ దర్శించినప్పుడు చెక్కబడింది. ఆ సమయంలోనే భూమిలో ఈ స్థంభం పాతించబడింది. ఆ సంవత్సరంలోనే ఆయన లుంబిని, గోతిహవ (Gotihawa) దర్శించి అచ్చటి ధర్మస్థంభాలకు తన నివాళులు, వందనములు అర్పించటం జరిగింది.

**రాంపూర్వ జంట ధర్మ స్తంభాలు**


బీహార్ రాష్ట్రంలో చంపారణ్ జిల్లాలో రాంపూర్వ (Rampurva) పట్టణంలో అశోకుడు జంట-ధర్మ స్థంభాలను నెలకొల్పటం జరిగింది. ఈ పట్టణం నేపాల్ సరిహద్దులో ఉంది. ఈ రాంపూర్వ (రామ పూర్వ) గౌతమ బుద్ధ పరినిర్వాణం చెందిన ఉత్తరప్రదేశ్ లోని '**కుసీనగర**' (Kusīnagara) సమీపంలో ఉంది. ఈ ధర్మ స్థంభం క్రీ.శ. 1877 లో భూమి పైభాగం విరిగి నేలమీద ఉన్న రెండు జంట ధర్మ స్థంభా లను ఒక ఆంగ్లేయుడు గుర్తించి వీటిని పునరుద్ధరించటానికి ప్రయత్నించాడు. కానీ అప్పటికే ఈ స్థంభాల పైన ఉన్న ఈ రెండు ఫలకాలు విరిగి నేలమీద పడియున్నాయి. ఈ స్థంభాలను మరల పాతి నిలబెట్టటానికి వీలు గాక ఈ రెండు ఫలకాలను ఢిల్లీ లో భద్రపరచడం జరిగింది. ఈ ఫలకాలలో ఒకటి సింహ ఫలకం, రెండవది ఎద్దు (bull) ఫలకం. ఈ స్థంభాల మీద అశోకుడి శాసనాలు చెక్కబడ్డాయి. ప్రాకృత భాషలో బ్రహ్మ లిపిలో ఉన్న ఆ శాసనాలు ఇప్పటికీ తర్జుమా చేయబడలేదు. తరువాత ఈ రెండు ఫలకాలకు నగిషి పెట్టిన తరువాత అవి అతి సుందరంగా తయార య్యాయి. వీటిల్లో ఎద్దు ఫలకం ఈరోజు ఢిల్లీ లోని రాష్ట్రపతి నిలయాన్ని అలంకరిస్తూ ఉంది.



నేలకొరిగిన ఒక రాంపూర్వ ధర్మ స్థంభం దీని ప్రక్కనే పడియున్న సింహ ఫలకం



నేలకొరిగిన స్థంభం నుండి వేరువడిన ఎద్దు ఫలకం



నగిషి పెట్టబడిన ఎద్దు ఫలకం. ఇది ప్రస్తుతం ఢిల్లీ రాష్ట్రపతి నిలయంలో ఉంది.

---------.. సశేషం ---------.

ఆంధ్రప్రదేశం లోని అమరావతి అశోక ధర్మ స్థంభంతో సహా దేశంలోని ఇతర ధర్మస్థంభాల గురించి వచ్చే సంచికలో తెలుసుకుందాము.

మీ అభిప్రాయాలు, స్పందన తెలియజేసేందుకు నా ఈ మెయిల్: dr_vs_rao@yahoo.com

# యోగా సాధన – 26 వ భాగము "సర్వాంగాసనం" – RVR Yogies

అందరూ ఆసనాలు, యోగా అంటూ చేస్తుంటారు అసలు ఆసనాలు అంటే ఏంటి ?
ఒక మనిషి శారీరకంగా వ్యక్తపరిచే ఎలాంటి భంగిమనైనా సరే ఆసనం అనవచ్చు. అయితే ఆసనం పుట్టుక గురించి ఎలాంటి మూలాధారాలు మనకు అందుబాటులో లేవు. మనిషి పుట్టిన నాటినుంచీ ఇది ఉంది. ఉయ్యాలలో పడుకోబెట్టిన పసిపిల్లలు చేసే విన్యాసాలు కూడా ఆసనాల క్రిందికే వస్తాయి.

అయితే భంగిమలనేవి ఒక క్రమపద్ధతిలో ఉంటూ, తగినంత వ్యాయామం చేస్తే వాటినే యోగాసనాలు అనవచ్చు. ఒక మనిషి సంపూర్ణ ఆరోగ్యవంతుడు అవడానికి కనీసం 25 రకాల ఆసనాలనైనా వేయడం అవసరమని యోగా పండితులు చెబుతుంటారు. ఇక చరిత్ర విషయానికి వస్తే... భగవద్గీతలో శ్రీకృష్ణుడు, ఉపనిషత్తులలో మహర్షులు యోగ విజ్ఞానానికి సంబంధించిన పలు విషయాలను వ్యక్తపరిచారు. అవి ఏంటంటే, రాజ, హఠ, కర్మ, భక్తి, ధ్యాన, జ్ఞాన యోగము లాంటివి. వీటిలో రాజయోగం శ్రేష్ఠమైనది చెబుతుంటారు.

అసలు యోగాసనాలు ఎందుకు వేయాలి?
అంటే.. మానవ శరీరం పలురకాల మాలిన్యాలతో పేరుకుంటూ ఉంటుంది. శరీరంలో కలిగే అనారోగాలకు ఈ మాలిన్యాలే కారణం కాబట్టి, వాటిని ఎప్పటికప్పుడు శుభ్రపరచుకోవాలి. ఈ మాలిన్యాల నిర్మూలకు యోగా ఒక చక్కటి పరిష్కారం. యోగా వలన శరీరంలో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. అందువల్ల పెద్దగా కష్టపడనవసరంలేని ఈ ఆసనాలను వేయటం ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలి.

ఆసనాలు అంటే ఒక వ్యక్తి ఒక ప్రత్యేక ప్రయోజనములు సాధించే నిమిత్తము కూర్చుండే, పరుండే శరీర స్థితిలో శరీరారోగ్యాన్ని రక్షించు కొనుట, మానసికంగా శారీరకంగాను అభివృద్ధి, రోగములనుండి కాపాడు కొనుటకు, తగ్గించు కొనుటకు, మందులతో పాటు ఆసనాలను వేసిన తొందరగా ఫలితములు పొందుదురు. శరీర బరువును తగ్గించు కొనుటకు మరియు పెంచు కొనుటకు చాలా ఉపయోగ కరంగా ఉండును. ఈ ఆసనాలను ఉదయము 4 గం || నుండి 6 గం || వరకు వేసిన చాలా మంచి ఫలితములు పొందుదురు.

ఈ ఆర్టికల్ లో మీకు నేను **సర్వాంగాసనం** యొక్క ఉపయోగాలు చెబుతాను.
సర్వాంగాసనం అనగా శరీరంలోని సర్వ (అన్ని) అంగములకు (అవయవాలకు) ఉపయోగపడుతుంది ఈ ఆసనం. ప్రస్తుతం ఉన్నటువంటి ఆధునిక జీవనశైలి వల్ల మన శరీరానికి సరైనటువంటి ి వ్యాయామం లేకుండా పోతోంది. దీనివల్ల ఊబకాయం, బీపి మరియు షగర్ లాంటి సమస్యలతో సతమతమవుతున్నాం. పైన చెప్పిన అనారోగ్య సమస్యలకు చెక్ పెట్టాలంటే ప్రతిరోజు క్రమం

తప్పకుండా ఈ సర్వాంగాసనం వేయటం చాలా బెటర్. ఈ ఆసనం వేయడం మొదట్లో కొంచెం కష్టంగా ఉండవచ్చు. శరీరానికి కొంచెం కొంచెంగా అలవాటు చెయ్యండి.

ముఖ్య గమనిక: యోగాని ఎప్పుడూ నిపుణుల సమక్షంలోనే చేయండి. అంతేగాని అరకొర జ్ఞానంతో సొంతంగా యోగ చేయాలని చూడకండి. అట్లాగే మీ శరీర తత్వానికి ఏ ఆసనం సూట్ అవుతుందో ఆ ప్రకారం చేస్తే బాగుంటుంది. యోగాతో పాటు సమతుల ఆహారం మరియు రోజుకు ఎనిమిది గంటల నిద్ర ఉండాలి. అప్పుడే మీరు పరిపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారు.



**సర్వాంగాసనం వేయు విధానము:**

ముందుగా నేల మీద యోగా మ్యాట్ పరచుకుని శవాసన భంగిమలో పడుకోవాలి. యోగ మ్యాట్ లేకపోతే మందపాటి క్లాత్ పైన కూడా చెయ్యెచ్చు. అంతే కానీ డైరెక్ట్ గా నేలమీద యోగాసనాలు వేయకండి. ఇప్పుడు రెండు కాళ్ళని దగ్గరికి చేర్చిన తరువాత మోకాళ్ళని ఛాతీ వరకు మరచి నెమ్మదిగా రెండు కాళ్ళని పైకి లేపవలెను. ఆ తర్వాత రెండు చేతులని మన వీపు వెనుక భాగంలోకి చేర్చి నడుముకి రెండు వైపులా రెండు చేతుల్ని ఆనించి నెమ్మదిగా నడుముని పైకి లేపవలెను. నడుము మరియు కాళ్ళ బరువు మెడ మీద పడేంత వరకూ కాళ్ళని నిటారుగా చాపాలి. రెండు కాళ్ళని 90 డిగ్రీల కోణంలో ఉండేలా చూసుకుంటే మంచి ఫలితాలు ఉంటాయి. శరీరము యొక్క బరువుని రెండు మోచేతుల మీద పడేలా చూసుకోవాలి. ఈ భంగిమలో ఎంత సేపు ఉండగలుగుతారో అంత సేపు ఉండండి. ఎంత ఎక్కువ సమయం ఈ భంగిమలో ఉంటే అన్ని మంచి ఉపయోగాలు ఉంటాయి. ఆ తర్వాత కాళ్ళని కిందికి నెమ్మదిగా మోకాళ్ళ వరకు మంచి ఛాతీకి ఆనించి కాళ్ళని నేల మీద నెమ్మదిగా ఉంచవలెను. తర్వాత కొన్ని నిమిషాల పాటు శరీరాన్ని శవాసనం భంగిమలో ఉంచాలి. ప్రతి ఆసనానికి మధ్యలో కొద్దిసేపు కంపల్సరి శవాసనం వెయ్యాలి. ఈ సర్వాంగాసనాన్ని అన్ని వయసుల వారు వెయ్యవచ్చు.

ఈ ఆసనాన్ని ఎవరు వెయ్యకూడదు అంటే:

★సర్వైకల్ స్పాండిలైటిస్ మరియు భుజమునకు సంబంధించిన సమస్యలు మరియు అధిక బరువు ఉన్నవాళ్ళు ఈ ఆసనాన్ని వెయ్యకూడదు.

★అధిక రక్తపోటు మరియు గుండెకు సంబంధించిన సమస్యలు ఉన్న వాళ్ళు సర్వాంగాసనము వెయ్యకూడదు. పై సమస్యలు ఉన్నా కూడా మీరు నిపుణుల పర్యవేక్షణలో సర్వాంగాసనం వెయ్యవచ్చు.

సర్వాంగాసనం యొక్క ఉపయోగాలు/ప్రయోజనాలు:

★బాగా హైట్ ఎదగాలనుకునే పిల్లలకి ఈ ఆసనం ఒక వరం అని చెప్పవచ్చు. కావున మీ పిల్లల చేత ప్రతిరోజు ఈ ఆసనం వేయించండి.

★కాళ్ళని బాగా పైకి లేపి ఉంచి ఆసనం వేయడం వల్ల పాదాలు మరియు కాళ్ళలోని రక్తం గొంతులో ఉన్నటువంటి థైరాయిడ్ మరియు గుండెకు చేరుతుంది. ఇలా రక్తప్రసరణ బాగా జరగడం వల్ల హార్మోన్ల ఉత్పత్తి సక్రమంగా జరుగుతుంది.

★థైరాయిడ్ గ్రంథికి మంచిగా రక్తప్రసరణ జరగటం వల్ల థైరాయిడ్ సమస్య నుంచి శాశ్వతంగా విముక్తి పొందవచ్చు లేదా భవిష్యత్తులో థైరాయిడ్ సమస్య రాకుండా చేసుకోవచ్చు. అనగా థైరాయిడ్ గ్రంథిని యాక్టివ్ గా ఉంచుతుంది.

★జుట్టు రాలడాన్ని అరికట్టి ఒత్తుగా పెరిగేలా చేస్తుంది.

★రక్త ప్రసరణ వ్యవస్థ పనితీరును మెరుగుపరుస్తుంది.

★సర్వాంగ ఆసనం వేయడం వల్ల రక్తము కాళ్ళ నుండి తల వరకు ప్రవహిస్తుంది. అందుకని ఈ ఆసనం వేయడం వల్ల కళ్ళకి కూడా చాలా మేలు జరుగుతుంది.

★అన్ని రకాలైనటువంటి తలనొప్పులు మరియు థైరాయిడ్ సమస్యలను నివారిస్తుంది.

★ముఖానికి కాంతిని ఇస్తుంది. ఫేస్ లో ఉన్నటువంటి ముడతలు తగ్గిస్తుంది మరియు యువతని బాగా చికాకు పెట్టే మొటిమల్ని తగ్గిస్తుంది.

(గమనిక: కొన్ని రకాలయినటువంటి హార్మోన్స్ ప్రభావం వల్ల కానీ లేదా కెమికల్ ఇన్ బ్యాలెన్స్ వల్ల కానీ మొటిమలు వచ్చే అవకాశం ఉంది. కావున ఈ ఆసనం వల్ల మొటిమలు తగ్గకపోతే డాక్టర్ని సంప్రదించటం ఉత్తమం.)

★సర్వాంగాసనము ముఖానికి మంచి ఎక్సర్సైజ్ ని ఇస్తుంది.

★జ్ఞాపకశక్తిని పెంచుతుంది.

★దాదాపుగా శీర్షాసనం వేస్తే ఎటువంటి ప్రయోజనాలు కలుగుతాయో అన్నే ప్రయోజనాలు ఈ సర్వాంగాసనం ద్వారా కూడా కలుగుతాయి.

★ఈ ఆసనం వేయడం వల్ల నాడీ వ్యవస్థకి రక్త ప్రసరణ బాగా జరిగి నాడీ వ్యవస్థ యొక్క పనితీరును మెరుగుపరుస్తుంది.

★ప్రతిరోజు ఈ ఆసనం వేయడం వల్ల భవిష్యత్తులో గుండె మరియు ఊపిరితిత్తులకు సంబంధించిన సమస్యలు రాకుండా మనల్ని మనం కాపాడుకోవచ్చు. ఊపిరితిత్తులని శుభ్రం చేయడంలో ఈ ఆసనం బాగా దోహదపడుతుంది.

★ప్రతిరోజు ఈ ఆసనం వేయడం వల్ల శరీరాన్ని మన అదుపులో ఉంచుకోవచ్చు.

★ఉదయం పూట కాలకృత్యాలు తీర్చుకున్న తర్వాత ఖాళీ కడుపుతో సర్వాంగాసనాన్ని వెయ్యాలి. సాయంత్రం పూట కూడా ఒకవేళ మీరు ఖాళీ కడుపుతో ఉంటే కనుక ఈ ఆసనాన్ని ట్రై చెయ్యొచ్చు.

★ఉదయం పూట 6 నుండి 8 గంటల మధ్యలో ప్రసరించే సూర్యకిరణాలలో డి విటమిన్ ఉంటుంది. ఆ లేత సూర్య కిరణాలు శరీరం మీద పడుతున్నప్పుడు ఈ ఆసనం వేస్తే కనుక అద్భుతమైన ఫలితాలు ఉంటాయి.

నిపుణుల సమక్షంలోనే ఈ ఆసనం చేయండి, తద్వారా ఆసన పూర్తి ప్రయోజనాలు పొందండి.

OOO

# మన ఆరోగ్యం మన చేతిలో...2వ భాగము - మన జీవన అలవాట్లు : మధు బుడమగుంట (అమెరికా)

నేను ఇప్పుడు వ్రాస్తున్న అంశాలు అన్నీ కొత్తవేమీ కాదు. మనందరికీ తెలిసినవే. అయితే నా అనుభవంలో నేను తెలుసుకొన్న, అనుభవించిన విషయాలతో కొంచెం విభిన్నంగా వ్రాస్తున్నాను.

మనిషి దేహం ధారుడ్యంగా, ఆరోగ్యంగా ఉండాలంటే మన శరీరానికి ముఖ్యంగా కావలిసినవి పిండిపదార్థాలు, మాంసకృత్తులు, ఖనిజాలు, లవణాలు. వీటిని మన జీర్ణకోశ వ్యవస్థ కరిగించి మనకు శక్తిని అందిస్తుంది. ఈ నాలుగు పోషకాలను ఏ రూపంలోనైనా, ఏ పదార్థం నుండైనా పొందవచ్చు. మనం పుట్టి పెరిగిన ప్రదేశం యొక్క భౌగోళిక, నైసర్గిక స్వరూపాల ఆధారంగా అక్కడ పండించే పంటల వల్ల లభించే పోషకాలకు అనుగుణంగా మన శరీరంలోని జీర్ణవ్యవస్థ రూపాంతరం చెందుతుంది.

ఆపిల్ ఒకటి బాగానే ఉంటుంది. మరి పది తింటే? ఉదాహరణకు ఒక బస్సులో 40 మందికి మాత్రమే సీట్లు ఉన్నాయి కానీ అందులో 60 మంది ప్రయాణిస్తే బస్సుకు ఒడిదుడుకులు ఏర్పడి ఒక్కోసారి ప్రమాదాలు కూడా జరుగుతాయి. అదే బస్సు నాలుగైదు స్టాపుల తరువాత మరల ఇంకెవరైనా ఎక్కకుంటే కొంతమంది దిగిపోతారు కనుక ప్రయాణం సాఫీగా హాయిగా సాగినట్లనిపిస్తుంది. మన శరీరం కూడా అంతే. ఒక వేళ ఎక్కువ తిన్నా (కారణాలు ఎన్నో) అందుకు తగినట్లుగా శారీరక శ్రమ చేస్తే అంతా సాఫీగా హాయిగా ఉంటుంది. అట్లాకాకుండా తినడం మాత్రమే ఉండి సరైన భౌతిక వ్యాయామం లేకుంటే శరీరంలో పేరుకుపోతున్న కొవ్వు పదార్థాలు విడుదల చేసే చక్కెర శాతం పెరుగుతుంది. తదనుగుణంగా మన కాలేయం ఇన్సులిన్ విడుదల చేసే సామర్థ్యం తగ్గి చక్కర వ్యాధి సంక్రమించడం, దానికోసం మందు బిళ్ళలను ఆశ్రయించడం.

చక్కెర వ్యాధి అనేది వంశపారంపర్యంగా వస్తుంది. అందరం ఒప్పుకుంటాం. అయితే మన ప్రయత్నంలో కొంత కీలకమైన కృషి ఉంటే దానిని నియంత్రించవచ్చు. ముఖ్యంగా రక్తనాళాల లో చక్కెర నిల్వలు స్థిరంగా ఉండకూడదు. అందుకు మన కండరాల చలనం ఎంతో అవసరం. తినంగానే సోఫాలో కూర్చొని ఉంటే అంతా అక్కడే ఉంటుంది. ముఖ్యంగా పూర్వకాల మైండ్ సెట్ ను అలాగే కొనసాగిస్తూ పురుషులు వంట పని, ఇంటి పని చేయకూడదంటే అందుకు నేను ఒప్పుకోను. కారణం, నేటి సామాజిక పరిస్థితులు అన్ని వసతులు కల్పించి మన శరీరాన్ని కష్టపెట్టకుండా చేస్తున్నాయి. కనుక పనికి వెళ్ళడానికి నడక అవసరం తప్పింది. పనిలో కూడా ఎటువంటి శారీరక శ్రమ లేకుండా యంత్రాలు మనకు సుఖాన్ని ఇస్తున్నాయి. మరి మనం నేటి విధానాలకు అనుగుణంగా మన పద్ధతులు కూడా మార్చుకోవాలిగా?

ఇంటిలో కూడా కుటుంబ సభ్యులందరూ ఇంటిపనులను పంచుకొంటే అందరికీ కలిసికట్టుగా సమయం గడిపే అవకాశం కలుగుతుంది. సమయం కూడా ఎంతో ఆదా అవుతుంది. ముఖ్యంగా పిల్లలకు, పెద్దలకూ వారి చేతిలోని ఒక చిన్న దీర్ఘ చతురస్రాకారపు యంత్ర సాధనం నుండి కొద్దిపాటి సడలింపు ఉండి కళ్ళకు, మెదడుకు మంచి విశ్రాంతి కలుగుతుంది. మందితో మన ఆలోచనలను, విధానాలను సదా పంచుకొంటూ సమయం గడిపినందున మన ఆలోచనలలోని మూస ధోరణి తగ్గిపోయి, వినూత్నమైన విధానాలకు ఆస్కారం ఏర్పడి ఎంతో ఉల్లాసంగా ఉంటుంది.

జగమంత కుటుంబం నాది ఏకాకి జీవితం నాది అని సీతారామ శాస్త్రి గారు అన్నట్లు, నేటి జీవన విధానంలో మనం అందరితో టచ్ లో ఉన్ననూ ఏకాకిగానే మన ఆలోచనల విధానాలను అమలుపరుస్తున్నాము. చంద్రయాన్ ఉపగ్రహాన్ని చంద్రుని మీద నిలిపి ఇక్కడినుండి కంట్రోల్ చేస్తున్నాం. కానీ సొంత ఇంటిలో ఉన్న మనుషుల మధ్యన ఏర్పడుతున్న బ్లాక్ (బ్లాంక్) హోల్స్ ని మాత్రం పూడ్చేందుకు ప్రయత్నించడం మరిచాము.

...సశేషం

OOO

# ఆధ్యాత్మికం 19 వ భాగము : "మాయా మంత్రం - గురు మంత్రం" : సేకరణ - ఆర్ వీ ఎస్ 1985 బ్యాచ్ గుంపు

జీవితంలో సంబంధాల దారాలను పోషించేది మన బాహ్య సౌందర్యమా, లేక మన అంతర్గత స్వభావమూ, ప్రవర్తనా?

**మాయా మంత్రం**

ఒక సమావేశంలో, దాదాపు 30 సంవత్సరాల వయస్సు గల ఒక యువకుడు ఇలా అడిగాడు, "గురువుగారు, జీవితంలో అత్యంత ముఖ్యమైన విషయం ఏమిటి?"

గురువుగారు చిరునవ్వు నవ్వి, ఆ యువకుడిని ఇలా అడిగాడు, "నువ్వు నడుస్తుంటే, ఒక అందమైన అమ్మాయి మీ వైపు నడుస్తూ వస్తే, నువ్వు ఏమి చేస్తావు?"

యువకుడు ఇలా చెప్పాడు, "నా కళ్ళు ఆమె వైపుకు మళ్ళుతాయి, నేను ఆమెను చూడటం ప్రారంభిస్తాను."

"ఆ అమ్మాయి నిన్ను దాటుకుని ముందుకు వెళ్ళిపోతే నువ్వు కూడా అలాగే వెనక్కి తిరిగి చూస్తావా?" అని అడిగాడు గురువుగారు.

ఆ వ్యక్తి, "ఆ చూస్తాను, నా భార్య నా ప్రక్కన లేకుంటే", అన్నాడు (దీనికి అక్కడున్న వారందరూ నవ్వారు).

గురువుగారు మళ్ళీ అడిగారు, " ఆ అందమైన ముఖాన్ని నువ్వు ఎంతకాలం గుర్తుంచుకుంటావో దయచేసి చెప్పు?"

"మరో అందమైన ముఖం కనిపించే వరకు ... అంటే .. ఓ 5-10 నిముషాలు", అన్నాడు ఆ యువకుడు.

గురువుగారు ఆ యువకుడితో ఇలా అన్నారు, "ఇప్పుడు ఊహించుకో... నువ్వు ఒక ఊరు వెళ్తున్నావు, నేను నీకు పుస్తకాల సంచి ఇచ్చి, ఆ సంచి ను ఒక పెద్దమనిషికి అందించమని అడుగుతాను.

నువ్వు సంచి ని అందజేయడానికి చేయడానికి అతని ఇంటికి వెళ్తావు. ఇంటిని చూడగానే అది చాలా సంపన్నమైనదని అర్థమవుతుంది. ఇంటి బయట ఒక కాపలావాడు నిలబడి ఉన్నాడు.

మీ వద్ద ఉన్న సంచి గురించి సమాచారం లోపలకి పంపినప్పుడు, ఆ పెద్దమనిషి స్వయంగా బయటకు వచ్చి, అతను నీ వద్ద నుండి సంచి తీసుకుంటాడు. నువ్వు వెళ్ళడానికి సిద్ధమైనప్పుడు, అతను మిమ్మల్ని తన ఇంటి లోపలికి రమ్మని కోరతాడు. మిమ్మల్ని తనతో కూర్చోబెట్టుకుని, వేడిగా భోజనం పెడతాడు.

నువ్వు బయలుదేరడానికి సిద్ధమైనప్పుడు, అతను మిమ్మల్ని "ఎలా వచ్చావు?" అని అడుగుతాడు.

నువ్వేమో," నడుచుకుంటూ" అని చెప్తావు.

ఊరిలో మీరు వెళ్ళవలసిన చోటువద్ద మిమ్మల్ని దించిరమ్మని తన గుర్రపు బండి వాడితో చెప్పి, జాగ్రత్తగా చేర్చమని ఆదేశిస్తాడు.

ఇప్పుడు చెప్పు, నువ్వు ఆ మహానుభావుడిని ఎంతకాలం గుర్తుంచుకుంటావు?"

ఆ యువకుడు, "గురువుగారు! ఎదో పుస్తకాల సంచి అందివ్వడానికి వెళ్లిన నాకు అంత అద్భుతమైన అనుభవాన్ని అందించిన అలాంటి వ్యక్తిని నా జీవితపు చివరి రోజు వరకు మరచిపోలేను. నా జీవితాంతం గుర్తుంచుకుంటాను!"


ఆ యువకుడి ద్వారా సభను ఉద్దేశించి గురువుగారు మాట్లాడుతూ.. "ఇది జీవితపు వాస్తవికత. అందమైన ముఖం కొద్దిసేపటి వరకే గుర్తుంటుంది, కానీ అందమైన ప్రవర్తన జీవితాంతం గుర్తుండిపోతుంది, అందమైన ప్రవర్తనే జీవితంలో అత్యంత ముఖ్యమైన విషయం" అని అన్నాడు.

అదే **గురు మంత్రం...జీవితానికి మాయా మంత్రం**... మీ ముఖం, శరీరపు అందం కంటే మీ ప్రవర్తనా సౌందర్యం మీద ఎక్కువ దృష్టి పెట్టండి... జీవితం మీకు ఆనందదాయకంగా, ఇతరులకు మరపురాని స్ఫూర్తిగా మారుతుంది... సంస్కృతంలో గు అనగా చీకటి/అంధకారం మరియు రు అనగా వెలుతురు/ప్రకాశం అని అర్థం. అనగా గురువు అజ్ఞానం అనే అంధకారాన్ని తొలగించి బ్రహ్మవిద్య అనే ప్రకాశాన్ని అందించేవాడు. మరి ఈ కథలో "గురువు" ఆ యువకుడి సందేహము తీర్చి కొంత జ్ఞాన బోధ చేశాడా, లేదా? మీరే చెప్పండి.

ooo

# టాగ్స్ కార్యక్రమాల సమాచారం నమోదు కొరకు.

2022-2023 వ సంవత్సరానికి టాగ్స్ చేపట్టబోయే సాంస్కృతిక కార్యక్రమాలకు సంబంధించి మరిన్ని వివరాలను తెలుసుకోవాలనుకునేవారు http://www.sactelugu.org లేదా https://www.facebook.com/SacTelugu ను సందర్శించాలని లేదా sactags@gmail.com కు ఈమెయిలు లో సంప్రదించాలని TAGS కార్యనిర్వాహక సభ్యులు కోరారు. టాగ్స్ చేపట్టబోయే కార్యక్రమాలకు సంబంధించి మరిన్ని వివరాలు మీ ఈమెయిలు కు అందాలంటే ఈరోజే టాగ్స్ న్యూస్ లెటర్ కు మీపేరు ఈ లంకె ద్వారా నమోదు చేసుకోవలసినదిగా మనవి: https://tinyurl.com/jointags



# బాల కదంబం : జ్ఞానానందమయం - 8వ భాగం "బలవంతుడు " : శ్రీ శేష కల్యాణి గుండమరాజు (అమెరికా)

ఒకరోజు ప్రసూనాంబ పూజా-భోజనాలూ ముగించుకుని, ఆరుబయట కూర్చుని, కృష్ణానంద చేత లెక్కలు చేయిస్తోంది. అప్పుడు ఆ ఊరి వస్తాదు వీరన్న తన తండ్రి సూరయ్యతో వచ్చాడు.

సూరయ్య ప్రసూనాంబకు వినయంగా నమస్కారం చేసి, "ప్రతి ఏడూ మనూళ్ళో కుస్తీ పోటీలు జరుగుతూ ఉంటాయి కదమ్మా? ఈ ఏటి పోటీలు వచ్చే వరం జరగబోతున్నాయి. మా వీరన్న మనూరి మల్లయ్యగాడితో పోటీ పడుతున్నాడు. వీరన్న ఆ పోటీలో గెలిచేటట్టు వాడిని ఆశీర్వదించండమ్మా!", అన్నాడు.

ప్రసూనాంబ నవ్వి, "ఏం వీరన్నా? ప్రతిరోజూ సాధన చేస్తున్నావా?", అని అడిగింది వీరన్నను.

వీరన్న సిగ్గుపడిపోతూ తల దించుకుని, "ఊఁ!", అన్నాడు.

"సరే వీరన్నా! విజయోస్తు!", అని వీరన్నను దీవించి పంపింది ప్రసూనాంబ.

మరికాసేపట్లో ప్రసూనాంబ దగ్గరకు మల్లయ్య వచ్చాడు.

"ఏమిటి మల్లయ్యా విషయం? వచ్చే వారం పోటీలో పాల్గొంటున్నావటగా? సాధన చేస్తున్నావా?", అడిగింది ప్రసూనాంబ.

"ఓ! చేస్తున్నానమ్మా! మీ దీవెనలు కావాలి", అన్నాడు మల్లయ్య.

"నీ ప్రయత్నం గట్టిగా చెయ్యి మల్లయ్యా. ఆపై ఆ భగవంతుడు చూసుకుంటాడు! గెలుపు నీదే!", అంది ప్రసూనాంబ.

"అమ్మా! మీ దీవెనలు ఫలించాలి. మీరు ఈ పోటీ చూడటానికి తప్పకుండా రావాలమ్మా!", అన్నాడు మల్లయ్య.

"అలాగే వస్తానులే! మరి గెలిస్తే నాకు మిఠాయి ఇవ్వాలి!", చెప్పింది ప్రసూనాంబ నవ్వుతూ.

"అలాగే. పట్టుకొస్తానమ్మా! బాబుకి జీడిపప్పు పాకం ఇష్టం కదా? అది పట్టుకొస్తా!", అని చెప్పి వెళ్ళిపోయాడు మల్లయ్య.

జరిగినదంతా అక్కడే ఉండి గమనించిన కృష్ణానంద ప్రసూనాంబాతో, "బామ్మా! జీడిపప్పు పాకం తీసుకురమ్మని వీరన్నకు చెప్పలేదేం?", అని అడిగాడు.

అందుకు ప్రసూనాంబ,"చూస్తూ ఉండరా! మల్లయ్యే పోటీలో గెలుస్తాడు!", అంది చిరునవ్వుతో.

"ఏం కాదు! ఖచ్చితంగా వీరన్నే గెలుస్తాడు! ఎందుకంటే మల్లయ్య వీరన్న కంటే సన్నగా ఉన్నాడు. వీరన్న కండలు చూశావా? ఎంత పెద్దవిగా ఉన్నాయో!", ఆశ్చర్యంతో కళ్ళు పెద్దవి చేసి మరీ అన్నాడు కృష్ణానంద.

"చూద్దాంలేరా ఆనందూ! ఒకవేళ వీరన్న గెలిస్తే నేను నీకు జీడిపప్పు పాకం కొనిపెడతా. సరేనా?", అంది ప్రసూనాంబ కృష్ణానంద బుగ్గలను నిమురుతూ.

కుస్తీపోటీరోజు రానే వచ్చింది. కృష్ణానంద ప్రసూనాంబతో కలిసి పోటీని చూడటానికి వెళ్ళాడు. పోటీలో మల్లయ్య పెద్దగా కష్టపడకుండా వీరన్న పై గెలుపు సాధించాడు! పోటీ ముగిశాక ప్రసూనాంబకు నమస్కరించి జీడిపప్పు పాకం ఉన్న మిఠాయి పొట్లం కృష్ణానంద చేతిలో పెట్టాడు మల్లయ్య. కృష్ణానంద, ప్రసూనాంబలు ఇంటికి చేరుకున్నారు.

"బామ్మా! నువ్వన్నట్లు ఇవాళ్టి పోటీలో మల్లయ్యే గెలిచాడు. సన్నగా ఉన్నా మల్లయ్యే గెలుస్తాడని నువ్వు ముందే ఎలా చెప్పగలిగావూ?", ప్రసూనాంబని ఆశ్చర్యంగా అడిగాడు కృష్ణానంద.

ప్రసూనాంబ చిన్నగా నవ్వి, "చూడు కృష్ణా! వీరన్నకి పెద్ద పెద్ద కండలున్నాయి. అందులో సందేహం లేదు. మల్లయ్య వీరన్న కన్నా సన్నగా ఉన్నాడు. అదీ నిజమే! వాళ్ళు నా ఆశీర్వాదం కోసం ఇక్కడకు వచ్చినప్పుడు వాళ్ళ ప్రవర్తనలో చిన్న తేడా ఉంది. నేను అది గమనించాను. అందుకే ఈ పోటీలో మల్లయ్య గెలుస్తాడని చెప్పాను", అంది.

అర్థంకానట్లు చూశాడు కృష్ణానంద.

"సరే! మరి కాస్త వివరిస్తా విను! వీరన్న నా దగ్గర నిలబడినప్పుడు మొహమాటంగా వాళ్ళ నాన్న వెనుక దాక్కోవడానికి ప్రయత్నించాడు. నేను అతడిని అడిగిన ప్రశ్నకు సమాధానం కూడా సరిగ్గా ఇవ్వలేకపోయాడు. అతడి మోహంలో నాకు ఈ పోటీలో నెగ్గనేమోనన్న సంశయమూ, కొద్దిగా భయమూ కనపడ్డాయి. ఆ తర్వాత వచ్చిన మల్లయ్యలో నాకు ఆత్మవిశ్వాసం కొట్టొచ్చినట్లు కనపడింది. మల్లయ్యకు పోటీలో తనదే గెలుపన్న నమ్మకముంది. అందుకుతగ్గ ప్రయత్నం కూడా చేశాడు. వీరన్నకు కండ బలమే తప్ప గుండె ధైర్యం లేదు. మల్లయ్యకు ధైర్యం మెండుగా ఉంది. గుండె ధైర్యం కలవాడే నిజమైన బలవంతుడు. అందుకే పోటీలో మల్లయ్య సులువుగా గెలిచాడు!", అంది ప్రసూనాంబ.





"ఓహో! మల్లయ్య గెలుస్తాడని నువ్వు ఎందుకన్నావో నాకు ఇప్పుడర్థమైంది బామ్మా! ఏదేమైనా నాకు తియ్యటి మిఠాయి దొరికింది!", అన్నాడు కృష్ణానంద జీడిపప్పు పాకం ముక్కను కొరుకుతూ.

★★★★★

# కవితా కదంబం : తెలుగుతో అనుబంధం - పేగు బంధం : శ్రీతేజ కలం - రచయిత: శశికాంత్ మెంచు

కన్నీటి కడలిలో అలలవలె దరి చేరే ధైర్యం తెలుగు

మత్తులో అరుణోదయ వేళలో తట్టి లేపే వెలుగు తెలుగు !!

భ్రమరమును రమ్మని పిలిచే కమలం తెలుగు

కలిసికట్టుగా తేనెటీగలు కూడబెట్టిన తేనెపట్టు మాధుర్యం తెలుగు

పారే నదిలో నిలకడగా మేటలు వేసే ఇసుక తిమ్మెరలు మన తెలుగు !!!

అమ్మ పాలను డబ్బా పాలతో సరిపెట్టుకుంటున్నట్లు

ముంగిళ్ళలో ముగ్గులకు బదులు రంగులు దిద్దుకుంటున్నట్లు

ఇంటి భోజనం మానేసి హోటల్ భోజనమునకు రుచిమరిగినట్లు

చెయ్యితో తినడం మానేసి చెంచాలకోసం వెతుకులాట మొదలెట్టినట్లు !!!

రాయడం లేక తుప్పు పడుతున్న తెలుగుకు వన్నె పెడదామా

ఆంగ్లము చెరబట్టిన తెలుగుకు భాష రక్షణ కల్పించుకుందామా

సంప్రదాయములతో నిండిన తెలుగు విలువ పెంచుకుందామా

వందల ఏళ్ళుగా సంస్కృతిని మోస్తున్న తెలుగుకు ఊతం అవుదామా

ఒంటరిదై కనుమరుగవుతున్నమన వెన్నెల తెలుగును కాపాడుకుందామా !!!

ప్రకృతిని కాపాడుకోవడమెంత అవసరమో

ఈ జీవన నావ దరి చేరడానికి స్నేహమెంత అవసరమో

దప్పిక తీర్చే మంచినీటిని ఒడిసిపట్టుకోవడమెంత అవసరమో

మలివయసులో తల్లిదండ్రులను చూసుకోవడమెంత అవసరమో

ముసి ముసి నవ్వుల తెలుగును కంటిపాపలా రక్షించుకోవడం అవసరమే !!!

మూగ బోతున్న తెలుగుకు కొత్త స్వరములు కూర్చుదామా

చెవులను తాకడం మరచిన తెలుగుకు సరి దిద్దులను తొడుగుదామా

కంఠము దాటి బయటకు రాలేకపోతున్న తెలుగుకు రహదారి చూపుదామా

తప్పటడుగులలో దారి మళ్ళుతున్న తెలుగు పదాలను దారిలోకి తీసుకొద్దామా !!!

తెలుగుతో బంధం అమ్మతో అనుబంధం వంటిది

మన అమ్మ తెలుగుతో ఆ బంధమును మరువలేనిది

నేటి ఈ తెలివితేటలకు మూలమైన ఆ తెలుగు రుణం తీర్చుకోలేనిది !!!

OOO

# చిత్ర కదంబం

1. కాలిఫోర్నియా నుండి శ్రీ శేష కల్యాణి గుండమరాజు గారు పంపిన “సూర్యుడు కాదు చంద్రుడు”



# పత్రికా ప్రకటన - 8వ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సు - వంగూరి చిట్టెం రాజు

"8వ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సు" తొలి రెండు రోజుల వేదికలలో పాలుపంచుకుని విజయవంతం చేసిన అతిథులకు, వేదిక & సాంకేతిక నిర్వాహకులకు, చక్కటి ప్రసంగాలను అందించిన వక్తలకు, 8వ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సు నిర్వాహకబృందం తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు...

పాత్రికేయ మిత్రులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు!

**Press coverage**

Eenadu:

https://www.eenadu.net/telugu-news/nri/eeee/1101/122181188

Sakshi:

https://m.sakshi.com/telugu-news/nri/8th-world-telugu-literature-conference-concluded-successfully-1488093

Andhrajyothi:

https://m.andhrajyothy.com/telugunews/first-two-days-of-telugu-sahiti-sadassu-comes-to-a-conclusion-pcs-spl-mrgs-nri-1822092207225328

Namastey Telengana:

https://www.ntnews.com/nri/the-world-telugu-literature-conference-was-held-grandly-772498

Eekshanam:

https://m.facebook.com/story.php?story_fbid=pfbid02adHuvKgCW4Q4V1CMEjW4FTXukUtpDrS2iHLCq8kUiAE4DH7khutdXsZyTkC17yUzl&id=100063871301368

★ Prapamcha Telugu:★

https://prapanchatelugu.com/world-telugu-sahiti-sadassu-at-acland/

# 8వ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సు ప్రసంగం - విజయ గొల్లపూడి, సిడ్నీ, ఆస్ట్రేలియా

(సెప్టెంబర్ 17-18, 2022 న న్యూజీలాండ్ లో ప్రత్యక్షంగా...ప్రపంచం అంతటా అంతర్జాలంలో జరిగిన 8వ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సు 18 సాహిత్య వేదికల సమగ్ర కార్యక్రమం తో కూడి ఉంది. ఇందులో ప్రారంభ వేదికలో ఆహ్వాన అతిథి గా సిడ్నీ, ఆస్ట్రేలియా నుండి విచ్చేసిన శ్రీమతి విజయ గొల్లపూడి, సదస్సు అతిధులను, వీక్షకులను ఉద్దేశించి చేసిన ప్రసంగ పాఠం)




వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా
నిర్వాహక సంస్థలు



భాష అనేది భావాల వ్యక్తీకరణకు అత్యవసరమైన వారధి. ఎవరికైనా వారి మాతృభాష అమృతం. అమ్మ భావన, గుండె చప్పుడు వినాలి అంటే,తెలుగుదనపు తీపి,కమ్మదనం, తెలుగుభాష మధురిమలు రుచి చూడాలంటే నిరంతరం ప్రతిఒక్కరు భాషతో అనుబంధం కలిగి ఉండాలి. ఆ అనుబంధమే నన్ను ఇంతదూరం తీసుకువచ్చింది.

ముఖ్యంగా పాశ్చాత్య దేశాలలో ఉంటున్నపుడు ఒక రకమైన యాంత్రికమైన ఉచ్చులో నలిగిపోతున్నపుడు, అక్కున చేర్చుకునేది ఈ అమ్మ భాష. పిల్లగాలి తెమ్మెఱలా, తొలి జల్లు పుడమిపై పడినపుడు నాసికారంధ్రాలను తాకే మట్టివాసనలా, తెలుగు సాహితీ పవనాలు వీవెనలా వీస్తూ ఉంటే అలసిన బాటసారికి సేద తీరుస్తూ మరో కొత్తలోకంలో విహరింపచేస్తుంది అదే ఈ రోజు ఈ ఎనిమిదవ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సు.

నేను ఆస్ట్రేలియా వచ్చిన కొత్తలో  మన తెలుగు వారు కనిపించినా, వినిపించినా ఆత్రేయపురపు పూతరేకు తిన్నంత ఆనందం కలిగేది. స్థానికంగా వెలువడే పత్రికలో కథలు, రేడియో కార్యక్రమాలు చేస్తున్నపుడు ఈ మధ్యమాలు తెలుగు భాషపై మరింత ఆసక్తిని రేపాయి. మనసులో ఉన్న కోరిక కాగితం పై పెట్టినపుడు –మన తెలుగు ను ఎన్ని రకాలుగా దశదిశలా వ్యాప్తి చేయవచ్చు అనుకుంటూ తెలుగు ప్రవాహం అని రాసి తెలుగుపీపుల్.కమ్ అనే వెబ్ సైట్ లో పెడుతూ అది ఒక కల గా అనుకున్నాను అది ఈ రోజు నెరవేరింది. ఆ కల ఏమంటే మన పండుగలు ప్రతి ఏటా చేసుకుంటున్నట్లుగానే మన తెలుగు భాష కోసం ఒక రోజును పూర్తిగా కేటాయించి మన తెలుగు సాహిత్యంలో సేవలందించిన మహామహులను గుర్తు చేసుకుంటూ, ప్రసంగాలు, అవధాన ప్రక్రియలతో తెలుగు ప్రవాహంలో మునకలు వేయాలి, ఆనందంతో ఉబ్బి, తబ్బిబ్బవ్వాలని. ఆ కోరిక ఇలా నెరవేరటం వెనుకు శ్రీ వంగూరి చిట్టెన్ రాజు గారు నాటిన సాహితీ వనం ఎలా ఉందంటే
ఎంత చక్కనిదోయి ఈ తెలుగు తోట
ఎంత పరిమళమోయి ఈ తోట పూలు

నేను సాహితీసదస్సులో ఎంచుకున్న అంశం  "ముగింపు"
అవునండీ అక్షరాల ముగింపు కథ మొత్తం చదవగానే చివరికి పాఠకునికి ఒక అనుభూతిని కలుగచేస్తుంది. ముగింపు కథకు ప్రాణం, అంటే రచయిత కథలో పాత్రలకు ప్రాణ ప్రతిష్ట చేసి, కథనం నడిపించిన తీరు చివరగా ఎలా ముగించ గలిగాడు, ముగింపు కోసమే పాఠకుడు ఆతృతగా పేజీలు తిప్పుతూ, చివరగా ముగింపు పేలవంగా ఉంటే పాఠకుడి మదిలో కూడా కథ అక్కడితో ముగుస్తుంది. అనుకోని రీతిలో కథ మలుపు తిప్పి, చదువరికి ఒక సందేశాన్నిఇస్తూ కథ ముగిస్తే ఆ కథ కొన్నాళ్ళయినా పాఠకుడి మదిలో జీవించి ఉంటుంది. అందుకని ముగింపు ప్రాణం వంటింది.
ముగింపు లో రచయిత నైపుణ్యం, మేధస్సు సగటు పాఠకుని ఆకట్టుకుంటాయి. ఏ ముగింపు ఒకలా ఉండదు. కథ సుఖాంతం, దుఃఖాంతం అయింది అంటే ముగింపు పై ఆధారపడి ఉంటుంది. కొన్ని కథలు అనూహ్యమైన మలుపులు తిరిగి, కొసమెరుపుతో రచయిత ముగించినపుడు ఆశ్చర్యం, ఆనందం కలుగుతుంది. ఇంకా కొన్ని కథలైతే సస్పెన్స్, ఉత్కంఠ రేకెత్తించి చివరికి ఏమవుతుందో అని ఏకబిగిన వదిలిపెట్టకుండా చదివించే కథలు, ముగింపు చదివిన తరువాత ఒక సంతృప్తి, చిరునవ్వు పాఠకుని ముఖంలో ప్రతిబింబిస్తుంది. అది నిజంగా శ్రమపడినపుడు వచ్చే స్వేదబిందువు లాగ, ఒక కన్నీటి పొర సన్నగా కనులనుంచి

జాలువారినట్లుగా పాఠకుని మదిని తాకుతుంది. వైవిధ్యభరితమైన ముగింపు విభిన్న రచయితలు వారి కలం నుంచి సృష్టించిన కథా శిల్పాల గురించి ఉదహరించబోతున్నాను.

శ్రీమతి జలంధరా చంద్రమోహన్ గారి కథలలో ముగింపు విషయానికి వస్తే కథలో పాత్రలచేత మనిషి కర్తవ్యాన్ని గుర్తు చేస్తూ కథ ముగించే తీరు సగటు పాఠకుడిని ఆకట్టుకుంటుంది. ముఖ్యంగా ఆవిడ రాసే ప్రతి కథలో నాయిక, నాయకుడు వ్యక్తిత్వాల గొప్పతనం కథ చివర్లోగాని తెలియదు. మొదట్లో కథ చదువుతున్నపుడు మామూలు సాధారణ వ్యక్తులుగా అనుకుంటే పప్పులో కాలేసినట్లే. ముత్యాలు, పగడాల్లా వర్ణనలు, సామాజిక ఈతిబాధాలు కథలో గుప్పిస్తూ అల్లిన మహోత్సవం చదివినపుడు ఊహకందని ముగింపునివ్వడం నాకు ఆనందాన్నిచ్చింది. ఇద్దరు యువతీ యువకులు పరస్పరం ఆకర్షితులైనా నాయకుడు విభిన్నంగా ఆమె ప్రేమను ఆ క్షణంలో అంగీకరించడు. తరువాత మళ్ళీ కలుసుకున్నపుడు కూడా ప్రేమ అంటే కేవలం ఆకర్షణ కాదు. బాధ్యతలు, అవికూడా ఎలాగంటే జీవితం చరమాంకం దాకా ఆలోచించగలిగే నేర్పరితనం చూస్తే నిజంగా ముచ్చటేస్తుంది. అదెలాగంటే నాకెంతో ఇష్టమైన అమృతవర్షిణి రాగంతో అమ్మాయి పేరుతో మొదలైన కథలో ఆమె ఇష్టపడిన కృష్ణన్ నాయర్ చేత ఆమె తల్లి కి వృద్ధాప్యంలో కావలసినదేమిటో గుర్తించడం- రచయిత్రి ఎలా తెలియచెప్పారంటే ..

కృష్ణనాయర్ కి పెళ్ళైపోయిందని భావించి అయినా ఏ మాత్రం చెక్కు చెదరని అమృతవర్షిణి వ్యక్తిత్వం చూసి అలా బాధ్యతలు అన్నీ పూర్తి చేసుకుని, అలా బాధ్యతలు అన్నీ పూర్తి చేసుకుని,అన్న మాటలు

ఇంకా పాత్రోచితంగా కథకు ముక్తాయింపు ఎలా ఇచ్చారంటే

సామాజిక స్పృహతో యువతను సరైన మార్గంలో పెట్టే ముగింపు ఇదే కదా....

కొన్ని కథలు హాస్య ప్రధానమైన కథలలో ముగింపు ఎలా ఉంటుందంటే ఉదాహరణకి ఇక్కడ నేను మా మాతృమూర్తి శ్రీమతి పెయ్యేటి శ్రీదేవి గారి కథ జాంపండు కథ తీసుకుంటున్నాను. ఈ కథ మొదలవ్వటమే తమాషాగా మన తెలుగింటి పిండివంటల పేర్లతో పిల్లల పేర్లు చదివే పాఠకుడు మొదట్లో ఆ మరీ చోద్యం కాకపోతే ఇదేమిటీ ఈ పేర్లు అని బుగ్గన చెయ్యి పెట్టుకుని చదువుతున్నపుడు.... కథలోకి వెడితే

' నమస్కారం, నమస్కారం....... రండి, రండి. చపాతీగారూ! కూచోండి. చాలా సేపటినుంచి మీకోసమే ఎదురు చూస్తున్నాం. అమ్మా, రండి, కూర్చోండి.'

' ట్రైను అరగంట లేటు. ఇక్కడే మా స్నేహితుడు, ' బందరు లడ్డు ' ఇంట్లో దిగి ఫ్రెష్ అయి వచ్చాము. పాపం, మీకు చాలా ఇబ్బందైనట్లుంది.'

'అయ్యో, ఎంతమాట! ఏమేవ్, దధ్ధోజనం! పెళ్ళివారొచ్చారు. ముందర తాగడానికి కాసిని 'మంచి ప్రమోదం ' తీసుకురా.; అన్నాడు అమ్మాయి తండ్రి పాయసం.

పాయసంగారూ! నా పేరు చపాతీ. ఈవిడ మా ఆవిడ. పేరు ఆలూపరాటా. మా యింటిపేరు 'చెరుకుపానకం'. మా ఆవిడ పుట్టింటివారు 'ధనియాల వారు '. ఇదుగో, వీడు మా పెద్దబ్బాయి. వీడి పేరు పులిహోర. ఈమె మా పెద్దకోడలు. పేరు పూతరేకు. ఈవిడది ఆత్రేయపురం. ఇదుగో, వీడు మా మనవడు, పేరు శనగ్గింజ. అరుగో, వాళ్ళిద్దరూ వీడి చెల్లెళ్ళు, కవలలు. వాళ్ల పేర్లు గారె, బూరె.'

ఇదిగో, వీడే పెళ్ళికొడుకు. అమెరికాలో సాఫ్ట్ వేర్ ఇంజనీరు. పేరు రవ్వలడ్డు. రండి రండి పెసరట్టుగారూ! మీ భార్య ఉప్మా గారేరీ? ఆ....రండమ్మా, రండి.' అంటూ మధ్యవర్తి పెసరట్టు గారిని, ఆమె భార్య ఉప్మాగారిని లోనికి ఆహ్వానించాడు పాయసం గారు.

ఇలాసాగుతున్న కథకి ముగింపు ఎలా ఇచ్చారు, కాస్త వాస్తంలోకి పాఠకుడిని తీసుకువచ్చి ఎందుకు ఇలాంటి తమాషా ఆలోచన వచ్చిందో చెబుతూ హాస్యంగా ముగించగలగటం, పాఠకుడిని మెప్పించగలగటం నిజంగా ఔరా అనిపిస్తుంది.

అదే ఈ ముగింపు

అమ్మా జాంపండూ! .......... జాంపండూ! ఏమిటే టెన్త్ క్లాస్ పరీక్షలకి చదువుకోకుండా ఏం చేస్తున్నారే మీ ఫ్రెండ్సు? నువ్వు ఏమిటో అరటిపండు, జాంగ్రీ, స్వీట్లు, హాట్లు లిస్టు చెబుతున్నావేమిటి? కబుర్లు చెబితే ఎలాగర్రా వారం రోజుల్లో పరీక్షలు పెట్టుకుని?' అంటూ తలుపు తోసుకుంటూ వచ్చింది కాత్యాయిని.

అమ్మా! రేపు మా స్కూలు ఏనివర్సరీకి ' తారుమారు ' అన్న నాటకం రిహార్సల్సు చేస్తున్నాంలే. ప్రోగ్రాం ప్లాను చేసేదంతా మేమే. అందులో ' తారుమారు ' అనే హాస్యనాటిక రాసాను. అంటే, ఆహారపదార్థాలు, స్వీట్సు, హాట్సు, పళ్ళ పేర్లు - ఇలా ఈ పేర్లన్నీ మనుషులకి, మనుషుల పేర్లన్నీ తినే ఆహారపదార్థాలకి పెట్టి, ' తారుమారు ' అనే నాటిక రాసానమ్మా. అది రేపు స్కూల్లో వేస్తున్నాం. చాలా గ్రాండుగా జరుగుతుందీ ఫంక్షను.

'నీమొహం! ఇదేం నాటకమే? మనుషుల పేర్లు స్వీట్లు, హాట్లకి, తినే ఆహార పదార్థాల పేర్లు మనుషులకి ... ఏమిటీ పిచ్చి ఆలోచనలు? ఎవరన్నా నవ్వుతారు. రేపు పెళ్ళయితే నీ పిల్లలకి పేర్లు జాంగ్రీ, కాజా, లడ్డు, జంతిక అనే పెట్టుకుంటావా ఏమిటి కొంపదీసి?'

అప్పటి దాకా ఎందుకు, ఇప్పుడే.....నన్నే నాడైనా పేరు పెట్టి పిలిచారా మీరందరూ? అసలు పేరు, చక్కని పేరు, నా పేరు శ్రీనిధి అని పెట్టారు. కాని అందరూ జాంపండూ, జాంపండూ అని పిలుస్తారు. వద్దమ్మా, అలా పిలవద్దు, పేరు పెట్టి పిలవమంటే ఒక్కళ్ళూ పిలవరే? నువ్వు గాని, డాడీ గాని, నానమ్మ గాని, అమ్మమ్మ గాని, ఇహ మామ్మయ్యయితే మరీను, అక్కడ ఏ వస్తువుంటే ఆ వస్తువు, చెంబు, తప్పేల, గ్లాసు దగ్గిర్నించి చింతకాయ, మెంతికాయ, చెగోడీ, జాంపండు, - ఇలా పిలుస్తాడు. ఇంటికెవరైనా వస్తే వాళ్ళూ మా ఫ్రెండ్సుందరి ముందు కూడా అలాగే పిలుస్తున్నారు. ఇహ వాళ్ళు కూడా నన్ను అలాగే పిలవడం మొదలెడతారు. నాకెంత ఏడుపొస్తుందో తెలుసా? నేనూ మనిషినే. నాకూ ఒక మనసుందని, ఆ మనసుకి బాధ కలుగుతుందని, నాకూ వ్యక్తిత్వముంటుందని ఎప్పుడన్నా ఆలోచించారా? ఇహ డాడీ అయితే మరీను. వాళ్ళ బామ్మెవరో నాకు తెలీదు, చూడ్లేదు. ఆ మహాతల్లి ఎప్పుడో పోయినా, నువు అచ్చం మా బామ్మలా వుంటావు, మా బామ్మలా వుంటావు అంటూ బామ్మా, బామ్మా అని పిలవడం....ఏమిటమ్మా ఈ పిలుపులు? 'నిన్నే పెళ్ళాడతా' సినిమాలో అంతేగా? టాబూని, ఆమెకిష్టం లేకపోయినా, వాళ్ళమ్మ, నాన్న

పండూ అనే పిలుస్తారు. ఎంత బాధ పడుతుందో తెలుసా? నా పరిస్థితీ అంతే. నీకు తెలీదు, ఇప్పుడు చెబుతున్నా. ఒకసారి నిద్రమాత్రలు మింగి సూయిసైడ్ చేసుకోబోతే మా ఫ్రెండ్, ఇదుగో, ఈ భవానీ రక్షించింది.'

'అమ్మడూ! నీకింత కోపం వస్తుంది, ఇంత బాధ పడుతున్నావని తెలీదే తల్లీ. ముద్దొచ్చి, ముద్దు పేర్లతో అలా పిలుస్తాం. కాని నువ్వంత సీరియస్సయితే ఎలా? చిన్నప్పుడు చాలా బొద్దుగా, తెల్లగా, అందంగా, ముద్దుగా వుండేదానివి. అందుకే మీ మామయ్య 'తెల్ల జాంపండులా బాగుందే కాత్యాయినీ నీ కూతురు 'అంటూ జాంపండూ అని పిలుస్తుంటే ఏమిటో తెలీకుండా మాకూ అదే అలవాటయిపోయి, అందరం అలా పిలిచేస్తున్నాం. సారీ జాంపండూ..........సారీ, సారీ శ్రీనిధీ!'

★★★★★★★★★★★★★★★★★★★★★★★★★★★★★

మర్నాడు తారుమారు నాటిక ప్రదర్శన చూసిన వాళ్ళందరికీ పగలబడి నవ్వీ, నవ్వీ, నవ్వీ, నవ్వీ, నవ్వలేక అందరికీ పొట్టలు చెక్కలయిపోయి, అందరూ డాక్టరు బుచ్చిబాబు దగ్గిరకి వెళ్ళారు.

డాక్టరు బుచ్చిబాబు అందరికీ టి.వి.లో ఏడుపుగొట్టు సీరియల్సు చూపించి పొట్టలు అతికించేసారు. అందరిదగ్గర ఐదువందల చొప్పున ఫీజు వసూలు చేసారు.

'అహహ....అహహ........జాంపండూ! సారీ, సారీ, శ్రీనిధీ! చాలా బాగుందే తారుమారు నాటకం. అబ్బ, అహహ.....ఇక నే నవ్వలేను బాబూ.' అని తల్లి.

అందరూ నాటకం వేసిన వాళ్ళందర్నీ అభినందించారు చాలా గొప్పగా చేసారంటూ.

'నాటకం చాలా బాగా వుందిరా జాంపండూ!' అని వాళ్ళ మామయ్య శ్రీనిధి వెనకాల్నించి బుజం తట్టాడు.

'అందుకే అంటాను, అచ్చం మా బామ్మ తెలివితేటలే వచ్చాయి దీనికి.' ఇవి నాన్న పలుకులు.

'హతవిధీ! జాంపండూ! నువ్విలా మానసిక హింస పడుతూ బతకాల్సిందేనా?'

కొన్నాళ్ళు పోయాక

★★★★★★★★★★★★★★★★★★★★★★★★★★★★

భర్తగారు, 'జాంపండూ! నా వాచీ ఎక్కడుందో చూసిపెట్టు.'

పాపం, జాంపండు!!!

రచయితకు సామాజిక బాధ్యత ఉన్నది. రచయితలు వారు తమ రచనల ద్వారా ఉండదు. ఏ సమస్యకు ఆత్మహత్య కాని, పలాయనవాదం కాని పరిష్కారం కాదు. రచయిత సమాజానికి ఎదురవుతున్న సమస్యలను అతి గంభీరంగానే చూపిస్తూనే తన మేధస్సును ఉపయోగించి, ఆ సమస్యకు సముచితమైన పరిష్కారాన్ని సూచిస్తూ చక్కటి ముగింపునిస్తే అటువంటి కథ వల్ల, అటువంటి సాహిత్యం వల్ల సమాజానికి మేలు జరుగుతుంది.

మనిషికి కొన్ని అభద్రతలు ఉంటాయి. కొన్ని పరిస్థితులని అదుపులోకి తెచ్చుకోవచ్చు. కొన్ని సమస్యలకు మూలకారణం ఏమిటో గుర్తించి, వాటిని అధిగమించే ప్రయత్నం చేయవచ్చు. అయితే మనుషులను, మానవ సంబంధాలను విచ్ఛిన్నం చేసే చావు అంటే భయం కలుగుతుంది. ఒక కథ చదివినా, లేదా ఒక సినిమా చూసినా చివర్లో పాత్ర మరణం తో ముగిస్తే అది దుఃఖాంతం అవుతుంది. పాత్రపై సానుభూతి పెరుగుతుంది. లోకంలో మందులకు, శస్త్ర చికిత్సకు లొంగని మహమ్మారి వ్యాధులు ఎన్నో ఉన్నాయి. అటువంటి రోగంబారిన ఆ మనిషి పడితే ఆమె పరిస్థితి, కుటుంబం పరిస్థితి ఏమిటి అన్న నేపథ్యాన్ని మనోనిబ్బరం కథగా నేను రాసిన ఈ కథ. ముగింపు ఇందులో కథలో తనలోని శక్తి, యుక్తులన్నీ కూడగట్టుకుని, మనోనిబ్బరంతో ధైర్యంగా ఎదుర్కొని వచ్చిన సమస్యను పరిష్కరించుకునే ప్రయత్నం, మనస్సు నిలకడగా ఉంచుకుని, ఒక పాజిటివ్ దృక్పథంతో ముందుకు సాగిన మహిళ కరుణ, సమస్య పై అవగాహన, సామరస్యంగా పరిష్కరించుకునే విధానం పాఠకునికి స్ఫూర్తినిచ్చే ప్రయత్నంగా రాసిన కథ జాగృతి మాసపత్రిక లో ప్రచురితమై ప్రశంసలనందుకుంది.

OOO

# కథా కదంబం: అరిటాకు వెర్సస్ ముల్లు - శ్రీ పెయ్యేటి రంగారావు, నార్త్ కెరోలినా, అమెరికా

ఒక దంపతులకి ఆడపిల్ల (ఛీ, ఛీ) పుట్టింది.

తల్లి మనసులో బాధ పడింది. 'అమ్మా లలితాదేవీ! రోజూ లలితాసహస్రం చదివానే? నాకు పండంటి మగబిడ్డని ప్రసాదించమని వేడుకున్నానే? శరన్నవరాత్రులలో నాకీ ఆడబిడ్డని ప్రసాదించావా తల్లీ?

'అయ్యో భక్తురాలా! రోజూ నీ పూజలందుకున్న నేను కూడా అమ్మనే కాని అయ్యని కాదు కదమ్మా? మరి నీ పూజలందుకోడానికి నేనెల్లా పనికి వచ్చానమ్మా?' అని ఆ లలితాదేవి నవ్వుకుంది.

ఆ పాపకి నాలుగేళ్ళు వచ్చాయి. చాలా బొద్దుగా ముద్దబంతిపువ్వులా తయారయింది.

తండ్రి అంటున్నాడు, 'ఏమె మన లలితకి కొంచెం అన్నం తక్కువ పెడుతూ వుండు. ఆడపిల్ల లావుగా ఉంటే భవిష్యత్తులో చాలా సమస్యలొస్తాయి. పెళ్ళి కూడా కాదు.'

'నేనేమి చెయ్యనండీ? దాని శరీరతత్వం అలాంటిది.'

ఓ రోజు సాయంత్రం ఆ లేత అరిటాకు ఏడ్చుకుంటూ ఇంటికి వచ్చింది. 'అమ్మా! మేమందరం దాగుడుమూత లాడుకుంటున్నామమ్మా! నేను ఔటవక పోయినా ఔటయ్యానని, నేను దొంగనని అంటూ పక్కింటి ముల్లుగాడు నా బుగ్గలు గట్టిగా గిల్లేసాడమ్మా.'

తల్లి సరళ అంది, 'ఇదుగో లలితా, రేపటి నించి నువ్వు బయటికెళ్ళి ఆటలాడడం మానెయ్యి. ఇంట్లోనే కూర్చుని బుద్ధిగా చదువుకో.'

ఆ రోజు నించి లలితకు ఆటపాటలు బంద్!

లలిత పెరిగి పెద్దదయింది. ఇంటరు చదువుతోంది. ప్రతి క్లాసులోను ఫస్ట్ మార్కులు ఆమెకే. ఆమె తెలివి తేటలకు టీచర్లు కూడా అబ్బురపడే వారు.

ఒకరోజు ఆ అరిటాకు కాలేజి నుంచి ఏడ్చుకుంటూ ఇంటికి వచ్చింది.

'అమ్మా, ఇవాళ కాలేజిలో ముళ్ళకంప నా వెనకాల పడి నన్నేడిపించారమ్మా. ఒక ముల్లు నా జడ పట్టుకుని లాగాడమ్మా. నేను లెక్చరర్ ముల్లుకి కంప్లైంట్ ఇచ్చానమ్మా. వాడు కూడా మరి నువ్వు అంత అందంగా ఎందుకున్నావని కిసుక్కున నవ్వాడమ్మా. క్లాసులో ఉన్న ముళ్ళన్నీ వెకిలిగా నవ్వారమ్మా.'

తండ్రి మధుబాబు అన్నాడు, 'ఇదుగో లలితా! ఇంతవరకూ నువ్వు చదివిన చదువు చాలులే. రేపటి నించీ కాలేజీకి వెళ్ళకు.'

ఆ విధంగా లలిత చదువు ఆగిపోయింది.

లలితకి పెళ్ళి నిశ్చయమయింది. అందరూ ఆమెని తెగ పొగిడేసారు. 'అదృష్టవంతురాలివే. కాలేజి లెక్చరరు నీకు మొగుడవుతున్నాడు. ఇంకనించీ నువ్వు కార్లలోనే తిరుగుతావు.'

ఒక ఏడాది లలిత వైవాహిక జీవితం బాగానే గడిచింది. ఆమెకు పండంటి ఆడుబిడ్డ కలిగింది. భర్త సుధీర్, అత్త మామలు తిట్టిపోసారు.

అరిటాకు అన్నీ సహించింది. రోజులు గడుస్తున్నాయి.

ఒకరోజు పిడుగు పడింది. కాలేజిలో సుధీర్ ఒక విద్యార్థిని పైన అత్యాచారం చేసాడట. విద్యార్థులందరూ అతడ్ని చితకబాది పోలీసుల కప్పగించారు.

మామగారు బెయిలిప్పించి ఇంటికి తీసుకు వచ్చారు.

కాని సుధీర్ ఆ అవమానాన్ని భరించలేక పోయాడు. తన నేరం రుజువవుతుందని తెలుసు. అప్పుడు తను జీవితాంతం జైల్లోనే మగ్గిపోవాలి అని భయపడ్డాడు. ఒక రాత్రివేళ ఉరి పోసుకుని తనువు చాలించాడు.

అప్పుడు అరిటాకు తన సహజత్వాన్ని వదిలేసింది.

అత్తమామల నెదిరించింది. ప్రైవేటుగా బి.ఏ.కి కట్టి పాసయింది. కాలేజిలో చేరి ఎమ్. ఏ. పాసయింది. పి.హెచ్ డి. చేసింది. అదే కాలేజిలో లెక్చరర్‌గా చేరింది.

ఒకరోజు తోటి లెక్చరర్ అరవింద్ ఆమెతో అసభ్యంగా ప్రవర్తించాడు. కాని ఆ అరిటాకు చీలిపోలేదు. ముల్లు చెంప ఎడాపెడా అందరి ఎదురుగా వాయించేసింది. ఆ ముల్లు సిగ్గుతో విరిగిపోయింది.

ఆమె తన కూతురు శిరీష ను స్కూల్లో చేర్చింది.

ఒకరోజు ఆ లేత అరిటాకు ఏడ్చుకుంటూ ఇంటికి వచ్చింది. 'అమ్మా, స్కూల్లో మగపిల్లలు నన్ను ఏడిపిస్తున్నారమ్మా. నేనింక స్కూలుకెళ్ళనమ్మా.' అంటూ ఏడ్చేసింది.

లలిత ఆమెను దగ్గర కూర్చోపెట్టుకుని హితబోధ చేసింది. 'అమ్మా! నువ్వు సున్నితంగా అరిటాకులా ఉండవద్దు. కంచుముక్కలా దృఢంగా వుండు. నిన్ను ఏ ముల్లు ఢీకొన్నా నీకేమీ కాకూడదు. కాని ఆ ముల్లే విరిగిపోవాలి.'

శిరీషలో ఆత్మస్థైర్యం పెరిగింది. దీక్షగా చదువుకో సాగింది.

చదువు పూర్తయింది. ఆమెకు ఇస్రోలో ఉద్యోగం వచ్చింది.

అంచెలంచెలుగా ఎదిగింది. ఇస్రో డైరెక్టర్ అయింది. కుజగ్రహానికి మనిషిని పంపి చరిత్ర సృష్టించింది. ఆమెను 'భారతరత్న' వరించింది.

ఐనా లలితకు ఆమె పసిపాపాయే. రోజూ పొద్దున్నే ముందుగా తల్లి పాదాలకి నమస్కరించుకుంటుంది.

ఎందుకు నమస్కరించుకోదూ మరి? లలిత ఇప్పుడు 'భారతరత్న' కు తల్లి కదా మరి!!

OOO

# సరదాగా కాసేపు – ఎదురుచూపులు - సేకరణ: RVS 1985 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థుల గుంపు

విచ్చేశారు అందరూ

బానపొట్టలూ అరగుండ్లతో

పురుష పుంగవులు.!

బారెడు జడలు మూరెడు కాగా

సోడాబుడ్డీ కళ్ళద్దాలతో

మహిళా మణులు ...!!

వాడు వీడేనా

వీడు  వాడేనా....?

ఆమె ఈమేనా ....

ఈమె ఆమేనా .... ?

గుర్తింపుల గుబాళింపు....!!

పలకరింపులూ షేక్ హాండ్ లూ

కౌగిలింతలూ పరామర్శ లూ ....

తాతలుగామారిన అలనాటి అబ్బాయి లు ....

అమ్మమ్మ లూ నానమ్మలు గ

మారిన అమ్మాయిలు ....

మరోవైపు

చెంగు చెంగున అలనాటి గెంతుల స్థానంలో ....

కాళ్ళ నొప్పులు కీళ్ళ నొప్పులతో

ఒక్కో అడుగూ జాగ్రత్త గ వేస్తూ

చేరారంతా ఒకచోటికి ....

అలనాటి అల్లర్లూ కొట్లాటలు ....

ఆటలూ పాటల సరదా సన్నివేశాలు

నెమరేస్తూ క్లాస్ రూమ్ లన్నీ

కలయ తిరుగుతూ ....

తమతమ కలల రాణుల కోసం

గుంపులో వెతుకులాడుతూ

దొంగ చూపులు చూస్తూ ....

గుర్తించలేని మార్పులెన్నో

కోల్పోయిన వ్యధ, బాధ ....

బ్రతుకు పండించుకున్న వారు కొందరైతే పోగొట్టుకున్న వారు ఇంకొందరు....!!!

అందరి మోముల్లోనూ అలసటతో కూడిన చిరునవ్వులు ....

నాటి మేటి విద్యార్థి ఏదో

సాధిస్తాడను కున్నవాడు

బడుగు జీవిలా సంసార సాగరాన్ని

ఈదుతూ అలసి పోగా ....

ఎందుకూ పనికిరాడను కున్నవాడు

గొప్పవాడై కనుల ముందు ....!!

అరేయ్ ఒరేయ్ మావ బావ నాటి పిలుపుల ఆప్యాయతల స్థానాల్లో

సార్, గారు మర్యాదల మార్పులు ....!!

కాలగర్భంలో జారిపోయి కరిగిపోయి న కొందరు నేస్తాలను తలచుకొని కొన్ని కన్నీటి జ్ఞాపకాలు ....!

ఏదైతేనేం సుఖదుఃఖాల కలబోత

జ్ఞాపకాల దొంతరల కలబోత ....!

చేరుకున్నావా? జాగ్రత్త సుమా ....

చరవాణి హెచ్చరిక ల మోత ....!

తెలియకుండానె కర్పూరం వలె కరిగి పోయిన కాలం ....!!

బాధాతప్త హృదయాలతో అడ్డుపడే కన్నీటి పొరల మసకచూపుల తడిలో

వీడ్కోలు తీసుకునే సమయం ....!!

మరలా కలిసే మరో రోజుకు అందరూ కలవాలనే తీర్మానాలతో ....!

కాలగమనంలో ఎందరో ....!!

చదువులు ముగించి వెళ్ళేవారికి వీడ్కోలు ....

వచ్చేవారికి స్వాగతాలు పలుకుతూ ....

ఏ మార్పూ లేని కాలేజీ

చిద్విలాసంగా నవ్వుకుంటూ

వెళ్ళి రండని  ఆప్యాయంగా ఆశీర్వదిస్తూ, మరో కలయిక కోసం

ఎదురుచూస్తూ ....!

ooo

# టాగ్స్ 2022 కార్యక్రమాల ఫోటోలు, వీడియోలు

టాగ్స్ 2022 కార్యక్రమాల ఫోటోలు, వీడియోల వీక్షణకు ఈ క్రింది లంకెలను ఉపయోగించండి:

https://www.facebook.com/SacTelugu/photos_stream

https://www.facebook.com/SacTelugu



# కార్యకర్తల నియామకం




కార్యకర్తలు లేని స్వచ్ఛంద సంస్థ ఊహించడం కష్టం, టాగ్స్ అందుకు మినహాయింపు కాదు. సంక్రాంతి 2020 పండుగ సంబరాల సందర్భంగా ఫాల్సం హై స్కూల్ థియేటర్ కు విచ్చేసిన 1500 కి పైగా అతిధులకు స్వాగత సత్కారాలు, బ్యాక్ స్టేజి మరియు భోజన తదితర కార్యక్రమాలను సమన్వయం చెయ్యడానికి వంద మందికి పైగా టాగ్స్ కార్యకర్తలు సేవలు అందించారు. జనవరి 2021, 2022 న వైభవంగా జరిగిన శ్రీనివాస కళ్యాణ కార్యక్రమంలో, జూలై 2022న స్థానిక ఫాల్సం నగరం - కాలిఫోర్నియా (అమెరికా) లో జరిగిన ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమంలో  అనేకమంది కార్యకర్తలు చేయి చేయి కలిపారు. పూర్తి సమయ కార్యకర్తల నియామకం ద్వారా 2022 లో తలపెట్టిన కార్యక్రమాల సన్నాహాల పని వేగాన్ని పెంచేందుకు టాగ్స్ విశేషంగా కృషి చేస్తోంది. టాగ్స్ కార్యకర్త గా బాధ్యతలు స్వీకరించడానికి ఆసక్తి ఉన్న హైస్కూల్ విద్యార్థులు, పెద్దలు sactags@gmail.com ఈమెయిల్ లో టాగ్స్ ను సంప్రదించాలని కార్యవర్గ సభ్యులు విజ్ఞప్తి చేసారు. మీరు లేదా మీ పిల్లలు టాగ్స్ కు కార్యకర్తగా (లేదా యువ కార్యకర్తగా) సహాయ సహకారాలు అందించాలంటే ఈరోజే మాకు ఈమెయిలు చెయ్యండి.




# మీ కథలు, కవితలు, మరియూ ఆర్టికల్స్ ప్రచురణకు

టాగ్స్ ప్రచురించే శాక్రమెంటో తెలుగు వెలుగు సమాచార పత్రిక – ప్రతి నెల వెలువడే పత్రిక. మీ కథలు, కవితలు, మీరు సందర్శించిన ప్రాంతాల విశేషాలు, చిత్రాలు, వ్యాసాలు, పుస్తక పరిచయం, జోక్స్, స్థానిక తెలుగు కుటుంబాలు లేదా వారి పిల్లల ప్రతిభా పాటవాల గురించి మాకు తెలియజేయాలనుకొంటే http://lekhini.org ను లేదా ఆన్‌లైన్‌లో Google ఇన్‌పుట్ సాధనంను https://www.google.com/intl/te/inputtools/try/ ఉపయోగించి తెలుగు లో, లేదా ఇంగ్లీష్ లో టైపు చేసి మాకు పంపండి. మీ ఆర్టికల్స్ పంపవలసిన ఈమెయిల్: telugusac@yahoo.com. పిల్లలు వేసిన బొమ్మలను ఫోటో తీసి మాకు పంపవచ్చు. "శాక్రమెంటో తెలుగు వెలుగు" గత పత్రికలు ఈ లంకెలో ఉంచబడ్డాయి: http://sactelugu.org/tags-patrika ధన్యవాదాలు!!!



# శాక్రమెంటో లో మన బడి తెలుగు తరగతులు - నాగ్ దొండపాటి



శాక్రమెంటో పరిసరప్రాంతాలలో ఉన్న మనబడి సెంటర్లకు తోడు శాక్రమెంతో శివారు నగరమైన నటోమాస్ లో మరో మనబడి సెంటర్ నెలకొల్పాలని మనబడి కార్యవర్గం వారు కృషి చేస్తున్నారు. మనందరం తలో చెయ్యి వేసి వారికి సాయపడదామా?



2022-2023 వ విద్య సంవత్సరానికి శాక్రమెంటో పరిసర నగరాల లో మనబడి బాలబడి, ప్రవేశం, ప్రసూనాం, ప్రకాశం, ప్రమోదం, ప్రభాసం తరగతుల్లో పిల్లలను చేర్పించదలచుకున్నవారు మరింత సమాచారం కోసం టాగ్స్ సమన్వయకర్త నాగ్ దొండపాటిని ఇ-మెయిలు telugusac.manabadi@gmail.com లో సంప్రదించగలరు.

సిలికానాంధ్ర మనబడి
భాషాసేవయే భావితరాల సేవ




సిలికానాంధ్ర మనబడి తెలుగును తరగతులలోనే కాకుండా పిల్లలకు తెలుగు మరింత దగ్గరయ్యేందుకు, బాలానందం రేడియో, "తెలుగు మాట్లాట" ఆటల పోటీలు, పిల్లల పండుగ, నాటకోత్సవాలు, ఇలా ఎన్నో కార్యక్రమాలు చేబడుతోంది. శాక్రమెంటో లో సెప్టెంబర్ 8, 2022 నుంచి ప్రారంభమయ్యే 2022-2023 విద్యాసంవత్సరంలో పిల్లలను http://manabadi.siliconandhra.org/ ద్వారా నమోదు ప్రక్రియ ప్రారంభం అయింది. కొద్దిగా ఆలస్యంగానైనా నమోదు చేయాలనుకునే వారు నిర్వాహకులను నేరుగా సంప్రదించవచ్చు. సిలికానాంధ్ర మనబడి ఒక దశాబ్ది పైచిలుకు ప్రయాణంలో తెలుగును ప్రాచీన భాష నుంచి ప్రపంచ భాష చెయ్యడంలో తనవంతు కృషి చేస్తోంది. ఈ సందర్భంగా భాషాసేవయే భావితరాల సేవ అన్న నినాదంతో శాక్రమెంటో లో ఉన్న తెలుగు వారినందరినీ చెయ్యి కలపమని టాగ్స్ అహ్వానిస్తోంది.

OOO

# మనసు పాట "మనసు ఒక మందారం... చెలిమి తన మకరందం.." - సంకలనం:ఉమా




పల్లవి :

ఉ..హు..ఆ.. ఆ.. ఆ..

లా..లాలాలా..

మనసు ఒక మందారం.. చెలిమి తన మకరందం

ఆ మధురిమకు పులకించే.. బ్రతుకు ఒక మధుమాసం

మనసు ఒక మందారం.. చెలిమి తన మకరందం

చరణం: 1

ఈ తోటలో.. ఏ తేటిదో

తొలిపాటగా వినిపించెను .. ఎద కదిలించెను

ఆ పాటనే నీ కోసమే

నే పాడినా వినిపించునా నేస్తమా?

వికసింతువా వసంతమా?

మనసు ఒక మందారం... చెలిమి తన మకరందం

ఆ మధురిమకు పులకించే.. బ్రతుకు ఒక మధుమాసం

చరణం: 2

ఈ చీకటి.. నా లోకము

నీ రాకతో మారాలిరా .. కథ మారాలిరా

ఆ మార్పులో.. నా తూర్పువై

ఈ మాపు నే వెలిగింతువా నేస్తమా?

వికసింతువా వసంతమా?

మనసు ఒక మందారం.. చెలిమి తన మకరందం

ఆ మధురిమకు పులకించే.. బ్రతుకు ఒక మధుమాసం

**ఆహా..హా.. ఆ... ఆ...ఉమ్మ్..ఉమ్మ్**

ఈ పాట ప్రేమ తరంగాలు (1980) సినిమాలోనిది. ఈ సినిమాలో ఇద్దరు హీరోలు: కృష్ణంరాజు, చిరంజీవి. ప్రేమ తరంగాలు చిత్రం కోసం బాలు గానం చేసి, కృష్ణంరాజు తన నటనతో ప్రాణం పోసిన ఈ మధుర గీతాన్ని ఈ రోజు తలచుకుందాం. దురదృష్టవశాత్తు కృష్ణంరాజు, బాలు వీరు ఇద్దరూ మామధ్య ఈరోజు లేరు. పాట స్వరకర్త చక్రవర్తి. సాహిత్యం ఎవరో చెప్పుకోండి చూద్దాం? "మనసు" ను హత్తుకొనే కమ్మని సాహిత్యం ఈ స్థాయిలో రాయగలిగినవారు ఆరోజుల్లో ఒకరున్నారు, వారెవరో కాదు "మనసు కవి ఆచార్య ఆత్రేయ". ఈ పాట ను పూర్తిగా సుశీల కూడా పాడారు, ఇదే సినిమాలో మరో సందర్భంలో వస్తుంది.

మనం ఎన్నోపాటలు నిత్యజీవితంలో వింటుంటాం. కొన్ని మనల్ని ఆవేశావంతులని చేస్తాయి, కొన్ని మనల్ని ప్రశ్నిస్తాయి, కొన్ని మన బాధ్యతలను గుర్తు చేస్తాయి, కొన్ని ఉల్లాసాన్ని కలిగిస్తాయి, మరి కొన్ని మనసును తడి చేస్తాయి. ఈ పాట ను మనసు పెట్టి వింటే మనసు తడి కావడం ఖాయం. స్వరకర్త చక్రవర్తి చక్కని ట్యూన్ కు "మనసు కవి" స్పందించి, మనసుపెట్టి రాసిన పాట మన గుండె తడి చేయకుండా ఉంటుందా? చెప్పండి!

"మనసు" - మనసు భాష అర్ధంకానివాళ్ళకో ప్రశ్నార్థకం, అర్థమైన వాళ్ళకో మధురమైన అనుబంధం. ఆచార్య ఆత్రేయగా సినీరంగ ప్రవేశం చేసిన కిళాంబి వెంకట నరసింహాచార్యులు (మే 7, 1921 – సెప్టెంబర్ 13, 1989) తెలుగులో నాటక, సినిమా పాటల, మాటల రచయిత, నిర్మాత, దర్శకులు. దాదాపు 400 సినిమాలకు మాటలు, పాటలు రాసిన కవి. మనసుకవిగా సినిమా వారు పిలుచుకునే ఆత్రేయ నాటకాల్లో చక్కని ప్రయోగాలు చేసి నాటక రంగాన్ని మలుపుతిప్పారు. వీరి పాటలలో ఎక్కువగా మనసుకు సంబంధించిన ప్రస్తావన ఉండటం వలన అతను "మనసు కవి", మన "సుకవి" అయ్యాడు. తెలుగు భాష తో గమ్మత్తులు చేయవచ్చు అనడానికి ఇది ఒక ఉదాహరణ. చిన్న చిన్న పదాలతో స్పష్టమైన భావాన్ని పలికించడంలో ఆత్రేయ ఘనాపాటి. రచనలు చేయడానికి చాలా సమయం తీసుకునేవాడు ఆత్రేయ. నిర్మాతలను తిప్పుకునేవాడు. రాయక నిర్మాతలనూ, రాసి ప్రేక్షకులనూ ఏడిపిస్తాడని ఆయనపై ఓ ఛలోక్తి.

కృష్ణంరాజు గురించి చెప్పుకుందాం. కృష్ణంరాజు అసలు పేరు - ఉప్పలపాటి వెంకట కృష్ణంరాజు తెలుగు సినిమా కథానాయకుడు, రాజకీయ నాయకుడు. ఈయన జనవరి 20, 1940న జన్మించాడు. 1970, 1980లలో 183 తెలుగు సినిమాలలో నటించాడు. ఆ తరువాత రాజకీయాలలో ప్రవేశించాడు. భారతీయ జనతా పార్టీ తరపున 12 వ లోక్‌సభ ఎన్నికలలో కాకినాడ లోకసభ నియోజకవర్గం నుంచి గెలుపొందినాడు. ఆ తరువాత 13 వ లోక్‌సభకు కూడా నరసాపురం లోకసభ నియోజకవర్గం నుంచి ఎన్నికై అటల్ బిహారీ వాజపేయి మంత్రివర్గంలో స్థానం సంపాదించాడు. 2022 లో విడుదల అయినా రాధేశ్యామ్ సినిమాలో చివరిసారిగా నటించారు. 83 ఏళ్ల కృష్ణంరాజు హైదరాబాదులోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ 2022 సెప్టెంబరు 11న తుదిశ్వాస వదిలారు. తెలుగు సినీ నటుడు ప్రభాస్ ఈయనకు తమ్ముడి కొడుకు.

హిందీ లో విజయవంతమైన 'ముకద్దర్ కా సికందర్' కి తెలుగు పునర్నిర్మాణమే ఈ ప్రేమ తరంగాలు చిత్రం. అమితాబ్ బచ్చన్ పాత్రని కృష్ణంరాజు, వినోద్ ఖన్నా పాత్రని చిరంజీవి, రాఖీ పాత్రని సుజాత పోషించారు.

పాట సాహిత్యం, గానం చాల అద్భుతంగా ఉంది కదా, ఇక ఈ పాట యూ ట్యూబ్ లో ఇక్కడ వినండి:

https://www.youtube.com/watch?v=k4lmxEBvZlo

లేదా https://tinyurl.com/TagsSong30

ఒకే!!! పాటను విన్నారా? అదేనండీ యూట్యూబ్ లో విన్నారా? మీకు నచ్చిందా? నచ్చితే మరో ముగ్గురికి షేర్ చెయ్యడం మరచిపోవద్దు సుమా?

# స్పందన

**1. From: ఇరువంటి మాధురీ నాగ దుర్గ అంజనా దేవి (హైదరాబాద్)** సెప్టెంబర్ 2, 2022 11:29:21

– ఇంత మంచి పత్రిక నడుపుతున్నందుకు ధన్యవాదములు. తెనుఁగును పరాయి చోటనూ బ్రతికిస్తున్నారు.

**2.From: డాక్టర్ పాదిలి నాగరాజు కుప్పం** సెప్టెంబర్ 2, 2022 20:00:07

ఈ పత్రికలో కథలు, నవలలు, కవితలు, విమర్శ లాంటి విషయాలతో పాటు భాష విషయాన్ని కూడా చేరిస్తే బాగుంటుందని నా అభిప్రాయం. ఇది మంచి పత్రిక. ఇందులో నేను భాగస్వామి కావడం అదృష్టంగా భావిస్తున్నాను. ధన్యవాదాలు. .

**3. From : రాంబాబు పోలుమాటి భారతదేశం** సెప్టెంబర్ 3, 2022 21:24:59

పత్రిక బాగా ఉంది. ప్రజలకు (పాఠకులకు) చేరువ కావాలి.

**4. From : రాఘవ మాస్టారు (కేదారి రాఘవ) భారత్** సెప్టెంబర్ 3, 2022 22:21:10

తెలుగు భాష,అచ్చ తెలుగు భాష పై నాకు మమకారం. సంతోషం, మీ పత్రిక బాగుంది.

**5. From : డా.వీపూరి వేంకటేశ్వర్లు – భారతదేశం** సెప్టెంబర్ 4, 2022 00:23:43

పోతన భాగవతం మీద పరిశోధన.. ప్రాచీన సాహిత్యం పై 100 వరకు నేను వ్యాసాలు వ్రాసాను. నాణ్యత కలిగిన ప్రామాణిక పత్రిక మీది.

ooo

